
# సహజ మార్గ దర్శనము

ఆంగ్ల మూలము: సహజమార్గ ఫిలాసఫి



రచయిత


**శ్రీ రాంచంద్ర**


వ్యవస్థాపక అధ్యక్షులు,
శ్రీ రాంచంద్ర మిషన్,షాజహాన్‌పూరు,యు.పి.


తెలుగు అనువాదము:


శ్రీ రాంచంద్రజీ మహారాజ్ సేవా ట్రస్టు,
కో-ఆపరేటివ్ కాలని, కడప
వారిచే ముద్రితము

# సహజ మార్గ దర్శనము

ఆంగ్ల మూలము: సహజమార్గ పిలాసపి




రచయిత


**శ్రీ రాంచంద్ర**

వ్యవస్థాపక అధ్యక్షులు,
శ్రీ రాంచంద్ర మిషన్,షాజహాన్‌పూరు,యు.పి.




తెలుగు అనువాదము:

శ్రీ రాంచంద్రజీ మహరాజ్ పేవా ట్రస్టు,
కో-ఆపరేటివ్ కాలని, కడప
వారిచే ముద్రితము



పరమపూజ్య సద్గురు శ్రీ రాంచంద్రజీ మహరాజ్ (లాలాజీ)
ఫతేఘర్ (యు.పి)



పరమ పూజ్య సద్గురుశ్రీ రాంచంద్రజీ మహరాజ్
షాజహాన్‌పూర్ (బాబూజీ)

# విజ్ఞప్తి

పరమ పూజ్య బాబూజీచే ఆంగ్లమున రచింపబడిన "సహజ మార్గ ఫిలాసఫీ' 'అను గ్రంథమునకు ఆంధ్రానువాదమిది, తెనుగు భాషయందు సహజమార్గ విధానమును గూర్చిన గ్రంథములు చాల తక్కువగా యున్నవి. ఆంగ్లభాష తెలియని తెనుగు చదువరులకు యీ గ్రంథము ఆ కొరత కొంతమేరకు తీర్చగలదని నా విశ్వాసము.

మన సంస్థచే ప్రచురితమైన మఱియే యితర గ్రంథమునందును సహజమార్గ తత్త్వము యొక్క సంపూర్ణ సమగ్రస్వరూపము కానరాదు. పూజ్య బాబూజీవారు తమ యితర రచనల నుండి ఆ యా భాగములను క్రోడీకరించి సహజమార్గ దర్శనమను ఈ గ్రంథమున విశధీకరించిరి. అన్ని గ్రంథములను చదివి ఈ తత్త్వము నర్థము చేసికొనుట సాధ్యముకాదు. కాన సాదకుల కనుకూలముగ ఈ గ్రంథమునందు వారు సిద్ధాంతము మరియు సాథన పద్ధతిని విపులముగ చర్చించినారు. అందువలననే ఈ గ్రంథమునకు ఎక్కువ ప్రాముఖ్యత ఏర్పడినది. సత్యాన్వేషకు లెల్లరును దీనిని చదివి లాభము పొందుదురని మా ఆశయము. కర్ణాటక రాజధాని బెంగుళూరులో జరుపబడిన పరమపూజ్య సద్గురు శ్రీ రామచంద్రజీ మహరాజ్‌గారి డెబ్బది తొమ్మిదవజన్మదినోత్సవ సందర్భమున ఈ గ్రంథము ఆవిష్కరింపబడినది.

అనువాదకులు.

# ప్రకాశకుల విజ్ఞప్తి

ఉత్తరప్రదేశ్, షాజహాన్‌పూరు నందలి శ్రీ రామచంద్ర మిషన్ యొక్క వ్యవస్థాపకులైన శ్రీ రామచంద్రజీగారి "సహజమార్గ దర్శనము"ను లోకమున కందించుటకు మేమానందించుచున్నాము. 'ప్రస్థానత్రయి' వంటి ప్రామాణిక శాస్త్ర గ్రంథములనుండి ఆధారముపొంది పూర్వ సాంప్రదాయ తరగతికి చేరినది కాదు ఈ గ్రంథము. ఇది సత్యసామ్రాజ్యమున గ్రంథకర్తస్ఫురణ ప్రవంతులు మరియు స్వానుభవము నుండి వచ్చినది. అందుచే జనులు దీనియందు అపురూపమైన ఆకర్షణ మరియు సాంప్రదాయ భిన్నమైన వివరణ విధానము కనుగొనెదరు.

ఇప్పటికే యీ గ్రంథకర్త యొక్క సహజ మార్గమును గూర్చిన సాహిత్యసంపద విపులముగ నున్నది. ఆయన గ్రంథములు సత్యోదయము; 'రాజయోగ ప్రభావము' 'సహజమార్గదశాదేశముల వ్యాఖ్యానము' మూడు, నాలుగు ముద్రణములైనవి. వీటినుండి, ప్రచురింపబడిన గ్రంథకర్త యొక్క యితర రచనల నుండి కొన్ని భాగములు యీ గ్రంథమున ఉన్నవి, దీని యందున గల ఎక్కువ భాగము యింతవరకు ప్రచురింపబ లేదు.

ఆధ్మాత్మిక జీవనమును స్వయముగ అనుభవించి యీ రచయిత తత్త్వము యొక్క ఆచరణ భాగమును తెలిపినారు. ఈ గ్రంథమున రెండవభాగము అంతయు ఆచరణ విధానమునకు వినియోగించినారు. ఈ విధముగ యీ గ్రంథము తెలిసియున్న యితర తత్త్వ గ్రంథములకు భిన్నముగ నున్నది.

సహజ మార్గమున గురువుపాత్ర మరియు తెలిసియున్న యితర ఆధ్యాత్మిక సాధన పథములనుండి సహజమార్గయొక్క విశిష్టతను తెలుపు అసాధారణ పద్ధతి యగు ప్రాణాహుతిని గూర్చి యొక పూర్తి అధ్యాయము వినియోగింపబడెను. నిజమునకు ప్రాణాహుతి ఉన్నతమైన దైవకృప. గురువుగారి సహాయము కోరినవారి కెల్లరకును ఉచితముగను ఉదారముగను లభించును. దైవాన్వేషకులు గురువుగారి నుండి దీనిని ఉపయోగించుకొని యధోచిత లాభము పొందుదురురు గావుత.

చూచుకొను అనుకూలమునకై అనుబంధము చివర నీయబడినది. సాద్యమైనంత

ఎక్కువమంది అన్వేషకులకు సేవచేయుఆతురతతో యీ పుస్తకము మూల్యము మనదేశమున ఐదు రూపాయలుగను, యితర దేశములందు ఒక డాలరుగను నిర్ణయించబడినది. అది దీనిని ప్రచురించుటకు అయిన ఖర్చుమాత్రమే.

జె.ఆర్.కె. రాయిజాద,
సూపరింటెండెంట్, పబ్లికేషన్ డిపార్టుమెంటు,
శ్రీరామచంద్ర మిషన్,
షాజహాన్‌పూర్ (యు.పి)

# పీఠిక

భారతదేశము తత్త్వభూమిగ పేరెన్నికగన్నది. అది చాల గొప్పదగు సాంస్కృతిక సాంప్రదాయముపై నాధారపడినది. అందువలననే శతాబ్దముల తరబడి స్వంత ఆలోచనాశక్తి, నవ్యత, సృజనాత్మక ప్రయత్న రంగమున రూపొందించుట అనునవి బాహ్యదృష్టికి లోపించినవి, సంపద్యుక్త పిత్రార్జితము, వారసత్వము చాల విలువైనవికాన వాటిని విస్మరించుట నష్టదాయకము. కాని వాటికి గ్రుడ్డిగా అంకితమగుట మనకు హానికరము. మన వంశపారంపర్య ఔన్నత్యమునకు మన యోగ్యతను నిరూపించుటకు మనము దానిని అధిగమించవలెను.

మనదేశమున సాంస్కృతిక పునరుద్ధరణ యొక్క ప్రస్తుత యుగమున భారతీయ ఆధ్యాత్మిక సాంప్రదాయ సంపదసారము నుండి అధిగమించు నమ్మికను ఆధునిక సహజమార్గ విధానము కలిగించుచున్నది. తన గురువుగారి విధానమున మరియు స్వామి వివేకానంద, బుద్ధభగవానుడు, పేర్కొనబడని వేదఋషుల వంటి పూర్వ సంస్కర్తలవలె, ఈ విధానకర్త మనకు అనాదిగ సంప్రాప్తమైన గ్రంథములకు అతీతముగ భారతీయ తత్త్వమును, దానియందుగల పరమార్థ విజ్ఞానముయొక్క మూలాధారమును తీసికొనెను. ఆ మహాపురుషుల ధోరణి ననుసరించి తన విధానమును రహస్యము చేయుటకు లేక తన నిర్ణయములను హేతువులేని సూత్రములుగా చేయుటకు ఆయన వ్యతిరేకి. "నేను కనుగొనిన సత్యమిది", మరియు "దీనిని చేరుటకు మార్గము యిది" అను వాక్యముల రూపమున నున్న వీరి ప్రవచనములు "దుఃఖముల అంతమిది" అను బుద్ధుని ప్రవచనముల యొక్క ప్రతిధ్వనివలె కనిపించును.

ఆధ్యాత్మిక రంగమున అనుభవముయొక్క భాషయందు ఉన్నది తప్పక నిశ్చయాత్మక ధ్వనియే. పాశ్చాత్యుల భావమున విమర్శన, సంశయములు ప్రధాన లక్షణములుగా కల బుద్ధి అన్వేషణ తత్త్వశాస్త్రము యొక్క ముఖ్య అంశము. ఋషుల గ్రంథములందు గల నిశ్చయాత్మకధ్వని విశాలదృష్టితో కూడియున్నది. ఈ సందర్భమున యిది సాధారణ మత సంబంధమైన మూఢపట్టుకు భిన్నమైయున్నది. మానవ నాగరికతా

చరిత్రయందు అనేకసార్లు నిరూపింపబడినట్లు యీ రెంటిమద్య వ్యత్యాసము చాల తక్కువ. అందుచే భారతీయ తత్త్వశాస్త్ర సముచితరంగమున నిష్కపట ప్రయోగాత్మక బుద్ధిగల, వైజ్ఞానిక దృక్పథము ననుసరించుట శాశ్వత అవసరమని నొక్కి చెప్పనక్కరలేదు. ఇంకొక విధముగ పరిశోధన నిజమునకు నిరూపకుని సాధన పరికరముల యొక్క ఔచిత్యము, వైఖరి, పద్ధతికి పరిశోదింపబడు దృశ్యముల స్వభావమునకు లోబడియున్నది. ఈ గ్రంథస్థ విషయమును మనఃపూర్వకముగ చదువు ఏ ఒక్కరును పరిశీలించి పరిశోధించుటకు ఈ గ్రంథకర్తయొక్క ఆహ్వానపు శ్రద్ధాభావమును గుర్తింపలేకపోజాలరు. తత్త్వశాస్త్రమందలి మత వైఖరికి వ్యతిరేకమైన పరిశోధనాత్మక లక్షణమునకు ఇంతకంటె ఎక్కువగాని తక్కువగాని ఆశింపబడ గలదియు కోరబడునదియు లేదు.

తత్త్వశాస్త్రము యొక్క స్వభావము, కార్యముల గూర్చిన గ్రంథకర్త ఉద్దేశమును సంక్షేప వివరణముతో యీ గ్రంథము ప్రారంభింపబడెను. ఇందున యీ నూతన విధానపు చరిత్ర మరియు దాని ప్రత్యేక లక్షణములు కూడ యున్నవి. తదనంతరము తత్త్వము యొక్క ముఖ్య సమస్యల గూర్చిన గ్రథకర్త యొక్క నిర్ణయములను వివరించు సిద్ధాంత భాగము వచ్చును. చివరగా, సత్యము తనకు తానే క్రమేణ బహిర్గతమగు పురోగమనస్థితుల సాక్షాత్కార విధానము యొక్క ముఖ్యాంశములను ఆచరణ భాగము తెలుపు చున్నది. ఈ గ్రంథమున ఉన్న కొంతభాగము " శ్రీ బాబూజీ" వ్రాసిన కొన్ని యితర గ్రంథములందు కలదు. ఒక ప్రత్యేక ఉద్దేశము దృష్టినందిడుకొని గురువుగారు క్రమపరచి సమర్పించిన యీ గ్రంథము యొక్క ప్రాతినిధ్య లక్షణమును నొక్కి చెప్పుటకే యిది అంతయును. సంపూర్ణత్వము, సమగ్రత్వము ఏవిధముగను ఈ గ్రంథము కలిగియున్నదనుటకు హక్కులేదు. ఇంతవరకును ప్రచురించిన, ప్రచురించని శ్రీ బాబూజీ యితర గ్రంథములతో ఈ గ్రంథము ముఖ్యముగ అనుబంధించవలెను.

చివరకు తన గ్రంథము కంటెను "శ్రీ బాబూజీ" యే ఎల్లప్పుడును ప్రధానము ఆయన ప్రాతినిత్యము వహించే సాక్షాత్కార మంతటి కొరకు అన్వేషకులను మూలమునకు ఆయన గ్రంథ పరిచయము తీసుకొని పోవుగాత, హిందూతత్త్వము యొక్క అవినాశకర ఉత్సాహము శతాబ్దముల తరబడి ఉన్న పాండిత్యస్తబ్ధత అను నిద్రనుండి నూతన పునరుజ్జీవకమునందు కొత్తగా పునరుద్ధరింపబడుగావుత. అతితృప్తి కొరకు జరిగెడు పాశ్చాత్య నిరంతరాన్వేషణతో ప్రాచ్యపురాతన జ్ఞానపు కలయిక ద్వారా తనకొరకు ఎదురుచూచు

సాక్షాత్కారము కొరకు మానవాళి ఆకాంక్ష యాడేరుగావుత, ఈ ఆశలు, ప్రార్థనలతో యీ గ్రంథమునకు చదువరులకు మధ్య నేను యింకే మాత్రమును అడ్డు నిలువదలచలేదు.

ఎస్.పి. శ్రీవాత్సవ, ఎమ్.ఎ.పి.హెచ్.డి.,
హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిలాసఫీ,
వై.డి.డిగ్రీ కాలేజి,
లఖింపూర్ - ఖేరి (యు.పి.)

# విషయసూచిక


| | | పేజి |
|---|---|---|
| ప్రథమ అధ్యాయము | : పరిచయము | 1 |
| | తత్త్వశాస్త్రము | |
| | సహజమార్గ చరిత్ర | 2 |
| | సహజమార్గము యొక్క ప్రత్యేక | , |
| | లక్షణములు | 4 |
| ద్వితీయ అధ్యాయము | : సత్యము-దాని చేతన-అచేతన | |
| | స్వరూపములు | 8 |
| | అంతిమ సత్యము | |
| | సారూప్యత | 12 |
| | విశ్వోత్పత్తి | 13 |
| | బలయు-కాలము | 14 |
| | జీవుడు-బ్రహ్మము | 16 |
| | ప్రకృతియందలి సమానాంతరత | 17 |
| | అవతారములు | 19 |
| తృతీయ అధ్యాయము | : జ్ఞానము దాని స్వభావము | 21 |
| | ఉపాయములు:తర్కము-శ్రుతి- | 23 |
| | అనుభవము | |
| చతుర్థ అధ్యాయము | : మానవుడు | 25 |
| | విశ్వమందు మానవుని స్థానము | |
| | మరియు విధి | |

మానవత్వమునకు దివ్యత్వమునకు
మధ్యనున్న సమానాంతర నిర్మూలనము
సాక్షాత్కారము మరియు దాని
ఉపాయములు
గృహస్థాశ్రమము

పంచమ అధ్యాయము : సాక్షాత్కార మార్గము-సాధకుని
పాత్ర
వైరాగ్యము
ధ్యానము
ధ్యానమునకు తొలిచర్యలు
ప్రార్థన
నిరంతరస్మరణ
భక్తి
సమర్పణము

ఆరవ అధ్యాయము : సాక్షాత్కారమార్గము -మార్గ
దర్శకుని పాత్ర
గురువు ఆయన కార్యము
ప్రాణాహుతి

సప్తమ అధ్యాయము : సాక్షాత్కారమార్గమందలి దశలు

# సహజమార్గ దర్శనము

## ప్రథమ అధ్యాయము

## పరిచయము

### తత్త్వశాస్త్రము దాని అభిప్రాయము

తత్త్వశాస్త్రము హేతువాదముపైగాక స్ఫురణపై నాధారపడినది. చాలామంది పాశ్చాత్య తాత్త్వికు లభిప్రాయపడినట్లు తత్త్వశాస్త్రము సంశయమునుండి గాక ఆశ్చర్యమునుండియే ప్రారంభమైనది. పాశ్చాత్య తాత్త్వికులవలెనే సాధారణముగాతత్త్వవేత్తలు తాత్త్విక విషయములను సాధన పూర్వకముగ గాక కేవల తార్కిక పద్ధతితోనే వివరింప బ్రయత్నించిరి. తాత్త్వికుడు తాత్త్వికుడైనంతమాత్రమున నైతికముగ పతనమగుటకుగాని, దిగజారుటకు గాని వీలులేదని చెప్పుట కవకాశము లేదు. తొలుత ఆచరిత జీవితములోనికి వెళ్ళిన పిమ్మటనే సాధారణముగ హిందూదేశమున జ్ఞానులు తత్త్వమును వివరింప బ్రయత్నించిరి. వారు తమకు వీలగునంతలో తమతమ స్థాయికే అనుగుణ్యముగ విషయరహస్యములను వెలిబుచ్చిరి. తత్ఫలితముగ వారివారి దృక్పథముల ననుసరించి ఆరు విధములైన తత్త్వములు వెలసినవి. మనమెల్లప్పుడును ఆచరణ లేక అభ్యాసము పూర్తి అయినపుడే విషయములను వ్యక్తీకరించుటకు ప్రయత్నింపవలెను. విషయములను సరిగా గ్రహించుటకు తాత్త్వికుడు గుర్తింపవలసిన కీలక మిదియే.

భారతదేశము ఆధ్యాత్మికతకు జన్మభూమి. కావుననే యిచట అన్ని కాలములందును సత్యాన్వేషణ ఉత్సాహవంతముగ కొనసాగుచుండెడిది. ఆధ్యాత్మికత యనగా ఆదిమశక్తి కేంద్రము నుండి బ్రవహించుచు గ్రంథుల రూపమున పరిణమించి సృష్టి, లయ కార్యములను నిర్వహించు సామర్థ్యముగల శక్తికి సంబంధించిన శాస్త్రము. భారతదేశమున జ్ఞానులు సృజనాత్మకమగు యాశక్తిని మానవజాతిని సంస్కరించుటకు వినియోగించిరి. దీని విపరీత, విధ్వంసకశక్తితో బోల్చిన అణ్వాయుధశక్తిగూడ

తృణప్రాయమేనగును. యోగి దీనిని భగవదిచ్ఛ కనుగుణ్యముగ, తన సంకల్ప శక్త్యానుసారముగా నుపయోగించును. వర్తమాన మందును ఈ శక్తి యుపయోగింపబడుచున్నది. ఒక నూతన ప్రపంచము సృష్టింపబడుచున్నది. ఎంతకాలము పట్టినను ఆధ్యాత్మిక పునరుజ్జీవనము జరిగితీరి, భారతదేశము మరల ప్రపంచమును నడిపించును. ఆధ్యాత్మికత లేనిదే ఏ దేశముకూడ మనుగడ సాగించుట అసాధ్యమని యితర దేశములు గ్రహింప మొదలిడినవి. రాజకీయ చతురత కపటోపాయములతోకూడిన యుగమిపుడు అతిశీఘ్రముగ గడచిపోవుచున్నది. ఈ శతాబ్దము ముగియులోపుననే మాహత్తరమైన మార్పు జరిగితీరును. తన ప్రగతిని పెంపొందించుటకు ఆధ్యాత్మిక పథమునకువచ్చి, విధిగా సంభవింపబోవు పరిణామములను సంతోషపూర్వకముగ ప్రతియొక్కరును ఆహ్వానింపవలెను. నేనిచట నొక మహత్తరతత్త్వమును బహిర్గతము జేయుచున్నాను. ప్రజలు దానిని ప్రారంభమున గ్రహించినను, గ్రహింపకున్నను, కాలక్రమమున వారది అట్టిదేనని తప్పక గ్రహింప మొదలిడెదరు.

## సహజమార్గ చరిత్ర

మహాత్ములు నిష్కారణముగ జన్మింపరు. ప్రపంచము ఆతురతతో నిరీక్షించుచున్నపుడే వారవతరింతురు. అది ప్రకృతి పరిణామ లక్షణము. ఆధ్యాత్మికతకు నిలయమైన భారతదేశము అనాది సిద్ధమైన తన యోగవిధానమును పూర్తిగమరచి అంధకారమున తడవులాడుచున్నది. సూక్ష్మమగు ఆధ్యాత్మిక తత్త్వస్థానమును స్థూలమగు భౌతికతత్త్వ మాక్రమించినది. అజ్ఞానమను కారు మేఘములు ఎల్లెడల తిరుగులాడుతూయుండినవి. యోగ జనిత ప్రాణాహుతి హిందువులకు పూర్తిగ అన్యమైపోయినది. ఆధ్యాత్మికత యిట్టి స్థితియందు నిస్సహాయముగ ఊగిసలాడుచున్న తరుణమున, పరిస్థితులను చక్కబరచి, మానవాభ్యుదయమును సాధించుటకు ఒక మహాత్ముని పుట్టుక పరమావశ్యకమయ్యెను.

1873వ సంవత్సరము ఫిబ్రవరి 22వ తేది వసంత పంచమి శుభదినమున ఉత్తరప్రదేశ్ నందలి ఫరూకాబాద్ జిల్లాలోని ఫతేఘర్ అను గ్రామమున, ప్రకృతిశక్తి మానవ రూపమున శ్రీరామచంద్రజీ మహరాజ్ వారిగా భూమిపై నవతరించినది. అట్టి యీ శుభదినము సంవత్సరమందు మిక్కిలి ఆహ్లాదకరమైన ఋతువుతో సమన్వయమై, ప్రతి హృదయమును వికసించు నవవసంతశోభతో సుశోభింపజేసినది. వీరి అవతరణము

మానవయునికి సమస్యకు ప్రత్యక్ష పరిష్కారమును నిశ్చయముగ సూచించు, మిక్కిలి ఆనందకరమగు సమయమును ప్రవేశపెట్టినది. ఆధ్మాత్మిక రంగమున వారిచే తీసుకురాబడిన అమోఘ పునరుజ్జీవనమును తలపునకు దెచ్చుకొనునపుడు, మనము భక్తి పూర్వక గంభీరానందముతో తాకిడిపొందిన వారగుదుము. జ్ఞానులలో మహోన్నత స్థితిపొందిన వారికి గూడ దువరగాహమైన ఉనికి సమస్యకు సులభపరిష్కార మార్గమును ఆయన సూచించెను.

ఈ దివ్య పురుషుడు గౌరవనీయమగు కాయస్థ వంశమునందు జన్మించెను. భక్తి యందును, పూజలయందును అత్యంతకాలము వినియోగించిన ఉన్నత స్వభావ, నిరాడంబర మాతృప్రభావము వీరి బాల్య జీవితమున పడినది. ఆమె ప్రభావమువలన పిన్న వయసుననే (దైవ) ప్రేరితుడాయెను. వీరు తమ సహచరులతో నాటలాడుకొను సమయమున, ఒకనాడు ఏదో దివ్యశక్తి, తాను నిమగ్నుడై యున్న ఆ కార్యము కొరకు జన్మింపలేదను భావమును రేకెత్తించిన సంఘటన జరిగెను. తన భావిమహత్కార్యమును నిర్వహించుటకు సాక్షాత్కారమును పొంది వారపుడే కార్యనిర్వహణకు బూనుకొనిరి. ఏడు మాసములలోనే పరిపూర్ణతను పొందిరి. ఇది నిజముగ సాటిలేని దృష్టాంతము. నాటినుండి వారు తమ యావజ్జీవితమును ఆధ్యాత్మికతకే వినియోగించిరి. మన సంస్థకు వారే అది గురువులు.

వారే మూర్తీభవించిన సౌమ్యత్వము, సహనము, భక్తి. ప్రాణాహుతి ద్వారా యోగవిద్య నభ్యసించుట యను నూతన సాధనాశకము ఆయనతోనే ప్రారంభమైనది. దానికి ఆయనయే ప్రావీణ్యుడు. మానవుడు గృహస్థాశ్రమ మందుండియే ఒక జీవిత కాలమందే ఆధ్యాత్మిక సాధనయందు పరిపూర్ణతను సాధించుటకు సులభమార్గము జూపిరి. గృహస్థ జీవితమందలి కష్టములు, బాధలు ఆధ్యాత్మిక సంపత్తులకు కావలసిన తపస్సులు, త్యాగములని వారు చెప్పెడివారు. ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతిని మన కాలమాన పరిస్థితులకు సవరించి చాలవరకు సులభము గావించిరి. గొప్ప సామర్థ్యముతోను, అధ్మాత్మిక ఘనతతోను, దివ్యజ్యోతి మన సమర్థ గురువు తన జీవితమందలి ప్రతిక్షణమును మానవాళి అభ్యుదయము కొరకే వినియోగించిరి. నిజమునకు ఆయన ప్రకృతి యొక్క అద్భుత సామర్థ్యములుగల వ్యక్తి. ఆధ్యాత్మిక రంగమున వారి కృషి సామాన్య ఊహకతీతమైనది. ఈ విద్యయందు వారి అద్భుత పరిశోధనలు సాధ్యమైనంత తక్కువ కాలమునందు, మానవుడు జేరుకొనగల మహోన్నత పరిమితి సుసాధ్యము, మరియు

సాధన యోగ్యము చేసినవి. ఈనాడు 'సహజ మార్గము' అని తెలియవచ్చినది వీరు మెఱుగులుదిద్ది ప్రవేశబెట్టిన రాజయోగమే. ఈ ఆధ్యాత్మిక ప్రతిభాశాలి ముప్పదియారేండ్లపాటు మానవాళికి సేవ గావించి, తమ 58వ ఏట 14-8-1931వ తేదీన భౌతిక రూపమును వీడిరి. వారి జీవితకాలములో వారు చేసిన కృషి ఊహాతీతము. తరువాతి తరములవారు కాలక్రమేణ వారి ప్రతిభా విశేషములను తెలిసికొందురు.

ఆ మహాపురుషుని యనుగ్రహమువలన, ఆయనకు ఉత్తరాధికారినైన నాచే, 1945 మార్చి 31వ తేదిన షాజహాన్‌పూర్‌లో వారి పేరున శ్రీ రామచంద్ర మిషన్ స్థాపింపబడినది. ఆ సంస్థ క్రమముగ ఎల్లప్రదేశముల నుండియు సత్యాన్వేషకుల నాకర్షించుచున్నది. గురుదేవుని యనుగ్రహ మీరీతిగా పనిచేయుటచే, వారి కృపవలన గల్గు ప్రయోజనములను పొందుటకనేకు లాకర్షింపబడుచున్నారన్న విషయము నాకు సంతోషకరము.

ఈ సంస్థ యందిపుడనుసరింపబడుచున్న సహజ మార్గ సాధనావిధానము మన అంతిమస్థితిని పొందుటకు, సులభము, సహజమునైన మార్గమును బ్రసాదించుచున్నది. సహజమార్గము నిత్యజీవితమునందు ఆచరణ యోగ్యములుగాని ముతకపద్ధతులను బోధింపదు. తొలుత మానవ రూపమును ధరించినపుడు యింద్రియములెట్టి స్థితిలో నుండెడివో అట్టి యాదిమస్థితికి సహజమార్గ విధానమున ఆధ్యాత్మిక శిక్షణ, వాని క్రియలను ప్రకృతి సహజముగ క్రమపద్ధతికి దెచ్చును. ఇంతియే కాదు, స్వతంత్రముగ జనించు అధోవృత్తులు, విశిష్ట జ్ఞానస్థితి ఆధీనమునకు లోబడి యుండును. అందువలననే వాటి విపరీత ప్రవర్తన ఆపబడినది. ఉన్నత కేంద్రములు దివ్యకేంద్రముల యధీనములోనికి వచ్చును. ఈ విధముగ శరీరమంతయు దివ్యత్వము పొంద నారంభించును,

## సహజమార్గము యొక్క ప్రత్యేక లక్షణములు

శంకర, రామానుజాదులు వారి అనుభవములతో జెప్పిన దేమైయుండినను, నేను చెప్పునది, వ్రాయునది స్వానుభవముపైనే ఆధారపడినది. ప్రపంచమున ప్రతియొక్కరును శాంతిని కోరువారే. వారి లక్ష్యము సాక్షాత్కారము కాదనియే దాని ముఖ్యము [illegible] వారికి శాంతి మాత్రమే లభించునుగాని సాక్షాత్కారము కాదు. అయితే సాక్షాత్కారమే లక్ష్యమగుచో శాంతి దానంతట అదియే లభించును. సాక్షాత్కార మననేమియో తెలిసికొని సంతృప్తి నొందక దాని అనుభూతిని పొందుటకు సైతము యత్నింపవలెను.

సామాన్యముగ ప్రజలు దీనిని సాధించుట కష్టమనియు, అంతియెగాకుండ యీ జన్మమందే సాధించుట దుస్సాధ్యమనియు తలచెదరు. ఏ విధముగనైనను యిది పొరబాటైన భావము. ముక్తివైపునకు కొనిపోవు కడపటి జన్మ ఇదియే గావచ్చునేమో? అది ఎవరికి తెలుసును? నిజమగు మార్గదర్శినిగలిగి, శ్రమించి కృషిచేయు సాధకుడు ఒకే జన్మలో (జీవితకాలములో), యింకను తక్కువ కాలములో గూడ ఆ స్థితిని చేరుకొనగలడని మన గురుదేవులు చాటి జెప్పిరి. దీనిని ఆయన ఋజువు చేసిరి కూడ. కాని ఆ నిరూపణ మాటలలో చెప్ప నశక్యము. మన అనుభవము మాత్రమే దానిని తెలుపగలదు.

భగవంతుడు కేవలము అరణ్యవాసి యనునట్లు అడవుల మధ్యముననే ఆయన అన్వేషింపబడగలడను ప్రజావిశ్వాసము వ్యర్థము, అర్థరహితము. భగవంతుని, ఎవని హృదయాంతర్మధ్యమున వాడే అన్వేషింపగలడని నా విశ్వాసము, కాని అందులకు ఆర్యుల మనస్తత్వము ఆవశ్యకము.

ఇంటినుండి పారిపోయి, ప్రాపంచిక బాధ్యతలను పూర్తిగ విస్మరించి, నిర్దిష్ట లక్ష్యము లేక ఉద్దేశ్యము లేనివాడై సంచరించుట ఏ మాత్రమును సమంజము గాదు. అట్టివాడు నిజమునకు ఆ వైరాగ్యస్థితి యందుండియు ప్రాపంచిక భావములను వదలి యుండుట అరుదు. సహజమార్గ సాధకుడు మానవ లౌకిక వ్యవహారము, ఆధ్యాత్మికత యను రెండు పక్షములను సమానముగ నభివృద్ధిపరచి ప్రకాశింపజేపికొనవలయును. జీవితకర్తవ్య బాధ్యతల ప్రాముఖ్యతను గుర్తెరిగి ఐహిక జీవితముతో ఆధ్యాత్మిక సాధనను సంయుక్తముగ కొనసాగించుటయే ఈ సాధన యందత్యంత ప్రధాన లక్షణము. ఈ భావములను కేవలము బోధించుట లేక ప్రచారము చేయుట మాత్రమే అభిప్రాయము కాదు, అంతియేగాక వాటి నాచరణలో పెట్టి నిత్యజీవితమందనుసరించుటయే మూలక్ష్యము.

అజ్ఞాన నిద్రయందున్న ప్రజానీకమును ఆధ్యాత్మికచింతన వైపునకు మేల్కొలిపి వారిని ప్రగతిమార్గమునకు మరల్చుటకు మన సమర్థ గురుదేవులు సహజ మార్గపద్ధతిని నూతనముగ ప్రవేశపెట్టిరి. వారి సిద్ధాంతమును మనము సహజమార్గ విధానముద్వారా ప్రచారము జేయుటయే మన సంస్థ లక్ష్యము. ఇందుకు నేటి జీవన విధానమునకే మాత్రము సరిపడనివియు అనాలోచితమైనవియు బలవంతముగ విధింపబడు కఠిన తపశ్చర్యలవంటి వానిని విసర్జించి వాటికి మారుగ సులభములు, సహజములైన పద్ధతుల ననుసరింపవలెను.

మోక్షసాధనకు లేక పరిపూర్ణస్వేచ్ఛ (బంధ విముక్తి)కు సంబంధించినంతవరకు ఎందరో పూర్వకాలపు మహర్షులు, ఈ కాలమువారును రాజయోగము మాత్రమే మానవునికి అందుబాటులోనున్న సాధన అన్న యంశమును, అదియే మానవుడు తుదిలక్ష్యమును జేరుటకు వీలుగల్పింపగలదన్న యంశమును అంగీకరింతురు. పరిపూర్ణ స్వేచ్ఛ అనగా సాక్షాత్కారమును పొందగోరెడు ప్రతియొక్కరును త్వరితముగనో, ఆలస్యముగనో రాజయోగమునకు తప్పక రావలసినదే. అవసరమైన దానిని త్రోసిపుచ్చి కొన్ని మార్పులు సవరణలు చేయబడిన రాజయోగ పద్ధతికి సహజమార్గ మత్యంత సన్నిహితము.

గురువుయొక్క ప్రాపు సహజమార్గ సాధనయొక్క ప్రత్యేక లక్షణము. ప్రాణాహుతి ద్వారా తన యోగశక్తిని సాధకునియందు బ్రవేశింపజేసి అతనిని పురోగమింపజేయుగల సమర్థుడైన గురువునెన్నుకొనుట సాధకుని గురుతరబాధ్యతయైనది. గురువు తనయందలి అంతఃశక్తులను వినియోగించి ప్రాణాహుతి ప్రక్రియద్వారా ఆ దివ్యశక్తిని అభ్యాసి హృదయమున ప్రవేశపెట్టి అతనియందు నిద్రాణమై యున్న శక్తులను మేల్కొలిపి త్వరితపరచును. తత్ఫలితముగ సాధకుడు ఆధ్యాత్మికముగ పురోగమించ మొదలిడి మరిమరి ఎక్కువ ఆనందము ననుభవించు చుండును. సాధకుడా దివ్యశక్తిని స్వీకరించుటకు తయారగుట మాత్రమే. మరియొక విధముగ చెప్పవలెనన్న సాధకుడందులకు సామర్థ్యము, అర్హతలను గల్గించుకొనవలెను. ఈ విధముగ నిరంతర శ్రమతో గూడినదై ఏది పూర్వము మిగుల కష్టసాధ్యముగా నుండినదో దానిని యిప్పు డతిసులభముగను, సాధ్యమైనంత తక్కువ కాలము నందును పొంద వీలగును. అయితే దీని నభ్యసింపవలసినదేగాని ఏ విధముగను మాటలలో చెప్ప వీలుకానిది, ఒక్క అనుభవము మాత్రమే యిందలి గుణవిశేషములను దెలుపగలదు.

అనేకులు ప్రశాంతస్థితి ఎట్టిదో చవిజూచియుందురు. నిజమైన శాంతి యొక్క యదార్థస్థితి, నిజమునకు అవగాహనాతీతము. ఇది పరస్పర విరుద్ధమునకు చోటివ్వదు. ఇది ఖచ్చితముగ శాంతియుగాదు అశాంతియుగాదు; యోగముకాదు, వియోగముకాదు; ఆనందముకాదు. తదన్యముగాదు. చివరకు అట్టిస్థితి కొరకే మన ఈ ఆవేదన అంతయును. మీరందురును అట్టి ఆవేదనను చవిజూచెదరుగావుత, ఏది ఏమైనప్పటికి దీని నలవరచుకొనుట కష్టముగాదు. అందులకు గావలసినదంతయు దృఢసంకల్పము, అకుంఠిత దీక్ష మాత్రమే. అపుడు మీరన్వేషించునదేదో అది మీ కత్యంత సన్నిహితమని లేదా మీతోనే యున్నదని

తెలిసికొందురు. అంతియెగాదు, మీరు దేని నన్వేషించుచున్నారో అది మీరే అయి ఉండవచ్చును. అందుకొఱకు మన మార్గమున చెట్లు, పొదలను దగ్ధము జేయగల్గు తీవ్ర తపన మన హృదయములో నుండవలెను.

పూర్వాచార గురుశిష్య సాంప్రదాయమును ప్రతిపాదించుట ఏ విధముగను నా ఉద్దేశముగాదు. మన సంస్థయందు  ఒకరి నొకరు అవసరమైనపుడు సహాయము చేసుకొనుచు సేవాత్యాగముతో  గూడిన సోదర భావముతో దీనిని తీసికొందుము. సహజమార్గ ఆధ్యాత్మిక శిక్షణా విధానమున కుల, మత, స్త్రీ, పురుష, వర్ణ బేధములు లేక ప్రతియొక్కరికిని ప్రవేశమున్నది. ప్రాచీన భారతీయ తాత్విక సాంప్రదాయమున యొక నూతనాధ్యాయమును ప్రారంభించిన మా గురుదేవుని అనుగ్రహమువలన సత్యాన్వేషకులు అనుభవము కలుగుటకు సాధనచేసి అపార లాభమును పొందుటకు రావచ్చును. అంతిమలక్ష్యానుభూతి పొందు యీ  సాధన యందు దయామయుడైన మా గురుదేవుని పర్యవేక్షణయే మనకు మార్గదర్శియై మన జీవిత లక్ష్యము సిద్ధింపజేయుగావుత.

# ద్వితీయ అధ్యాయము

## సత్యము - దాని యొక్క చేతన - అచేతన స్వరూపములు అంతిమ సత్యము

అంతిమ సత్యమగు భగవంతుని ఉనికిపై గొప్ప వాద ప్రతివాదములు ఉంటూయుండినవి. పరమార్థముయొక్క ఉనికిని ఋజువుసేయుటో, నిరాకరించుటో గాక, ఉచితమైన, సంతృప్తికరమైనరీతిని, దానిని నిర్వచించుటే నా ప్రధాన సమస్య. వ్యక్తిగత దుఃఖములు, కోరికలచే సృష్టింపబడి, బలపరుపబడిన అవేశపూరితమైన అంధ విశ్వాసము వివిధ సాంస్కృతిక సందర్భములలో అనేకానేక భ్రమలను కలిగించెను. తత్ఫలితముగ హేతువాది అయి యోచన చేయగల వ్యక్తికి భగవంతుని పేరెత్తినచో విసుగుజనించుట సమంజసమే.

అంతిమ సత్యమును గూర్చి పలువిధములైన అభిప్రాయములు గలవు. తమ గ్రహణశక్తి, సామర్థ్యముల కనుగుణ్యముగ దానిని పలువిధముల భావింతురు. భగవంతుడు అనంతశక్తి అనునది సర్వసామాన్యముగ నంగీకరింపబడిన భావము. అయితే అనేకత్వము భిన్నత్వముల కతీతమైన నిర్గుణబ్రహ్మ భావన తాత్విక దృష్టియందున్నది. (ఇది గుణ, క్రియ చైతన్య స్మృతుల కతీతమైనది. ఇట్టి నిర్గుణ బ్రహ్మమే మనకు గోచరించు ఈ సకల జగత్తునకు మూలకారణమనియు, మూలాధారమనియు, పరమ చైతన్యవంతమైన కేంద్రమనియు తెలియనగును. దీనినే పరబ్రహ్మమని కూడ తెలియనగును. అటుపై భగవంతుడు సర్వోత్కృష్ట సత్తయను నభిప్రాయము గల్గును. అనేక భిన్న రూపములతోను, వ్యత్యాసములతోను గూడిన యీ జగత్తును చూసి దీని సృష్టికర్త, అధీశ్వరునందు మనము నమ్ముచున్నాము. మన మాయనను ఈశ్వరుడు, సగుణ బ్రహ్మ యని పిలుతుము. సర్వశక్తి మంతుడు సర్వజ్ఞుడు సమస్త ఉత్తమ లక్షణ సంపన్నుడు అయిన శాశ్వితుడని మన మాయనను భావింతుము. ఆయనయే యీ విశ్వమునకు మూలకారణము, మరియు స్థితిలయకర్త కూడ.

మన మధోదృక్పథము నుండి జూచునపుడు మాత్రమే భగవంతుడు మతధర్మ ప్రకారము దైవము ఆరాధ్యవస్తువుగ గోచరించును. అదియే ఇంచుమించు మతము లన్నింటికిని తుది ధ్యేయము. ఈ సగుణ బ్రహ్మమే అపరాబ్రహ్మమని కూడ

తెలియబడుచున్నది. మత గ్రంథములయందు పైన చెప్పబడిన రెండభిప్రాయముల గూర్చి చాలా చెప్పబడినది. కొందరు నిర్గుణ బ్రహ్మభావన, సగుణ బ్రహ్మ భావన, కంటె శ్రేష్ఠమైనదని తలచిరి. ఇతరులు దీనికి సరిగా వ్యతిరేకాభిప్రాయము కలవారైరి. యదార్థమునకీ యిద్దరును పొరబడుచున్నవారే. వారు నిర్గుణ బ్రహ్మను, సగుణ ఈశ్వరుని కూడ పొందరు, రెండుమార్గములును ఉన్నవి. అందుకు సందేహములేదు. కాని లక్ష్యము ఒకటియే. అదియే అంతిమస్థితి లేక పరమార్థ సాక్షాత్కారము. సాధారణముగ అర్థము చేసికొనబడిన యీ రెండభిప్రాయములు ఎక్కువగ పెడత్రోవను పట్టించుచున్నవి. యదార్థమునకు భగవంతుడు, సగుణుడుకాడు, నిర్గుణుడుకాడు. ఈ రెంటికి అతీతుడు. ఆయన ఏమిగయున్నాడో అదియే ఆయన. ఆయనను నిర్గుణుడుగా ఊహించునది మనమే, ఆయనను సగుణునిగా జేయునది మనమే. కావున ఈ వివాదములను రేకెత్తకుండా చేయుటకు అది సగుణమయినప్పటికినీ,నిర్గుణమయినప్పటికినీ (మన దృష్టిని ఆదితత్త్వముపై నిలుపవలెను). అది ఏమైననను సరే దానినే మనము తప్పక ప్రేమింపవలెను.

ఎంతకాలము మనము మతపరిమితులలో కట్టుబడియుందుమో అంతవరకు మత సంబంధమగు దేవుడే మనదృష్టియందుండును. అంతవరకును మనము సాకార, నిరాకార భావములందొక దానిలో చిక్కుపడి యుందుము. రెండింటికిని అతీతమైనప్పుడే ఉన్నత ఆధ్యాత్మిక స్థితులను పొందుట సాధ్యమగును.. వాస్తవముగ మతమెక్కడ అంతమగునో అక్కడ ఆధ్యాత్మికత మొదలగును. మత మనునది సంపూర్ణ ముక్తి మార్గమున పయనించుటకు ఒక సాధకుని సిద్ధపరచు ప్రారంభదశమాత్రవే మతము యొక్క అంత్యమే ఆధ్యాత్మికతోదయము; ఆధ్యాత్మికతయొక్క అంత్యమే సత్యోదయము. సత్యముయొక్క అంత్యమే వాస్తవానందోదయము. అదియును గతించినమీదట మనము గమ్యస్థానమును చేరుదుము. మాటల కలవికాని మహోన్నస్థితి అదియే.

ఈ విధముగ ఏదేని యొక ప్రత్యేక మతము లేక తెగ, వాటి శాఖలందు మనకు భగవంతుడు కనబడడు. ఆయన ఏదేని రూపములందుగాని, వైదిక కర్మలయందుగాని కట్టుపడియుండడు. మత గ్రంథములందు కూడ కనుగొనబడడు. ఆయనను మనము మన హృదయాంతరాళమందే అన్వేషింపవలయును. నిజమునకు భగవంతుడు సూక్ష్మాతి సూక్ష్మమై నిరాడంబరమైనవాడు. అతడు స్థూలరూపములయందు లేడు. ఏవిధమైన స్థూల్యమును ఆయనయందేమాత్రములేదు. భగవంతుడు సరళుడు, మహాసూక్ష్మమైనవాడు. వాస్తవమునకు ఈ అంతిమస్థితి యొక్క సూక్ష్మత్వము, పవిత్రత దానికి మరగుపరచు తెర అయినది.

దేవుడు లేక అంతిమసత్యముయొక్క భావమును గ్రహించుటకు దేవుడు లేడు అను నాస్తికుని అభిప్రాయముతో ప్రారంభింతము. గణితశాస్త్ర పరిభాషలో దీనికి ధన, ఋణ విలువల నిచ్చుటకు వీలుండదు. దేనికి. ధన, ఋణ విలువలు లేవో దానికి గణితశాస్త్రమున శూన్యము లేక "సున్న" అని పేరు.

ఇపుడు " ఏది ఉన్నది" అను ప్రశ్నను నాస్తికుని ఎదుట పెట్టెదము, నిజస్థుడైన నాస్తికుడు ప్రతివస్తువుయొక్క అస్తిత్వము ననుమానించి నిరాకరింపగలడు. కాని శంకించి నిరాకరించుచున్న తన ఉనికిని మాత్రము నిరాకరింపజాలడు. గణిత పరిభాషలో మరల చెప్పవలెనన్న దీనిని అనుకూలముగా "ఒకటి" అని చెప్పవచ్చును.

"సున్న" యొక్క విచిత్రచర్యను గమనింపుము. ఉన్నది అను "ఒకటికి"కుడి ప్రక్కను లేదు అను "సున్న"ను జేర్చుచు పోవుచో ఆ ఉన్నది (ఒకటి) తనకు తానే పెరుగుచు ఎన్నోరెట్లగును. ఈ విస్తరణకు గుర్తింపగల పరిమితమేలేదు, అంతమేలేనిఈ విస్తరణను ఉపనిషత్తులు మిక్కిలి గొప్పదానికంటెను గొప్పది (మహతో మహీయా న్) అని పేర్కొనినవి. ఇపుడీ "సున్న"ను 'ఒకటి'కి ఎడమవైపున లేక ఋణము వైపున జేర్తుమేని దానివిలువ దశాంశ పద్ధతి ప్రకారము తగ్గుచుపోవును. మఱిమఱి సున్నలు జేరుటవలన "ఒకటి"ని "సున్న" కు మఱి మఱి సమీపస్థితికి తీసుకవచ్చును. మరల "తాను" అను దానియొక్క తరుగుదలకుఎట్టి పరిమితి యుండదు. దీనిని ఉపనిషత్తులు మిక్కిలి చిన్నదానికంటెను చిన్నది (అణోరణీయాన్) అని యుక్తముగ జెప్పుచున్నవి.

భగవంతుని అస్తిత్వములేక ఉనికి గూర్చిన వివాదము కేవలము కల్పితమని నా విశ్వాసము. మానవ చరిత్ర ప్రగతియందు అనేక మానవ సాంస్కృతిక సంఘములు తమ అపోహలతో భగవంతుని నింపివేయుటవలననే యిది నిజముగ తలెత్తినది, కావున ఈ సమస్యా పరిష్కారమునకు ఉద్వేగపూరితమైన చర్చావిధానమును విడనాడుట అవసరము, ఏలయన అది మానవుని దృష్టిని మసకపరచి గమ్యమువైపు అతని పురోగమనము నడ్డగించును.

అర్థము జేసికొనుటకు మనము దీనిని "శూన్యము" లేక 'కేంద్రము" లేక "ఆధారము" అని పిలువవచ్చును. ఆధారము లేక ఏ ప్రకృతిగాని విశ్వముగాని నిలువజాలదు. ఉనికికి యొక ఆధారముండితీరవలెను. అట్టి ఆధారమే భగవంతుడు లేక బ్రహ్మము లేక అంతిమ సత్యము. అదియే "భూమ", పదార్థముకాని పదార్థము, శక్తి గాని శక్తి.

నేనిపుడు ప్రజలకు కొంచెమైనా దెలియని ఒక నిగూఢ రహస్యము యొక్క నిజమైన విశేషార్థమును బహిరంగపరతును. సాధారణముగ "సత్" అనునదే పరవస్తువని భావించి భగవంతుని గూర్చిన విజ్ఞానమునకు అదియే కొలబద్దయని వారనుకొందురు. వాస్తవమునకు యిది అంతయును "తమ్" యొక్క మండలము మాత్రమే. నిజమైన యోగికి పొంద నర్హమైన విషయమిదియే. ఇంతవరకు చేరుట నిస్సందేహముగ మిక్కిలి కష్టము. "సత్" ను పొందుట చాల సులభమైన పని. కాని "తమ్" అని చెప్పబడుస్థితి అంత సులభముగ పొందుట సాధ్యముకాదు. దానికంటెపైగా మరేదియులేదు. ప్రజలు దీనిని గూర్చి ఎంతయో చర్చించినను కొంతమందైనను దాని సామీప్యమును పొందుటకు కూడ ప్రయత్నింపరు. అచట స్వచ్ఛత, నిరాడంబరత, శాంతికూడ లేవు. నిజమునకు అది వీని యన్నింటికిని అతీతము. ఎన్నో జీవితకాలములందు ఏళ్ళతరబడి పట్టుదలతో కృషిగావించి పొందదగినది యిదియే. ప్రపంచమున అందరికంటె గొప్ప యోగులు సైతము ఈ విషయమున లక్ష్యము చేరలేక ఆగిపోయిరని నేను ధైర్యముతో చెప్పగలను. తీవ్రముగ వాంఛింపబడు ఈ శూన్య స్థితియే నిజమైన జీవితము. అది అందుననే యున్నది. క్రియలన్నియు దానిని చేరకమునుపే ఆగిపోవును. అదియే కేంద్ర బిందువు. మానవుని సత్యస్థితి యిదియే. అన్ని ప్రయత్నములు చేసియు అనేకులీస్థితిని పొందజాలకయుండిరి.

మానవులీ "తమ్" స్థితిని వారి ప్రాణాంతకమైన శత్రువుగ భావింతురు. కాని సంపూర్ణ అజ్ఞానస్థితి ఎవనియందు ఉన్నత స్థాయిలో నుండునో అట్టివానిని ఎప్పుడైన పరిశీలించినచో అతనిలో అత్యున్నతమగు ప్రగతి మీకు గోచరించును. అతడు పసిబిడ్డవలె తన స్థితిని గూర్చిన ఎరుకయే గలిగియుండడు. అట్టివానికి అత్యంత స్వల్పమైన "సత్" యొక్క సంపర్కము గల్గినచో అతడు అపుడు తానున్న "తమ్" స్థితిని గుర్తింప మొదలిడును. ఈ రెంటి సంయోగము ఒక నూతన స్థితిని సృష్టించును. ఈ స్థితి సృష్టియొక్క మూలస్థితికి సమానము. ఇందులకు కారణ మిదియే.

కన్నులు మిరుమిట్లుగొలుపు ప్రకాశవంతమగు వస్తువేదైనను సాధారణముగ మనదృష్టి నాకర్షించును. దానిని మనము "సత్" అని సామాన్యముగ అపార్థము చేసికొందుము. ఈ ప్రకాశవంతమైన వస్తువు మాయయేగాని అన్యముగారు. దీనిని గురించి అతిశయముగా మాటలాడువారు అసత్యతత్త్వమునకు గాదుకదా తుదకు ఆధ్యాత్మిక పరిధికిగూడ దూరముగ నున్నారు. కాని ప్రజలీవిషయమున ఏదైనను వినుటకుగాని

గుర్తించుటకుగాని సిద్ధపడ జాలని యంత మాంద్యమును పెంపొందించుకొనిరి. చీకటి వెలుగులకు అతీతమైన నిజపరతత్త్వముయొక్క దృష్టి పోగొట్టుకొనిరి. ఈ సంస్థ యొక్క చిహ్నమందిదియే జూపబడినది. అది యదార్థమునకు మానవుని సంపూర్ణ పరిపక్వదశ. అట్టి స్థితినుండి పతనమగుటకుగాని, నశించుటకుగాని వీలులేదు. ఇది తత్త్వము యొక్క అతి సున్నితమైన అంశము. వెలుతురు, చీకటి కాని యీ స్థితిని మహాత్ములు సత్యపదమనిరి. ఈస్థితి దానికంటెను అతీతమైనందున అది సరికాదు. అది నిజమున కన్నిటికంటెను అతీతమైనటువంటి పరతత్త్వము యొక్క ప్రతిబింబము మాత్రమే. ఈ గ్రంథము చదువువారి యందనేకులకు యిది మిక్కిలి ఆశ్చర్యకరముగ నుండ వచ్చును. కాని నేనీ గ్రంథమును ఆధ్యాత్మికతయందు చక్కని ప్రగతి సాధించినవారికి, ఆ విజ్ఞానము గూర్చిన సమగ్రమైన జ్ఞానము కలవారికొరకు మాత్రమే ఉద్దేశించి వ్రాసితిని. దీనిని ప్రత్యక్షముగ అనుభవింపగలుగుట మాత్రమే గాని మత పరిధులలో గానరాదు. ఇది పూర్తిగ వేరుమార్గము. ఇది యొక విజ్ఞానము. ప్రకృతిని అంతర్దృష్టితో పరిశీలింపగలశక్తిని పెంపొందించిననేగాని ఏ యొక్కరును దానికి అర్హులుగారు.

సారూప్యత :

"సారూప్యత" ను గూర్చి దానిని సూక్ష్మమైన భావముగ ఊహించుటయే మేలని చెప్పుదును. అది క్రమముగ సంకల్పములోనికి పరిణమించును. దీని సరియగు భావమును తెలియజేయుట కష్టము. ఎట్లైనను, మూలముయొక్క ప్రజ్ఞమన ఎఱుక లోనికి ఏదైతే తీసుకొనివచ్చునో దానినిగ భావింపవచ్చును. మఱి యొకవిధముగ అది యించుక స్థూలమైన ఆవరణచేత మరుగైయున్న సత్యమని చెప్పవచ్చును. ఆవరణ దానికంటెను అతీతమైన ఒక వస్తువు ఉండుననను భావమును మన హృదయమునకు స్ఫురింపజేయును. ఇదియే దాని ఉనికికి కారణమైనది. అదియు కూడ దానికి కారణమైనదానిని ఒకటి కలిగియుండవలెనను అభిప్రాయమునకు మనము రావచ్చును. మన ఎఱుక నుండి తొలగిపోవువరకు ఈ కారణ కార్యపరంపర ఆ విధముగ కొనసాగవచ్చును. యోచించినచో, దీనిక సైతము ఒక కారణ ముండవలెననిపించును. కాని అపుడది మానవుని ఊహకు అతీత విషయమగును. దాని అత్యున్నతస్థితియందు "సారూప్యత"గా సూచించపబడునని చెప్పిన చాలును. దేహధారియగు ప్రతి ఆత్మయు ఇట్టి సారూప్యత గలిగి యుండవలెను. అది ఉన్నతస్థితియందు అతిసూక్ష్మము, అతిసరళము, సారూప్యత ఎంత సూక్ష్మమగునో మానవుడు జీవితమున అంత శక్తివంతుడగును.

మహాప్రళయకాలమువరకు సారూప్యత నిలచియుండును. అప్పుడది తన వ్యక్తిత్వమును లేక సారూప్యతను వీడి సమిష్టి సారూప్యత యందు లీనమగును. తరువాత అది పునఃసృష్టికి కారణభూతమగును. ఆ విధముగ అంతమొందునది వ్యక్తిత్వమేకాని సారూప్యతకాదు. క్రియ కేంద్రమున నిద్రాణమైయున్నందున అదియట్లున్నది. అచ్చట "ఉన్నది" "లేనిది" (సత్తు.. అసత్తు) మధ్య వ్యత్యాసము నామమాత్రమే.

విశ్వోత్పత్తి:

మానవుని స్మృతికందని కాలమునుండియు ఈ విశ్వమున్నది. సృష్టి ప్రారంభమును నిర్ణయించుటకు కొందరు వ్యక్తులు ప్రయత్నించినప్పటికిని నిర్దిష్ట సమయము కనుగొనకపోయిరి. సృష్టికి పూర్వము ఘనత్వము, స్థూల్యత ఏ మాత్రము లేని నిర్మల మూల స్థితియందున్న దివ్యత్వము మాత్రమే యుండినది. ప్రతివస్తువు యొక్క మూలకారణము అందున ఇమిడియున్నది. సృష్టి సంభవమునకు పూర్వము కేంద్రము చుట్టును అంతర్గత చలనక్రియ మాత్రమే యుండెను. దానియందు, ఆసన్న పరిసరములందును సృష్టి సంకల్పముండెను. దానినే మీరు ప్రథమ సంకల్పము లేక అవిద్య అని పిలువవచ్చును. అర్థము చేసికొనుటకు దానిని ప్రకంపనమనియో, క్షోభయనియో, స్పందననియో, శక్తిఅనియో లేక ఏదిగానైనను పేర్కొనవచ్చును. అదియే సృష్టికిని, దానికవసరమైన ఏ యితరమైనదానికిని అంతిమకారణము, సృష్టి సమయమాసన్నమైనపుడు అంతర్గత చలనమందు దాగి, నిద్రాణమైయున్న సంకల్పము పరిపక్వమై ఆ చలనశక్తి నంతటిని మథించి శక్తిని సృష్టించెను. అది బయటకు వేగముగ బయల్వెడలెను. సూక్ష్మాతి సూక్ష్మాణువులు సైతము వేడెక్కినవి. ఆవిధముగ తొలిరోజునుండియె ఆవరణములు ఏర్పడసాగినవి. ఎడతెగని ఉష్ణప్రభావము వలన అణువులు చలింప మొదలిడినవి. దాని తీవ్రత పెరుగుచు, ఆవరణలపై ఆవరణములను జేర్చుచు పోయెను. పెరుగుతున్న తీవ్రత, స్పందనముల ప్రభావమువలన స్థూల్యత పెంపొందనారంభించినది. గూడునందు చిక్కుకున్న పట్టుపురుగువలె ప్రతి అణువునందును చలనము మొదలిడి ద్విగుణీకృతమగుటవలన పరవస్తువు మరుగు పడినది.

ఇట్లు సృష్ట్యారంభమున ఒక్క క్షోభ, ఒక్కచలనము యుండెను. చలనమే సృష్టికి ఆధారము. భగవంతుని తర్వాత ఇదియే పవిత్రమైనది. అదియే మానవుని మనస్సు రూపమున అవతరించెను. సృష్టి సమయము ఆసన్నముకాగా సన్నాహములు ప్రారంభమైనవి.

వెల్లువలు ప్రవహించినవి. స్పందనలు ఉధృతమైనవి. గ్రంథులు రూపొంద మొదలిడి ఉరవడి పుంజుకున్నవి. మధన క్రమము ప్రారంభమైనది. వస్తువులు వ్యక్తిగత రూపములను దాల్చ నారంభించువరకును క్రియలు, ప్రతిక్రియలు మొదలిడి కొనసాగినవి. సృష్టి విధానము పూర్తివేగమును పొందెను.సజీవ నిర్జీవ పదార్థములుద్భవింప మొదలిడినవి. కాలక్రమమున నిఖిల వస్తువులును వెలుగునకువచ్చి విశ్వము రూపొందినది. ఇట్లు కేంద్రముచుట్టును గల వలయాకార చలన ప్రభావముద్వారా ప్రకృతి సృష్టింపబడినది. చలనము శక్తిని సృష్టించినది. తదనంతరము అది సృష్టికి కారణభూతమయ్యెను. ఏది విశ్వము యొక్క అద్భుతదృశ్యమునకు కారణమైనదో అట్టి ఈ ఆదిచలనము లేక క్షోభ నిద్రాణమైయున్న భగవదిచ్ఛచే క్రియలోనికి తీసుకొనిరాబడినది. క్షోభ అంతర్గత శక్తులను చలింపజేసెను. సృష్టి విధానములును చేతనత్వమును ప్రారంభమాయెను. క్షోభ, లేక ఉత్తేజముగ గోచరించిన ఆ మూల శక్తియే ప్రతి ప్రాణియందును ప్రధాన క్రియాశక్తి రూపమున ప్రవేశించినది. సరిగా క్షోభయందున్న విధముగనే, దేనియొక్క మూలమునందు ఇచ్ఛ నిద్రాణమైయున్నదో మనుష్యునందదియే మనస్సుగా తెలియబడుచున్నది. ఈ విధముగ క్షోభయొక్క భాగమైన మానవుని మనస్సు మూలశక్తిలేక అదిమ క్షోభతో చాలవరకు సారూప్యత పొందినది. అందువలననే ఆ రెండింటి చర్యలును చాలవరకు పోలియున్నవి.

'క్షోభ' కు కారణమును చూపునపుడు, సృష్టి కార్యమునకు పూర్వమంతటను పరిపూర్ణమగు ప్రశాంతత వ్యాపించియుండినదని నేను చెప్పుదును. శక్తి లేక బలము దాని మూలమునందు ఘనీభవించియుండెను. తుదకు మార్పునకు సమయమువచ్చినది. చలన శక్తి జాగృతమై వస్తువులను క్రియాత్మకము చేసెను. ఫలితముగ ప్రకృతియొక్క ఇచ్ఛానుసారముగ రూపములు, అకృతులు ఏర్పడినవి. దేనిని మనము క్రియాశక్తియని పిలువవచ్చునో, అట్టిది దీనికంతటికి మూలమందున్నది. ఏదిలేక అది పనిచేయలేకపోవునో అట్టి అధారము దానికి కూడ కావలయును. అది యొక అంతిమసత్యము, ఆవిధముగ సృష్టి, చలనముయొక్క ఫలితముగను, ఆ చలనము ఆధారము యొక్క ఫలితముగను నిర్ణయింతుము. అదియె ఉన్నది. ఉండబోవునది.

బయలు - కాలము :

సృష్టికి పూర్వమంతటను ఆకాశమే యుండెను. భగవంతుని (ఈశ్వరుని) ఉనికి తదనంతర పరిణామము. దాని దర్శనమునకు కొంతకాలము పట్టినది. ఆకాశము

అనంతము, నిరంతరము గనుక భగవంతుడును నిత్యుడు అని నిర్ణయింతుము. భగవంతుని అనంతరమే కాలమేర్పడెను. ఇట్లు భగవంతునియొక్క సృష్టికి ఆకాశమే మాతృస్థానమైనది. కాలము దాని అభావస్థితి ప్రతివస్తువును అనంతమునందంతము కావలసియేయుండును. ఎంతసూక్ష్మము లేక అదృశ్యమయినప్పటికిని చలనము ప్రతివస్తువునందుకూడ యున్నది. ఆకాశమును ఎవరు సృష్టించిరి అనుప్రశ్నకూడ అడుగవచ్చును. దైవము, విశ్వము సృష్టింపబడవలసిన ఆవశ్యకతయే ఆకాశపుటునికి కారణమైనదనుటయే యిందులకు వీలైన సమాధానము. అది ఉన్నది మరియు ఎల్లపుడు ఉండబోవునది. అందుచే నిత్యము అయితే అంతరిక్షమునె దానికి బదులుగ ఏలపూజింపగూడదు? ఋగ్వేదమునందు దీనిని గూర్చి ఒక స్పష్టమైన సూచన గలదు. కాని సరియైన విశదీకరణలేనందున అది అపరిష్కృతము అస్పష్టము అయిన నిగూఢ రహస్యముగనె ఉండిపోయినది. ఎవరైనను తనలో ఆకాశస్థితివంటి స్థితి నభివృద్ధిపరచుకొని నట్లైన, ఆతడత్యున్నతస్థితికి చేరుకొనినట్లే. అది శూన్య స్థితి యొక్క చివరి దశకు సమానమగుచున్నది. ఈ స్థితినే ప్రతియొక్కరును ఆశింపవలెను. ఈ పరిష్కారము నిస్సందేహముగా ఆశ్చర్య కరము; అంతియే గాక పూర్తిగ సరైనది కూడ. ఆకాశము లేక బయలుయే కైవల్యము. అది అణువులచే కూడబడినది కాదు. అందున ఎట్టి క్రియయు లేదు. అది అత్యంత స్వచ్ఛము. అమిశ్రమమునైనది. అయితే అది అంతర మనసునకు గోచరించునట్లు తెలుపుట బహు కష్టము.

ఆకాశము బయలు అయితే అవకాశము కాలమగును. ఈ రెండింటిలో ఒకదానితో నొకటికి విస్తార వైవిధ్యము కలదు. ఆకాశముచే సృష్టింపబడిన కాలము ఆకాశము యొక్క స్థూల రూపముగ అనుకొనవచ్చును. భగవంతుడు ఆకాశము లేక బయలుకు ప్రత్యక్ష రూపమగుట వలన నిజమునకీ విశ్వము, కాలము లేక అవకాశము యొక్క ప్రత్యక్ష రూపమైనది. అంతర వృత్తము బాహ్య విశ్వ సృష్టికి దారి తీసినది. రెంటికి మధ్య భాగమే కాల వ్యవధి. మహా ప్రళయ కాలమున జరుగునట్లు బాహ్యావరణము ఆమధ్య భాగములతో లీనమైనపుడు ఆకాశము లేక బయలు మాత్రమే మిగిలియుండును. అనగాసారూప్యత ఆకాశముగా మారును. వేరుగా చెప్పవలెనన్న సారూప్యతే అవకాశము. సృష్టి లేనపుడు పరతత్వము మాత్రమే యుండి కాలముగూర్చిన ప్రశ్నయే ఉదయింపలేదు.సృష్టి గావింప వలెనను సంకల్పము మూలాధారమునందు ఉజ్జీవించినపుడు అది సంపూర్ణముగ నిర్మలమై యున్నది. అది కార్యోన్ముఖ చలనమై శక్తిగ మారి చలన ఫలితముగ కొనసాగినది. కాని పని జరుగుటకు రంగము లేక ఆధారము సహజముగ తప్పని ఆవశ్యకము. ఇప్పుడు

మూలసంకల్పమునకు తర్వాత ఉనికికి లేదా ఇంకో విధముగ చెప్పిన కారణ కార్యములకు మధ్య ఏర్పడిన ఈ స్వల్పవ్యవధి యిదివరలోనే యున్నది. దీనికి కాల వ్యవధి లేక కాలము అని సరిగా అర్థము చెప్పవచ్చును. అది క్రియారంగముగ ఉపయోగింపబడెను. సృష్టికార్యకలాపములకు కాలము ఆరీతిగ శక్తిలో లీనమై తనకు తానే శక్తిగమారినది.

సాధారణముగ ఒక సంకల్పము ప్రగాఢమైనపుడు విరామము లాటిదిగ ఫలింపచేయును. దానికి మహత్తర శక్తిగలదు. సంపూర్ణ సామ్యత వలన కేంద్రమునందు లోతు అను ప్రశ్నయే ఉదయింపదు. కేంద్రము లేక పరబ్రహ్మ మూలాధారమైనప్పటికిని మనస్సును కలిగియుండనందున మనస్సుయొక్క ప్రత్యక్ష క్రియయైన శక్తిగమన భావము కూడ యిందు లేదు.

ఆ విధముగ సంకల్పమునకు క్రియకు మధ్య ఏది యుండునో అదియే శక్తి. దానినే కాలమందురు. మన పరిమిత సామర్థ్యము ననుసరించి మనము కూడ ఆ శక్తిని మన భాగములోనికి తెచ్చుకొంటిమి. ఈ శక్తి నుపయోగించుటకు మనము యింతకంటెను బృహత్తరమగు కేంద్రీయ శక్తితో దీనిని లీనము చేయవలెను. అదియే అంతయును మూలాధారమును. ఈ ప్రపంచమున మరేదియు అధునికమైన మెగాటన్ను బాంబు సైతము ఈ మహాశక్తితో తులదూగ జాలదు. ఆధునిక విజ్ఞాన శాస్త్రము దీని సమగ్రభావమును గుర్తించి యుండక పోవచ్చును. దానినది పొందియుండిన వినాశకర కార్యములకే వినియోగించియుండును.

మిక్కిలి దృఢమైన సంకల్పబలము వినియోగించుట వలన. ఆ శక్తిని ఏదో విధముగ భూమికి గొనివచ్చి కార్యములయందు ఉపయోగించవచ్చును. అత్యున్నత స్థితి చేరిన యోగి నిరంతరము దీనిని తెలిసియు తెలియకయు తనయందు కలిగియే యుండును. నా అభిప్రాయమునందు నిజముగ అన్ని శక్తులకును మూలమైన యీ మహత్తర శక్తిని గూర్చిన పూర్తిజ్ఞానము లేనిదే భౌతికశాస్త్రము సైతము పరిపూర్ణమైనదిగ భావింప వీలులేదు.

జీవుడు - బ్రహ్మము:

జీవుడు ప్రత్యేక వ్యక్తిత్వమును ధరించునపుడు మాత్రమే తన 'ఉనికి'ని తెలిసికొనును అదియే దాని ఉనికికి ఆధారము, అదియందు జీవుడు, బ్రహ్మము సారూప్యముగ

యుండిరి. జీవునియొక్క ప్రత్యేక వ్యక్తిత్వమే రెండిటికిని మధ్య బేధమును కలుగ జేసినది. ఇప్పుడు జీవుడు అహంకారము లేక వ్యక్తిత్వమున బంధింపబడి ఉనికిలోనికివచ్చెను. తానున్న మండలము కూడ దాని ప్రభావమును ప్రసరింపనారంభించెను. వివిధ వర్ణములు ఒకదాని వెనుక నొకటిగ దాని చుట్టును స్థిరపడ మొదలిడి దానికొక క్రొత్త వన్నెను సమకూర్చినవి. ఒక విధముగ దానియందు నానాత్వము స్థిరపడ నారంభించి. క్రమముగ అహంభావము దట్టముగను, సాంద్రముగను వృద్ధియై పెరగనారంభించెను. భావములు, భావోద్రేకములు, కోరికలు వాటి భాగములతో దీని స్థౌల్యత నెక్కువసేయ నారంభించెను. ఇట్లు జీవుడు బంగారపు పక్షివలె శరీరమనెడు లోహ పంజరమందు పూర్తిగ నిర్బంధితుడయ్యెను. ఇది అంతయు అహంకార వలయమునందు సంకల్పములు, భావోద్రేకములు, కోరికలుయొక్క క్రియ ప్రతి క్రియల ఫలితముగ సంభవించి దాని కిరణా భేద్య స్థితిని పెంచుతు పోయినది. ఇదియె సంక్షేపముగ జీవుని పూర్తి చరిత్ర. ఇపుడది సంతోషపూర్వకముగ తన ఉత్పత్తి స్థానము గుర్తింపజేయగల దానితో శక్తివంతము అయిన సంబంధములోనికి వచ్చుచున్నది. అపుడది సంతోషముతో తన యావరణముల నన్నింటిని ఒకదాని వెనుక మరియొకటిగ త్రోసివేయుట ఆరంభించును. కాని జీవుడు చలనము కలిగి యుండుట వలన అతడు తన సృష్టికర్తను (బ్రహ్మము) కూడ గుర్తెరిగియుండును. ఇట్లు 'జీవుడు' అను పదము తనయందు చలనము యోచనా శక్తికూడ కలిగియున్నది. జీవునందీ రెండును సమానంతరములు. జీవ, బ్రహ్మలిద్దరి చర్య యించుమించు సమానము. ఈ రెంటి తారతమ్యము ఏమనగా బ్రహ్మము విశ్వ వ్యాప్తియై ఉండగా, జీవుడు సంకుచిత అహంకార పరిధికే నియమితుడై యుండును. ఈ విషయమున బ్రహ్మముకూడ జీవునివలెనే తన బంధములయందే చిక్కియున్నాడు అని చెప్ప వచ్చును. దీని తేడా ఏమనగా బహుశః బ్రహ్మముయొక్క బంధనముతో పోల్చిజూచిన, జీవుని బంధనము స్థూలమును, సాంద్రమును అయి ఉన్నది. ఇద్దరికిని పరిమితులు కలవు. ఇదియే బ్రహ్మమును గూర్చిన సరియగు భావన.

ప్రకృతియందలి సమానాంతరత :

సృష్టి ఉనికిలోనికి రాకపూర్వము, ఉనికిలోనున్న ఒకే ఒక వస్తువు మూల స్థితియందున్న దివ్యత్వమే. ప్రతి వస్తువును సారరూపమున దానియందే యిమిడి యుండెను. క్షోభతో వ్యక్తత్వ క్రమము ప్రారంభమైనది. అదృశ్య (అంతర్గత) చలన మండలమున అది

మధన క్రియను పురికొల్పినది. క్రియాత్మకత పునరుజ్జీవమైనది. దానితో శక్తి ఉజ్జీవింబడి, వ్యక్తిత్వము వైపునకు తన కార్యము నారంభించెను. ఈ కార్యక్రమ విధానము పూర్తిగ దివ్యత్వముతో పొందిక కలిగియున్నను బాహ్య రూపమున దానికంటెను భిన్నముగ కన్పట్టెను. ఏలయన అది ప్రత్యక్షమగుటయే లక్ష్యముగ వేరొక మార్గము ననుసరించెను. మనుష్య నిర్మాణమునకు అది సన్నిహిత సంబంధము కలిగియుండుట వలన ఆకారణమున దీనిని మానవ మార్గమని చెప్పవచ్చును.

దైవమార్గము (పరతత్త్వమార్గము), మానవమార్గము ఈ రెండును ప్రక్క ప్రక్కనే ఒకదాని కొకటి సమానాంతరముగ వేగముగ పయనించుచు తమతమ చర్యల నారంభించినవి. కాని మూలమున సృష్టియే ప్రధానాంశము గనుక మానవ మార్గమే ప్రాధాన్యము వహించుట ప్రారంభమైనది. ఆ స్థితియందు సూక్ష్మాతి సూక్ష్మమైనప్పటికిని ప్రతి వస్తువును, మానవుడు సైతము స్పర్శకు గోచరమగు రూపముంను ధరించుట ప్రారంభమైనది. వేరొక విధముగ చెప్పవలెనన్న సృష్టినిర్మాణమునకు మానవమార్గమే ఆధారమైనది కాని దీని చర్య సమానాంతరముగ నడచుచున్న దైవీమార్గపు అంతర్గత చలనమునకు లోబడియుండినది. అందుచే శక్తియొక్క సక్రమ కార్య సరళి రూపములు, ఆకృతులు బయల్పరచుచుయుండినవి. వాస్తవమునకు దివ్యత్వముతో సంయుక్తముగ పురోగమింపకయున్నచో మానవత్వము ఇంత చక్కగ పనిచేసి యుండెడిదికాదు. క్లుప్తముగ, మానవత్వము, దివ్యత్వముతో సమానాంతరముగ పరుగిడుచు సంయుక్తముగ నిలచి యున్నది.

క్రియా పరంపరలు ద్విగుణీకృతమై అన్యవస్తువులతో బాటు మానవుడును మరీ మరీ పెరుగుతున్న స్థూలరూపము దాల్చ నారంభించెను. మానవ నిర్మాణమందు ప్రతిదియును మానవ జాతికే చెందును. అన్నిటియొక్కయు, ప్రతి వస్తువు యొక్కయు మూలమునందు దివ్యత్వము కలదు. ఈ కారణముననే భగవంతుడు మానవునియందున్నాడని చెప్పుదురు. దాదాపు అన్ని మతములవారు ఇదే అభిప్రాయము కలిగియున్నారు. మనము దివ్యత్వముతో సరిపడునపుడు, మరియు దానిని మానవ మార్గముతో కలిపినపుడు మాత్రమే మన అంతిమ ఉద్దేశము నెర వేరగలదు. ఇపుడు ఈ రెండును ఏకైక పరవస్తువుండియే అవిర్భవించినవి గాన మానవత్వము గూడ దివ్యత్వమువలె పరిశుద్ధ స్థితియందుండెను. దాని యందున్న క్రియాశక్తి అపుడు నామమాత్రముగనే ఉండినది లేక నిద్రాణస్థితి యందున్నదని చెప్పవచ్చును. క్రియా ప్రతి క్రియవలన గల్గిన సంచలనములు ఒక విధమగు జాగృతిని రేకెత్తింపనారంభించెను. వైవిధ్యములు పొడసూపసాగినవి. ఉష్ణ

శీతలములు తమ భిన్న భిన్న మార్గములలో రూపములు తయారగుటకు తోడ్పడినవి. ఇవన్నియు మానవ నిర్మాణమున ప్రవేశించెను. అతడు ఉనికి యందున్న సకల వస్తువుల మిశ్రమమాయెను. మనము ఇపుడు చేయవలసినదంతయును వాటిని మూల స్థితికి గొనివచ్చుటయే. లేక వేరొక విధముగ జెప్పవలెనన్న దివ్యత్వముతో సంబంధము నిలుపుకొనుటకు. వాటిని ముందుదుండిన సమత్వ, ప్రశాంత స్థితులకు కొనివచ్చుటయే వానియందు సరియైన మితత్వమును ప్రవేశింపచేయుటయే దీనిని సాధించుటకు ఏకైక మార్గము. సహజమార్గమున మనమిదియే చేతుము. మానవుడు పూర్తి దివ్యత్వమును పొందుట అనుదాని నిజార్థమును ప్రజలు సంపూర్ణముగ గ్రహించుటకై నేను యిచ్చట యీ ప్రకృతి రహస్యము బయలు బెట్టితిని.

అవతారములు :

ఖచ్చితముగ చెప్పవలెనన్న ఒక చిన్న సృష్టిని మనకు మనమే నిర్మించుకొంటిమి. దీని ఆధారమునకు గావలసిన పదార్థములను మనమే సమకూర్చితిమి. క్షోభను పురికొల్పిన ప్రథమ సంకల్పము తప్ప దీనియందు భగవంతుని కార్యము నామ మాత్రమే. యంత్రములన్నింటికి భూగర్భమందలి ముడి ఖనిజమెట్లు మూలమో సృష్టియందున్న నిఖిల వస్తువులకును సార రూపమున ఉండిన పదార్థమే అసలైన మూలము. భగవదిచ్ఛాశక్తి వేగమతితీవ్రమైనది. అది నేటికిని అట్లేయున్నది. తుదివరకును అది అట్లే కొనసాగగలదు. ఇందున సృష్టియొక్క అద్యంతములు ఒకే వేగమునకు రెండు చివరలుగా నున్నవి. సంపూర్ణ విశ్వ నిర్మాణము అవతరించుటకు మధ్యస్థలముననున్న నిజశక్తియే ముఖ్య సాధనమాయెను. దానికి అమోఘశక్తివున్నది. అది విద్యుత్ప్రవాహమువలె తాకిడు లను గల్గించును. దాని మధ్య భాగము కేంద్రముగ నుపయోగపడును. దానికి కొంచెము క్రింది భాగమున ప్రధాన కార్య కారణ శక్తి గలదు. అదియే కారణముగ ఉపయోగపడును. కేంద్రబిందువునకు కొన్ని మిల్లీమీటర్ల దూరమే ననిపించు మఱియొక బిందుపు కలదు. అచట తగిన పరిమితిలో చైతన్యదాయక శక్తివంటిదొకటి కలదు. మిక్కిలి దూరమునుండి చూచుటవలననే అది కొన్ని మిల్లీ మీటర్ల దూరము మాత్రమే నని నేను చెప్పితిని. కాని ఎవరైనను శరీరపు హద్దుల నదిగమించి దానిని సమీపించి చూచినచో అపుడాదూరమతనికి అంతులేని దూరముగ కన్పట్టును. కేంద్ర బిందువునకు పైకి పోవు కొలదిని ఆ శక్తి అస్పనిష్టమగును. ఆ స్థితి మనము పరవస్తువునకు అత్యంత సమీపమున ఉన్నట్లు తెలుపును. కేంద్ర బిందువు యొక్క లక్షణములతో పూరింపబడిన (శక్తిపూరితులైన) అవతారముల వంతునకు ఆ బిందువు వద్దనున్న బలవత్తర శక్తి వచ్చినట్లయిన, మానవుని

పంతునకు ఈ మందశక్తియే వచ్చిపడెను. కృష్ణ భగవానుడీ కేంద్ర బిందు మండలమునుండి అవిర్భవింపగా రామభగవానుడు అవలి చివర నుండి అవతరించెను. ఈ కారణముననే రామ భగవానుడు మానవ సామ్యత నెక్కువగ కలిగియుండెను. మనుష్యుడు కలిగి ఉండుటకు తప్పక ప్రయత్నింపవలసిన జీవితాదర్శమును అతడు ప్రదర్శించెను.

అవతారములకు సారూప్యతలేదని కొందరి అభిప్రాయము. నేను వారితో ఏకీభవింపను. వారియందు సారూప్యత లేకుండెనేని వారు శరీరధారులై తమకు నిర్ణీతములైన కార్యములను నెరవేర్చియుండకపోవుదురు. తమ పనులకు వారికి పెరిగి పెద్ద దగుచుండు భౌతిక శరీరము అవశ్యకము. ఇతరులకువలెనే వారికిని సారూప్యత పూర్తిగ అవశ్యకము.

ఒక నిర్దిష్ట లక్ష్యముకొరకు, అవతారములు తమ కప్పగింపబడిన కార్యములను నిర్వహించుట కవసరమైన శక్తులతో వచ్చెదరు. వేరుగ చెప్పవలెనన్న అది వారిని ప్రపంచమునకు తీసికొనివచ్చుటను సంస్కారములుగ వర్తింపవచ్చును. వారి కార్య సమాప్తి అయిన పిమ్మట ఆ శక్తి వారిని పూర్వస్థితికి మరలించును.

సాధారణ మానవునికి, అవతారములకు తారతమ్యమేమన మానవుడు అనేకములగు ఆవరణలచే అచ్ఛాదింపబడియుండగా అవతారము వాటిని చాల తక్కువ కలిగియుండును. దివ్యత్వము వారి గ్రహణ శక్తికి లోనైయుండగా మానవులు అట్టి ది లేని వారైరి. ఇపుడు మానవునకు, అవతారమునకు మూలమొకటియే అయినను అవతారము దివ్యత్వముతో సన్నిహిత సంబంధము కలిగియున్నది. అతనికి కావలసినదంతయు శాశ్వత భండారమునుండియేవచ్చును. సామాన్యముగ దైవప్రేరితమైన తన కార్యములను నడిపించుట కాతడు దివ్య ఆదేశములను పొందును. అవతారములు కార్య నిర్వాహకత్వమును కలిగి యున్నవిగాన మనస్సును కల్గియుండుట వారికి కూడ అవశ్యకము. కాని వారి మనస్సు నిర్మలమైనదై సమత్వముకలది. వారి కార్యములు దైవేచ్ఛ కనుగుణ్యముగనున్నవి. కావున అవతారములు బుద్ధిని లేక మనస్సును కలిగియుండరని భావించుట పొరబాటు.

నేను గమనించినంతవరకు ఈనాడు పని చేయుచున్న వర్తమాన పురుషుడు కేంద్ర బిందువునుండి వచ్చినాడని చెప్పగలను. అందువలననే మన బాహ్యదృష్టికి మందముగ లేక తక్కువగ కన్పించినను అతడు మహా బలవత్తరమైన శక్తిసంపన్నుడు. ఈ లోకమున యింతవరకు వచ్చిన ఏ అవతారమునకు మూలము యొక్క శక్తి ప్రసాదింపబడి యుండలేదు. సర్వ విషయములను నిజముగ తెలిపిన ఆ భగవంతుని అనుగ్రహము వలన నేను ప్రకృతిని గమనించి తెలిసికొన్నదానిపై నాధారపడి యీ విషయమును వివరించుచున్నాను.

# తృతీయ అధ్యాయము

## జ్ఞానము - దాని స్వభావము

సామాన్యమగు నర్థమున 'జ్ఞానము' అనగా తెలిసికొనుటయగును. అట్లే జ్ఞానము, శారీరకము, మానసికము, భౌతికము లేక ఆధ్యాత్మికములలో ఏదైనను గావచ్చును. ఈ పదము (జ్ఞానము) ఆధ్యాత్మిక అర్థమున మిక్కిలి అస్పష్టముగ ప్రయోగింపబడినదై అనేక సందర్భములలో నిజార్థము తెలిసికొనుట కష్టసాధ్యమైనది. సామాన్యుని ప్రాథమిక స్థాయినుండి అంతరిక వికాసముయొక్క ఉన్నత స్థితి వరకును దీని వ్యాప్తము విస్తరించి యున్నది. ఇది ఎన్నో భ్రమలు అపార్థములకు దారితీయును. కొన్ని మత గ్రంథముల నధ్యయనము చేసి, "అహం బ్రహ్మాస్మి" వంటి వాక్యములను ప్రతి క్షణమును వల్లించుచు తను "జ్ఞాని" యని చెప్పుకొను వానిని ప్రజలు అతని నిజమైన ఆంతరిక స్థితి ఎట్లున్నను అట్టి వానిని (జ్ఞాని)గ ఒప్పుకొందురు. వివిధ గ్రంథులయొక్క వివిధ ఆధ్యాత్మిక స్థితులను అనుభవించుచు, అభ్యాసి సాధనకాలమున పెంపొందించుకున్న మనస్సు యొక్క ఆంతరంగిక స్థితికి సంబంధించినదే నిజముగ "జ్ఞానము" ప్రతి గ్రంథియందు నెలకొనిన స్థితులను అనుభవమునకు తెచ్చుకొనుటయే నిజమునకు జ్ఞానము. గ్రంథులు అనేకములు గావున, సాధకుడు తన సాధన యొక్క స్థాయి ననుసరించి అతడు పొందు జ్ఞానము సైతము భిన్నముగనేయుండును. ఈ విధముగ ఒక వ్యక్తి పొందిన స్థాయి అనుభూతిగాంచిన జ్ఞానముయొక్క పరిమితిని నిర్ణయింపకయే అతనిని 'జ్ఞాని' యని పేర్కొనుట అర్థరహితము. జ్ఞానము యొక్క స్థితి మనము పూర్తిగ తెలుసుకొన్నపుడు, మరియు దాని ఫలితమును యిముడ్చుకొని మనము దానిలో మిళితము పొందిన తర్వాతనే జ్ఞానము యొక్క నిజస్థితి ఏర్పడును. మనమిట్టి స్థితిని పెంపొందించుకొని దాని ఎరుకయందు లీనమునొందినచో దానిని గూర్చిన దంతయు మనము తెలిసికొందుము. అట్లు ఆ మేరకు "జ్ఞానులు" అగుదుము. మన బుద్ధిబలము నుపయోగించి జ్ఞానమును సంపాదింప యత్నించుచో నది కృత్రిమమగునే గాని, నిజమైనదియు మరియు అసలైనది కాదు. ఏ స్థితియందు లీనమై దానితో సమగ్ర సారూప్యతను పొందుదుమో అదియే ఆ స్థితియొక్క యదార్థ జ్ఞానము. పరవస్తువుయొక్క అన్వేషణ కొరకై తీవ్రతపనతో నింపుటయే వివాద స్థితులందున్న జ్ఞానమిచ్చు సహాయము.

జ్ఞానము, అజ్ఞానము అనునవి రెండును ఒకే వస్తువుయొక్క రెండు చివరలు. కొంతమేరవరకును అది అజ్ఞాన మనబడును. పిమ్మట నదియే జ్ఞానముగమారును. అవి ఒకే అయస్కాంతముయొక్క రెండు ధ్రువములవలెనుండును. ఆ విధముగ విద్యలేనిదే అవిద్యలేదు. అవిద్య లేనిదే విద్య లేదు. ఒకటియున్న మరియొకటి ఉండి తీరవలసినదే. అజ్ఞానపు తెరను ఛేదించునపుడు అవిద్య, విద్య ఈ రెండును ఉండవని దాని యర్థము. అవిద్యా పరిధియందు విద్య అవిద్యలు రెండును ఇమిడి యుండును. ఈ రెండింటికిని అతీతమై నదే ఆ "తమ్" స్థితి. యదార్థమునకు అదియే సాక్షాత్కారస్థితి. అచట విద్య, అవిద్యలు రెండును లేవు. అయితే అపుడు అచట ఉన్నది ఏమి? అది ఈ రెంటిలో ఏదియును కాదు. అదియొక సంపూర్ణ అంతర్లీనస్థితి. తెలియని స్థితి లేదా సంపూర్ణ జ్ఞాన హీన స్థితి. స్థూలముగ శైశవమునందలి అజ్ఞానస్థితియని చెప్ప వచ్చును. యధార్థమునకు అజ్ఞానము జ్ఞానముయొక్క మహోన్నత శిఖరము. అనగా మనము అజ్ఞాన మట్టము నుండి బయలు దేరి చిట్ట చివరకు అంతకంటెను ఉన్నతమగు అజ్ఞానముయొక్క లేక నేను చెప్పునట్టి స్థితి యందంతమగునని భావము. జ్ఞానముయొక్క మండలము (ఆమాట యొక్క సామాన్య భావమున) కేవలము ఒక మధ్యస్థస్థితి మాత్రమే. జ్ఞానమండలమని మనము భావించునట్టి యిది అంతయు యధార్థమునకు అజ్ఞానమే.

అజ్ఞానపు తెర ఛేదించిన పిమ్మట నుదయించుదానిని జ్ఞానమని ఎప్పటికైనను చెప్పగలమా? నిజముగాకాదు. పరస్పర వ్యతిరేకములైన ఈ రెంటిని దృష్టియందిడుకొని బాహ్యమునకు దానిని జ్ఞానమని అన్నప్పటికిని నిజమునకు అది ఏమాత్రము సరికాదు. "జ్ఞానము" యొక్క అర్థమునకు అది వర్తించునా? లేదు. ఏది తాను అనుదానికి అతీతమైనట్టిదో అట్టి దాని ఎఱుకను జ్ఞానము సూచించును. సాక్షాత్కారమనగా పర వస్తువునందు లీనమగుట లేక దానితో ఏకత్వమును పొందుట. అట్టి పరిస్థితియందు జ్ఞాన ప్రసక్తి ఎన్నటికిని కలుగదు. ఇక అట్టి దానిని ఏమని పేర్కొనుట? జ్ఞాన రాహిత్యమా? తెలిసి కొనకుండుటయా? అజ్ఞానమా? మరిఏదైననా? దానిని మాటలలో చెప్పుటకు అసాధ్యమైనను సూక్ష్మముగ అది అటువంటిదేదో అయి వుండి తీరవలెను. నేను చెప్పినట్లుగ ఏది ఏమైనప్పటికిని సంపూర్ణ అజ్ఞానము అనుట ఔచిత్యమునకు చాల దగ్గరగ ఉండవచ్చును.

దివ్య మార్గమున పయనించు వాడు చీకటి నుండి వెలుగులోనికి వచ్చుచున్నట్లు భావింపనగును. చీకటి అవిద్య (సామాన్యముగ చెప్పబడినట్లు) కానిండు. వెలుతురు విద్య

కానిండు. సహజ మార్గమునకు వెలుగు దాని గమ్యముకాదు. అది అంతిమ స్థితి వైపు పయనించు మార్గమున సంభవించు నొక మధ్యంతర స్థితి మాత్రమే. అది వెలుతురు కాదు. చీకటియుకాదు. రెండింటికిని అతీతమైనది. ఆ విధముగ మనము అవిద్యనుండి బయలుదేరి విద్య (జ్ఞానము) ద్వార, విద్య అవిద్యలకు అతీతమైన దానికి పోవుదుము. వెలుగు చీకటి, విద్య-అవిద్య కానిదాని సరియైన అర్థము. తెలుపగల పదమేద్ది? ప్రపంచములోని శబ్ద సముదాయమున అట్టి పదమేదైనను గలదా? నిశ్చయముగ లేదు. కావున తొలి అజ్ఞానముయొక్క అసంస్కృత స్థితికంటెను భిన్నమైన 'సంపూర్ణ అజ్ఞానము' అని నేను చెప్పినట్లుగానే ఉండనిమ్ము.

ఉపాయములు: తర్కము-శ్రుతి-అనుభవము:-

సామాన్యముగ తాత్వికులు వస్తువులయొక్క విషయాంతరమును అంతర్దృష్టిచే కాక తర్కము ద్వారా తెలిసికొనుటకు ప్రయత్నించిరి. తర్కము సాధారణముగ లోపసహితమై యుండి మనలను విఫలులుగా చేయవచ్చును. కాని ఒక వస్తువును అనవసరమైన తార్కిక దృష్టితో గాక స్ఫురణతో గూడిన అంతర్దృష్టితో దర్శించినట్లయిన అది ఎట్టి పొరబాటునకు తావియ్యక తన మూల రూపమున కన్పట్టును. గ్రంథులు తమంత తాము విడివడుట మొదలిడినపుడు మనము విషయములను అర్థము చేసికొనుటకు ప్రయత్నింపవలెను.

గ్రంథములనుండి మనము కోరిన మార్గదర్శకత్వము అంతగా ఉపకరింపదు. ఏలయన అది తఱచు పెడత్రోవ బట్టించునదిగను, కొన్ని వేళల ప్రమాదకరముగను కూడ నుండును. గ్రంథములలో విధింపబడిన పద్ధతులు సాధారణముగ తబ్బిబ్బు చేయుచు, బాహ్య రూపమునే ప్రస్తావించును. ఓషధీగుణములను వాటి పేరులను చదివినంత మాత్రమున ఎవడును ఎన్నటికిని వైద్యుడు కాజాలడు. గ్రంథములలో మామిడిపండు వర్ణనమును గూర్చి చదివినంత మాత్రమున దాని రుచియొక్క సంపూర్ణ గ్రాహ్యముగల్గుట అసంభవము. 'తినుట వలననే రుచి తెలియును' అను లోకోక్తి సర్వ విదితము. బాహ్యదృష్టికి వేదములలో పరస్పర విరుద్ధములు గలవు. తత్ఫలితముగనే షడ్దర్శనములు. ప్రతి యొక్కరును తమ స్థాయి ననుసరించి ఏదో యొకటి చెప్పుదురు. మార్పులేని ఆ స్థితిని పొందుటయే యదార్థసాదన. అది అతీంద్రియ జ్ఞానమువలననే సాధ్యమగునది. కాని కేవలము అధ్యయనము, తర్కము, నమ్మకములు మున్నగు వానివలన సాధ్యముకానిది.

నేనే గ్రంథములను అధ్యయనము చేయలేదని నిర్మొహమాటముగ నంగీకరింతును: ఏలయన అవి ఉపయోగకరమని నేనెన్నడూ తలంచలేదు. గ్రంథ పఠనమును విద్యాంసులకు, పండితులకు వదలివైచి నేను పొంద నర్హమైనదిగ భావించిన పరవస్తువునందె దృష్టి ఉంచితిని. నేనేమి చెప్పినను వ్రాసినను అది కేవలము నా సాదనయందు సాక్షాత్కారపథమున స్వంత అనుభవముపై ఆధారపడినదేగాని శంకరులు, రామానుజులు చెప్పిన వాటితో నిమిత్తము లేనిది. ఇప్పుడు నేను అప్పుడప్పుడు చదువుదును. అది కేవలము వినోదముకొరకే. భావము సులభముగ ప్రకటించుటకు నేను సాధ్యమైనంత జ్ఞాపకముంచుకొనుటకు ప్రయత్నింతును. శంకరాచార్యునిచే వ్రాయబడిన వివేక చూడామణి యందు నేను చదివినదొకటి జ్ఞాపకమున్నది. దాని యర్థము 'సాక్షాత్కారమునకు గ్రంథములు తోడ్పడవు. మరియు సాక్షాత్కారము లభించిన పిమ్మట గ్రంథములు నిరుపయోగములు.

పాపాత్ములకు నరకము, అజ్ఞానులకు స్వర్గము, అమాయకులకు బ్రహ్మలోకమును గలవు. కాని పండితులకు, విద్యాంసులకు వారే కల్పించుకొన్న కృత్రిమ స్వర్గమున్నది. మరియు బలహీనులకు అనిత్యమైన ఈ ప్రపంచమును కలదు. కాని ఎవరు బలహీనులు? స్వశక్తిపై ఆధారపడలేని వారు మాత్రమే. శాస్త్రములు ఒకదాని నొకటి ఖండించుకొనును. అవి మనము ఆలోచించి ఒక పరిష్కారమునకు వచ్చుటకు అవకాశము కల్పించును. కావున నవి ఉపయోగకరములు. వానియందు మరియొక సుగుణమును కలదు. అవి భిన్నరుచులు గలవారికిని, వేర్వేరు మానసిక ప్రమాణములుగల మేధావులకును అధ్యాత్మిక పురోగమనమునకు మార్గములు, పద్ధతులను ప్రదర్శించును. నేను గ్రంథముల ద్వారా సాక్షాత్కార మార్గమున నడచియే యుండినచో దివ్యత్వమునకు ప్రాథమిక ధర్మమైన 'అజ్ఞాన' స్థితిని పొందగలిగియుండక పోవుదును. అచరిత జీవితమే పొందనర్హమైనది. సాక్షాత్కారమును గూర్చి తెలిసికొనుట మాత్రమే చాలదు. మనము దానిని పొందుటకు కూడ ప్రయత్నించవలెను.

# చతుర్థ అధ్యాయము

## మానవుడు

విశ్వమందు మానవుని స్థానము మఱియు విధి:

ఈ విశ్వమేతీరున ఉద్భవించియుండును అని యోచించుట కంటెను దానిని సృష్టించిన కర్తను శ్లాఘించవలెనని నేను సలహా ఇచ్చెదను. స్థౌల్యము, కాంతి చొరరాని ఆవరణల పరంపరతో కూడిన వ్యక్తిగత భౌతిక ఉనికియొక్క చిన్న సృష్టిని మనము నిర్మించుకుంటిమి. ఇపుడు చేయవలసిన దేమన, కాంతికి అభేద్యమైన ఆ యావరణములను ఒక్కొక్కదానిని ధ్వంసము చేసి, సృష్టికాలమున మనకుండిన సత్య స్వరూపమును దాల్చ వలెను.

ప్రస్తుతము అత్యంత స్థూలరూపముననున్న మన ఉనికి తటాలున లేక ఆగంతుకముగ వచ్చినదికాదు, కాని అది క్రమవృద్ధి ఫలితము. విశ్వ నిర్మాణమునకు హేతువైన అదృశ్య చలన శక్తియే సర్వశక్తి మంతుడైన భగవంతుని ప్రథమ మనస్సు. దేనినైతే మనము ప్రథమ మనస్సుఅని పిలుదుమో అదియే మన ఉత్పత్తికి కారణము. మనస్సు వెనుక కేంద్రము లేక 'తమ్' స్థితి గలదు. సృష్టి కాలమునకు ముందే ఆత్మయునికి గోచరించును. అపుడది స్వచ్ఛమై ప్రత్యేక ఉనికిగా నుండెను. అత్యంత సూక్ష్మరూపమున నున్న ఆత్మయొక్క ప్రాథమిక స్థితినుండి మనము ఉనికి యొక్క స్థూల, స్థూలతర రూపములకు నడచితిమి. వీనినే ఆత్మచుట్టును ఏర్పడిన ఆవరణలని చెప్పవచ్చును. తొట్ట తొలినందు ఆవరణలు మిక్కిలి సూక్ష్మములు. అట్టి వానితో మనము మన జన్మస్థానమగు సామ్రాజ్యమునందుంటిమి. అహంకార ఆవరణ పరంపర కొనసాగిన తదనంతరము మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారములు ముతకరూపములలో చేరి మన స్థూలత్వమునకు దోహదము చేయ ప్రారంభించినవి. కాల క్రమమున సంస్కారము లేర్పడుట ఆరంభమై, వాటి ఫలితముగ నేర్పడిన గుణములను తీసికొనివచ్చినవి. సగుణ, నిర్గుణములు కనపడినవి. క్రమముగ ఉనికి అత్యంత స్థౌల్యమును దాల్చినది. సుఖ,దుఃఖ, సంతోష, విషాద

భావములయొక్క ప్రారంభము సంస్కారముల ఫలితములే. అనందములు, సుఖముల యందాసక్తియును, దుఃఖ విషాదములయందు నిరసన భావములు యింకను చిక్కులను సృష్టించినవి. ఫలితముగ మనము బాధలు, దురవస్థలచే చుట్టబడితిమి. వాటినుండి విడివడుటయే మన పరమ లక్ష్యముగ భావింతుము.

మానవుడు రెండు ధృవములున్న ప్రాణి దాని ప్రారంభము మూలాధారమునకు అతి సమీపముగనున్నది. రెండవ చివర ప్రపంచము వైపున ఉన్నది. ఏదో విధముగ వ్యక్తిగత మానసమును విశ్వమానసము వైపుకు రూపొందించుకొనిన అది దాని నిజ స్వరూపములో కనపడుట కారంభించును. యధార్థమునకు సృష్టిని ఉనికిలోనికి తెచ్చుటకు ప్రకృతిశక్తిని చలింపచేసిన క్షోభయొక్క ప్రతిబింబమే మానవుని మనస్సు. ఆ విధముగ వ్యక్తిగత మానసము సమిష్టి లేక భగవంతుని మానసము (క్షోభ) నందలి భాగమే. ఎట్లో దానిని దాని అధః ప్రసారములను మూలాధారము వైపునకు మరల్చినచో అది నిశ్చలము. స్థిమితము, ప్రశాంతమునగును. స్వానుభవముబట్టి నాకు తోచినదే మన ఒక శక్తి సంపన్నుడైన మహాత్ముని సహాయము మాత్రమే దానిని మూలాధారము వైపునకు మరల్పగలదు. అట్టి మహాత్ముని శక్తి, యిచ్ఛమాత్రమే ఈ విషయమున గణింపదగినవి. చదువుట, వ్రాయుట నిరుపయోగములు. శ్రద్ధ, భక్తి, ఆత్మ విశ్వాసముగల మానవుడే జయము పొందగలడు.

మానవుడు ప్రకృతియొక్క పరికరము. అతడు అమితమైన శక్తిగలవాడు. ఆ శక్తిని వినియోగించు పరికరము కూడా అతనికికలదు. అద్భుతమైన ఆ పరికరము అతని మనస్సు. అది ప్రత్యేముగ మనుష్యునిదే. పూజ్య వస్తువని తలపబడు భగవంతుడు కూడ మనస్సును కలిగి యుండలేదు. జంతువులకు మనస్సు ఉన్నది కాని అది వేరొక విధమైనది. పూర్ణచైతన్యము, క్రియాత్మకత కలిగిన మానవుని మనస్సుతో పోల్చిన ఇది జడస్థితియందున్నదని చెప్ప వచ్చును. మనస్సుయొక్క మూలము సృష్టిని ఉనికిలోనికి తీసి కొని వచ్చుటకు భగవదిచ్ఛచే కల్గిన మొదటి క్షోభయే, మానవుని మనస్సుయొక్క ప్రకృతి అట్టిది గాన కపట మహాత్ములు దానిని మానవునికి పరమ శత్రువని చాటి కఠోర పదములతో నిందించుట చాల తప్పు. దాని వాస్తవిక ప్రతిభ, విలువలను వారు పరిగణింపరు. నిజమునకు విషయములను కార్యరూపమునకు కొని వచ్చుటకు అదియే ఏకైక సాధనము. మానవుని చిన్న సృష్టిని ఉనికిలోకి కొనివచ్చిన ప్రథమ విశ్వ శక్తియొక్క సంక్షిప్త రూపమిదియే. ఆ శక్తి ఎవరిది, దేవునిదా లేక మానవునిదా? సమాధానము సులభము. అది ఖచ్చితముగ

మానవునిదే. ఏలన దేవునికి మనస్సులేదు అది ఉండియే యున్న అతడును సంస్కార ప్రభావములకు లోబడి ఉండియుండును. కావున మూలమున పని చేయునది మానవ మనస్సుయే అయి ఉండవలెను.

మానవ దేహమందలి ప్రతి అణువును అమోఘ శక్తిని కలిగియున్నది. విశ్వమంతయు దానితో సన్నిహితముగా సంబంధము గల్గియున్నది. వెన్నుపామునందలి ప్రతి స్థానమును అన్నిటికంటె ఎక్కువ శక్తితో నిండి యున్నది. కాని దాని నింతవరకును ఎవరును గమనింపలేదు. ప్రజలు కుండలిని లేవపుటకు మాత్రమే వెర్రిగ కాంక్షించు చు గోల పెట్టుచున్నారు. వివిధ మొదటి కణములయొక్క బీజములో కూడియుండిన ప్రతి అణువునందున్న తీవ్రశక్తి కుండలి నీ శక్తిని అధిగమించును. కాని దాని నింతవరకు ఎవరును మానవ శ్రేయము కొరకు వినియోగింపలేదు. ఎందరో జ్ఞానులకు నా అభిప్రాయము అంగీకార యోగ్యము కాక పోవచ్చును. నేను వారికి నిదర్శన పూర్వకముగ చూపినను దానిని గ్రహింపగల సూక్ష్మ గ్రాహకశక్తి వారి యందుండక పోవచ్చును. ప్రజలు దీనిని గ్రహించి అనుభూతిపొందగల కాలము ఎట్లయినను రాక తప్పదు.

## మానవత్వమునకు, దివ్యత్వమునకు మధ్యనున్న సమానాంతరత నిర్మూలనము:

భగవంతుడు మానవుని తన రూపములోనే సృష్టించెనని సామాన్య విశ్వాసము ఈ విషయమున ప్రపంచమున అన్ని మతములు, తత్వశాస్త్రములు, విజ్ఞానశాస్త్రములు ఇంచు మించు ఏకీభవించును. మాంసము, ఎముకలు, చర్మము మొదలగునవి చేతులు కాళ్ళు, మరియు ఇతర అవయవములు గల మానవుని వలెనె భగవంతునికి శారీరక రూపమున్నదని అర్థము కాదు. మానవుడు ప్రకృతియందున్న శక్తి బలము, సామర్థ్యములతో అదే క్రమ పద్ధతిన నిర్మింపబడియున్నాడు, లేదా కలిగి యున్నాడని దీని నిజ భావము.

మానవ నిర్మాణము సరిగ్గా విశ్వ నిర్మాణమువలెనే యున్నది. ఈస్థూల బాహ్య ప్రపంచము వెనుక ఎన్నియో సూక్ష్మ సూక్ష్మతర ప్రపంచము లున్నయట్లే మానవుని స్థూల భౌతిక రూపము వెనుక యెన్నియో సూక్ష్మ, సూక్ష్మేతర రూపముల ఉనికి యున్నది. మిక్కిలి బాహ్యమైనది స్థూల శరీరము, దాని వెనుక సూక్ష్మ, కారణ శరీరములు కలవు. ఈ మూడు

బాహ్య రూపములే కాక అసంఖ్యాకములగు సూక్ష్మాతి సూక్ష్మ రూపములు గలవు. మేధావులు వీటిని దేహములనక, ఆత్మ చుట్టును గల సూక్ష్మ ఆవరణములని యందురు. అవి అసంఖ్యాకములు గనుక వాటిని విడిగా పేర్కొనుట సాధ్యము కాదు. విశ్వము లేక భగవంతుని సమగ్ర దృగ్గోచర రూపమునకు నిజ ప్రతిగ మానవుడీ భౌతిక ప్రపంచమున సూక్ష్మాతి సూక్ష్మమునుండి స్థూలాతి స్థూలము వరకు అసంఖ్యాకములైన ఈ అన్ని రూపములతో ఉన్నాడు. అత్యంత బాహ్య పరిధినుండి మిక్కిలి లోపలి కేంద్రము లేక సున్న వరకు గల పూర్ణ వృత్తమున మానవుని అస్థిత్వము సూచించబడినది. అతని ఉనికియున్ను, భగవంతుని దృగ్గోచర రూపమున్ను నిజమునకు ఒకటియే కావున భగవంతుని తెలిసికొనుటయే, తన్నుతాను తెలిసికొనుట. అట్లే తన్నుతాను తెలిసికొనుటయన భగవంతుని తెలుసుకొనుటయే. సకల జగత్తును అదే బిందువు (శూన్యము) నుండి క్రమ వృద్ధి మార్గమున ఉనికిలోనికివచ్చెను. అట్లే మానవుని ఉనికిగూడ ఆబింధువు నుండియే పెంపొందినది.

ఏదేని ఒక రూపమున, మత ఆసక్తి ఎల్లప్పుడు ప్రవహించుచున్న దేశమునకు మనము చెంది యున్నాము. మనము దేని నుండి వచ్చితిమో ఆ సత్యతత్వముతో ఐక్యత పొందుటకు శిక్షణ పొందితిమి. అనంతముయొక్క సారమునే మనము తెచ్చుకొంటిమి. భగవంతుడు మనుష్యుని యందున్నాడని చెప్పుదురు. మనము దివ్యత్వముతో సమ పథము గలిగి, దానిని మానవ మార్గముతో కలిపినపుడే మన అంతిమ ఉద్దేశము ఆ విదముగ నెరవేరును. మొదట చెప్పిన వీధముగ సృష్టిమూలమున మానవత్వము దివ్య త్వమునకు సన్నిహితమైయుండెను. సృష్టి క్రమమున క్రియ ప్రతిక్రియలచే ఏర్పడిన కుదుపుల ఫలితముగ అది స్థూల రూపమును వహించెను. దివ్యత్వముతో ఈ సంబంధమును పరిరక్షించుటకు మానవ నిర్మాణమందలి భాగముల నన్నింటిని మరల వాటి మొదటి సమత్వ ప్రశాంత స్థితులకు కొనిరావలసినదే. వాటి యందు సరియగు మితత్వమును ప్రవేశపెట్టుట వలన ఇది సాధింపబడినది. మేము సహజ మార్గమున చేయునదదియే. సమత్వస్థితిని కాపాడుకొనుటకు మన యిచ్ఛా క్రియచే అసౌమ్యత్వను తొలగించుటయే మన నిత్య ద్యాన సాదన యొక్క నిజ ఉద్దేశము. ఈ రీతిని మనయందలి మానవత్వము, దివ్యత్వముగ పరిణమించుటకు ఆరంభమగును. మానవ దైవీకరణ అనుదాని సరి అయిన అర్థము నిజముగ ఇదియే. ఇది జరిగిన పిమ్మట సమానాంతరత్వము మాయమయి ఈ రెండును- దివ్యత్వము, మానవత్వము- ఇంచు మించు ఒకటియే యగును. తన శరీరము

తనతో ఉన్నంతవరకు మానవత్వమెన్నటికిని పూర్తిగ నిర్మూలనము కాదు. ఆరీతి సహజమార్గ పద్ధతిలో ధ్యానఫలితముగ మానవ మార్గమున పనిచేయుచున్న శక్తి తీవ్రతను క్రమముగ తగ్గించుచూ పోవుదుము. దివ్యత్వము ఆ విధముగ ముందుకు పోవునారంభించును, సమానాంతరత్వము నశింప నారంభించును. వేరొక విధముగ చెప్పవలెనన్న మానవత్వము దివ్యత్వశక్తితో పూరింపబడి ఆ దివ్యత్వమే కాల క్రమమున అంతట వ్యాపింప నారంభించును. పరిస్థితులు పూర్తిగ కుదురుకున్నపుడు, సమానాంతరత్వము పోయి, మానవత్వము దాని సృజన శక్తితో బాటు గుర్తింపరాని స్థితికి క్షీణించును. ఈ రీతిగ భగవంతుడు అనంతుడుగాన మానవుడు అత్యున్నత స్థాయినుండికూడ మానవత్వము యొక్క మండలములోనే అదే విధముగ ఉన్నాడు. మానవ పరిమితులను దాటినంతనే ఆత్మ వ్యాకోచము అపరిమితమయి ఈ విశ్వమంతయు తనయందే ఉన్నట్లు కనిపించును. అపుడు విశ్వమందు ఎచట ఏ తాకిడి కలిగినను అది తన హృదయమున ప్రతిధ్వనించును. అంత ప్రకృతియందలి ప్రతి ఒక్కటియు అతని ఎఱుక అనుభవములందుండును.

సాక్షాత్కామము మరియు దాని ఉపాయములు:

ఎప్పటి నుండియో ముఖ్యముగ భారత దేశమున మానవ ప్రయత్నము (పురుషార్థము) మరియు ఉనికికి దైవ సాక్షాత్కారమే లక్ష్యమని చాటింపబడుచుండెను. దైవము (అంతిమ సత్యము) ఎట్లుండునను భావనవలెనే భగవత్సాక్షాత్కారము అను భావనకూడ నిగూఢ రహస్య కోశములలో ముసుగుపడియుండెను. ఇందువలన సకారణముగా యోచన చేయువాడు, విజ్ఞాని, భగవంతుడు అను శబ్ద ఉచ్చారణ మాత్రముననే విసుగు చెంద మొదలిడును.

పాండిత్యముగల మహాత్ములు అనేకులు భగవత్సాక్షాత్కార స్థితిని అనేక విచిత్ర రీతులలో నిర్వచించియున్నారు. కాని నాకది నిర్వఛింపగలిగినంతవరకు అది సాక్షాత్కారముగాదు. అది వాస్తవమునకు వివరింప వీలుగాని యొక మూగ స్థితి. అంతర్బాహ్యములయందు కాంతిని చూచుటగాని, భావించుట గాని సాక్షాత్కార మెన్నటికిని గాదు. నా అభ్యాసపు తొలిదినములలో నేను తఱచు కాంతి ననుభవించుట దర్శించుట జరిగినది. కాని అది నాకు లక్ష్యముకాదు గాన నా గురుదేవుని మెలకువతో గూడిన సహాయమున నేను పురోగమించితిని. నిజముగ అది రుచిలేని స్థితిమార్పులేనిది మరియు ఒకే రకమైనది. పదముయొక్క సామాన్యార్థమున మనోహరత్వము, ఆకర్షణ, ఆనందము

అచటలేవు. అట్టి దానిని సొంగ్ ఇ -బేనమక్ (ఉప్పన 'లేని' ఉప్పు) అని వర్ణించుటయే సరియైనది కాగలదు. సాక్షాత్కారస్థితిని పొందియున్నవాడు ఆధ్యాత్మిక రంగమున ఓటమి నెరుగని సంకల్పశక్తిని పెంపొందించుకొనును.

సాధారణముగ విద్వాంసులు తమ పాండిత్యముపై ఆధారపడి సాక్షాత్కారములేక దాని స్థితులను గూర్చి తమ అభిప్రాయమును వెల్లడింతురుగాని వారి స్వంత పరిశోధనా జ్ఞానము(ఏదైతే నిజమైనదో) పై ఆదారపడికాదు. అకారణముగ సాక్షాత్కారమనునది యొక ఆధునిక కళగా మారినదని చెప్పుటకు విచారించుచున్నాను. వాస్తవమునకు పరతత్వము వారి అభిరుచులకును నేర్పునకును అనుగుణ్యముగ దాని వన్నెలను బయట వీడి అది అట్టడుగునకు గ్రుంకి పోయినది. తత్ఫలితముగ ప్రజలు చిత్రములపైననే దృష్టిని కేంద్రీకరింప మొదలిడి అధ్యాత్మికతయు కాదు, పరతత్వముకాదు అను నంతవరకు నిమగ్నమైరి. దివ్య జ్ఞానము జాగరూకమై యదార్థముగ సాక్షాత్కారము పొందనివానికి ఆ విషయమును ప్రస్తావించుటకైనను హక్కులేదని నా విశ్వాసము. ఈ సమస్యా పరిష్కారమునకు ఆచరిత జీవితము మాత్రమే కావలసియున్నది.

సాక్షాత్కారము వేల సంవత్సరముల పర్యంతముకూడ మానవునకు అరుదుగ ప్రసాదింపబడు మార్పులేని స్థితిగ నిర్వచింపబడిన బాగుండును. కాని సంపూర్ణముగ సాక్షాత్కారమును పొందిన గురుదేవుడు లభ్యమైనచో మరియు అభ్యాసికూడ దానియందు తీవ్రమైన ఉత్సాహము, ఆతురత కలవాడైన అది చాల సులభముగ పొంద సాధ్యము. కాని 'ఉన్నది' (అస్థిత్వము) అను భావమున్నంతవరకును అది పూర్తి సాక్షాత్కారముకాదు. అందు వలన ఆనందము అనునది కూడ లోపమే అని చెప్పవచ్చును.

సాక్షాత్కారమన నేమియో మొదట తెలియనిచ్చిన తరువాతనే పూజ ప్రారంభింతుమని నన్ను తరచుగ అడుగుదురు. ఇది ఎట్లున్నదనగా 'తొలుత' షేక్స్పియర్ లేక మిల్టన్ భావములను గ్రహించుకున్న పిమ్మటనే అక్షరములు నేర్చుకొన ప్రయత్నింతును. అని అన్నట్లుండును. 'భగవంతుని సాక్షాత్కారము పొందనివ్వండి. తరువాతనే ఆయనను పూజింప మొదలిడుదును'. అని ఒక అభ్యాసి అన్నట్లుండును. అన్వేషించునదియే నీకు దొరికినపుడు పూజింప నీకవసరములేదు. తాను తక్కువ స్థితియందుంటినన్న గుర్తింపును తానే సృష్టించుకొన్నవాడు మాత్రమే ఉన్నతస్థితిని పొందగల్గును. భారతీయ

తత్త్వసాంప్రదాయమునందు అధ్యాత్మిక అసంతృప్తియే ప్రయత్నమునకు ప్రారంభదశయని సరిగా గుర్తింపబడుచున్నది.

దివ్య పురుషుని ఉనికివలన ఈనాడు సాక్షాత్కారము మిక్కిలి సులభమైనది. సామాన్యముగ ప్రజల ఆలోచన మోక్షము వరకే పరిమితమైనది. దానిని దాటిపోదు. దానినే వారు మానవుని తుది గమ్యము అని భావింతురు. కాని అది తప్పు అభిప్రాయము. నిజమునకు దైవీ మార్గమున మోక్షము మిక్కిలి తక్కువ అయిన స్థితులలో ఒకటి. కావున అది పిల్లలాడుకొను ఆటవస్తువు వంటిది. అందుపై సాధించవలసినది యింకను ఎంతనో కలదు. అనంతమహాసాగరమింకను ముందున్నది. దాని వ్యాప్తి అపరిమితము. దాని యందు మాత్రమే నీ దృష్టిని లగ్నము చేసి దానినే తప్పక గుర్తించుటకు ముందు ముందుకు సాగిపోవలెను.

నిర్వికల్ప సమాధికూడ యోగసిద్ధియే కాని అది సమస్యను పరిష్కరింపజాలదు. ప్రాపంచిక కార్యములు బాధ్యతలయందొక డెంతనిమగ్నుడైనను సరే ప్రతిక్షణమును శుద్ధము సరళమును నైన పరమసత్యముతో సంబంధించి ఉండుటయే సమాధియొక్క నిజస్థితి, ఇదియే అత్యున్నత ప్రాప్తులలో ఒకటియును, నిర్వాణమునకు మూలాధారమును అగు సహజ సమాధి అని తెలియబడుచున్నది. దీని ఉన్నత లక్షణములను మాటలతో వర్ణింప శక్యముకాదు. ఎవడు దానియందు నిష్ఠుడై యుండునో అతడే దానిని సాక్షాత్కరించుకొనును. దాని పేరు సూచించినంత సులభముకాదు. కబీరు మహనీయునిచే యిది మిగుల ప్రశంసింపబడెను. అదియే పొందదగినది.

సాక్షాత్కారమునకు అనేక ఉపాయములు. సాధనములు నిర్ణయింపబడినవి. అందుండి నిశ్చయముగను, శీఘ్రముగను ఫలితము నిచ్చుదానిని వినియోగించుకొనవలెను. అది ఏదో ఎవరికి వారే తీర్మానించుకొనవలెను. సూచన ప్రాయముగ ఈ విషయమున స్వామి వివేకానందుని విజ్ఞతాపూర్వకమగు అభిప్రాయమును నేనొప్పుకుందును. అది "మనుష్యుని అత్యున్నత స్థితికి విజయవంతముగ గొనిపోగలది రాజయోగము మాత్రమే తన అంతశ్శక్తులను ప్రాణాహుతి ద్వారా వినియోగింపగల సమర్థుడే మార్గదర్శి లేక గురువుగా నుండ నర్హుడు.' అని హఠయోగము ఆజ్ఞాచక్రము దాటిపోజాలదని నేను రూఢీ పరచగలను. అంతేకాదు దానియందు వేరొక తీవ్రమగు లోపముకూడ కలదు. హఠయోగము యొక్క శారీరిక పరిశ్రమలతో మనము మొదలిడునపుడు అంతర్గతమై ఉన్న 'నేను అను

భావముతో కూడి శారీరిక యత్నముల యొక్క ప్రజ్ఞకూడ నిరంతరము ఉండును. అప్పుడు అహంకారము క్షీణించుటకు బదులు వృద్ధి నొందుచుండును. రాజయోగమున అట్లుగాక నిర్విరామముగ పనిచేయు చిత్తవృత్తులను ప్రశాంతపరచుటకు అతడు సూక్ష్మాతిసూక్ష్మములైన ఉపాయములనవలంబించి పురోగమించుచుండును. అంతేగాక ఈ సాధనచేయునపుడు అతడు తన గమనమును అత్యంత సూక్ష్మమైన దానియందు నిలుపుట వలన శరీర ప్రజ్ఞనుండి నిరంతరము దూరముగ నుండును.

సూక్ష్మతత్వమును సాక్షాత్కారము పొందుటకు అట్టివే యగు సున్నితమును సూక్ష్మమును అగు ఉపాయముల నవలంబింపవలెను. సరళమగు సమస్యను పరిష్కరించుటకు జటిలమగు పద్ధతి నుపయోగించినపుడే చిక్కులు తలెత్తును. అనగా అట్లు చేయుట ఒక చిన్న సూదిని పైకెత్తుటకు పెద్ద క్రేనులను (బరువులను ఎత్తిదింపు యంత్రములు)ఉపయోగించుటవంటిదియగును. భగవంతుడు సరళుడు. సరళములైన పద్ధతులతోనే తెలిసికొనబడగలడు. కావున అయనను పొందుటకు మన ఇచ్ఛ, క్రియ పరిసరములచే సృష్టింపబడిన వాటినుండి ఎట్లు విముక్తులము కాగలమో అందుల కనువైన పద్ధతులనే అవలంభింపవలెను. మన ఆలోచన లన్నిటిని క్రమబద్ధము చేయవలెను. మరియు వ్యక్తిగత మానసమును దానిపై నున్న బరువులనుండి విముక్తి చేయవలెను. సమర్థుడైన గురుదేవుని సహాయముతో ఒకే ఒక త్రోపున భగవంతుని వైపునకు ఎగురగలుగునట్లు మనము దూది పింజల యంత లఘువుగ తయారు కావలెను. మన సంస్థలో సంకల్ప శక్తి యొక్క ప్రథమ తాకిడిచే అభ్యాసి హృదయమున సత్యతత్త్వము ప్రవేశపెట్టబడును. దీర్ఘకాలము అదియే బీజరూపమున పనిచేయును. ఈ బీజము సులభముగ పెరుగుటకున్ను, కాల్చెడు గాలులు దానిని దగ్ధము చేయకుండుటకున్ను గురువు ఈ వృద్ధి క్రమమును ప్రారంభించును. సాక్షాత్కార మార్గమున శిష్యుడు నిరంతర స్మరణతో దీనిని తడుపుచుండుటయే ఏకైక అవసరము.

## గృహస్థాశ్రమము (కుటుంబ జీవితము)

జీవితలక్ష్యము సాధించుటకు ఆటంకమేమియు కాదు. ఉన్నత స్థితులు సులభముగ పొందుటకు గృహస్థాశ్రమమే అన్నిటికంటే మేలైనదని నేననుకొందును.నేను గృహస్థుడను. మా గురుదేవులు కూడ గృహస్థులే. గృహస్థాశ్రమమందే పూర్ణుడగు యోగి లభించునని నేను రూఢిగా చెప్పగలను. మనము మన విధులను నిర్వహించుకొనుచు ఆయననే (దేవుని) అంతిమ సత్యముగ స్మరించుకొందుము.

# పంచమ అధ్యాయము

## సాక్షాత్కారము - సాధకుని పాత్ర

వైరాగ్యము :

మనము వైరాగ్యమును అలవరుచుకొననిదే మాయనుండి ఎన్నటికిని విముక్తులము కాజాలము అనుట సత్యము. అట్లనుటచే గృహము, కుటుంబము, అన్ని ప్రాపంచిక సంబంధములతో తెగ దెంపులు జేసుకుని సన్యాస జీవితము నవలంభింపవలెనని దీని అర్థముగాదు. గృహము, కుటుంబములకు దూరమగుటయు, ప్రాపంచిక బంధనముల నన్నింటిని విసర్జించి ఏకాంత స్థలమునకు నిష్క్రమించుటయే వైరాగ్యము నలవరచుకొనుటకు ఏకైక మార్గము, అను అభిప్రాయము కలవారితో నేనేకీభవించను. అట్లు నిర్బంధ పద్ధతులచే కలిగిన వైరాగ్యము యధార్థమైనదగుట అరుదు. ఏలయన వారు ప్రపంచమునుండి నిర్బందముగ తెగ త్రెంపులు చేసికొన్నట్లు కనపడినప్పటికి అంతర్గతముగ వారు ఇంకను దానినంటిపెట్టుకొని ఉండుట సాధ్యము. గృహస్థులమగు మనము నిస్సందేహముగ అనేక విషయములను గమనింపవలసియుండును. మన కుటుంబమును పోషించవలెను. మనపిల్లల చదువున కేర్పాటు చేయవలెను. వారి కోరికలను, అవసరములను గమనించవలెను. మనము వారిని వేడినుండియు, చలినుండియు కాపాడవలెను. ఇట్టివి ఎన్నియో చేయవలెను. ఇట్టి అవసరములకొరకు డబ్బును, ఆస్తిని గడింతుము, దగ్గరుంచుకొందుము. మనము సంబంధము కలిగియున్న వాటిపై తగని వ్యామోహమును పెంచుకొనుటే నిజమైన కీడు, ఇదియే మన బాధలకు ముఖ్యకారణము, ఆకర్షణ వికర్షణ భావము లేవియు లేక జీవితములో ప్రతికార్యము, మన ధర్మమని తలచిచేయగలగియున్నచో మనమొకవిధముగా ప్రాపంచిక బంధనములనుండి విడుదల పొందినట్లే. మనము పెక్కు వస్తువులను కూడ బెట్టి వాడుకొనుచుండినను లోకమును పరిత్యజించినట్లె. అప్పుడు మనయొద్దనున్న ప్రతియొక్కటియు మన ధర్మములను నిర్వర్తించుటకై సర్వేశ్వరుడిచ్చినట్టి ఒక పవిత్ర నిధి అనిపించును. వైరాగ్యమనగా ప్రాపంచిక వస్తువులపై వ్యామోహము లేకుండుటయే కాని వస్తువులను కలిగియుండకపోవుటకాదు. గృహస్థ జీవితమున సంపదలు. ప్రాపంచిక బంధములు అత్యావశ్యకములు. తనకు సంబంధమున్న వస్తువులతో తగనిరీతి వ్యామోహము లేనపుడు మాత్రమే గృహస్థ జీవితము వైరాగ్యమునకుగాని,

తత్ఫలితమైన సాక్షాత్కారమునకుగాని ప్రతిబంధకముగాదు. జీవితకాలమంతయు గృహస్థ జీవితమును నడుపుచునే పరిపూర్ణత్వమును పొందిన మహాత్ముల దృష్టాంతములు పెక్కుగలవు. వైరాగ్య మనునది నిజముగా మనసు యొక్క అంతర్గతమగు స్థితి. అది వస్తువు లక్షణ భంగురత, పరివర్తన శీలతలను మన దృష్టికి తెచ్చి నిర్వ్యామోహభావములను కలిగించును. విరాగి యగువాని దృష్టి పరివర్త నరహితమును, శాశ్వతమును అగు సత్యము మీదనే సదా లగ్నమైయుండును. అతనికి రాగ ద్వేష భావములు లేకుండును. వైరాగ్యమనగా ఇదియే. మానసికముగా మనమిట్టి స్థితిని పొందినపుడు కోరికలనుండి విడుదల పొందినవారమగుదుము. ఉన్నదానితో మనము తృప్తి పొందుదుము. కోరికలంతమొందుటతో సంస్కారము లేర్పడుట నిలిచిపోవును. మన జీవితకాలములో పూర్వ సంచిత సంస్కారములను అనుభవించి పోగొట్టుకొనుటే ఇక మిగిలియున్నది. మన కోరికల వలనను, కర్మల వలనను కలిగిన సంస్కారములను కారణ శరీరము నుండి నిశింపచేయుటకు వలసిన భోగ భూమిని సృష్టించి ప్రకృతికూడా ఈ కార్యమునందు మనకు చేయూత నిచ్చుచున్నది. ఈ పొరలు తొలగిపోయినపుడు మనము సూక్ష్మతరములగు స్థితులను పొంద నారంభింతుము.

ఈ లోకమున జన్మించిన మానవుడు దుఃఖములను చవిచూడక తప్పదు. వీనినుండి తప్పించుకొనజాలడు. నేనీ ప్రపంచమును చూచినపుడు అది దుఃఖభూయిష్టము గన్పట్టును. బాధలతో మూలుగు వారు కొందరు. ప్రేమపాత్రులను కోల్పోయి బాధనొందువారు కొందరు. అనేకులు ప్రతి సందర్భమునందును విజయమునే పొందుటకు ఆతురత పడుచున్నారు. తపస్సులోనికి పోయి ఈ కష్టములను తప్పించుకొనుటకు ప్రయత్నింతుము. ఋషులు తమ జీవితమును పూర్తిగ దీనికే వినియోగించిరి. వ్యామోహము వల్ల పుట్టినదెల్లను దుఃఖమే. సుఖ దుఃఖములు రెండును బాధలనే కల్గించును. పరిశుద్ధమైన భగద్భావనకు మనలను అర్పించుకొనుట తప్ప ఈ దుఃఖముల నధిగమించుటకు వేరొక పరిష్కార మార్గము లేదు.

మనము ప్రపంచమును పరిత్యజించి తపమొనర్చుటకు అరణ్యములకేగ నవసరములేదు. ఐహిక జీవితము ఆధ్యాత్మిక జీవితము సమానముగ ప్రకాశించునట్లు ప్రక్క ప్రక్కననే కొనసాగవలెను. గృహస్థ ధర్మములను నిర్వర్తించుచు భగవత్సాక్షాత్కారమును పొందునంతవరకు తయారగుట వలన మనుష్యున కేవిధముగను నష్టములేదు. మనము

విజయము సాధింపవలెనన్నచో రెండు రెక్కలతో నెగురవలెను. భగవంతుని అరణ్యములలో నన్వేషించుట అను సాధారణ ప్రజాభిప్రాయము అస్పష్టమైనది, ఆయనను హృదయమునందే అన్వేషింపవలెనని నా అభిప్రాయము. ఒకడు గృహస్థ ధర్మములను నిర్వహించుచు, అదే సమయమున భగవద్భక్తియందు కూడా అంతే నిమగ్నుడై యున్నాడు. ఈ రెండును పరస్పరము పొత్తుకుదరని మరియు విరుద్ధములైనవని మీరనవచ్చును, కాని అది సరికాదు. కాలక్రమమున దివ్య జ్ఞానము పనిచేయ నారంభించును. అపుడు మనుష్యుడు అతీత మనస్సునుండియే తన విధులను నిర్వర్తించును.

ఆ విధముగ దివ్యత్వమువైపు సంపూర్ణముగ మరలినపుడే వైరాగ్యము పొందగలడు. అట్లు జరిగిననాడు తనకు సంబంధము గల విషయములతోబాటు తనయందును సహజముగనే అభిమాన రహితుడగును. ఇట్లాతనికి దేహభావమును, తరువాత ఆత్మభావమును పోవును. ఇక ఇప్పుడు మిగిలియున్న దేమనగా "మరణ రూపమున యుండుట లేక సజీవుడయ్యు నిర్జీవుడగు".

ధ్యానము:

సహజమార్గ సాధనయందు పతంజలి యోగమందలి ఏడవదియగు "ధ్యానము' 'తో ప్రారంభించి ధ్యానసాధన చేయుటకు మనస్సును ఒకే విషయముపై లగ్నము కావింతుము. దాని ముందున్న అంగములను ప్రత్యేకముగ తీసికొనము. ధ్యానముతో పురోగమించునపుడు వాటంతటవియే ఆచరణలోనికి వచ్చును. ఆవిధముగ మన కాలము, శ్రమ చాలవరకు కలిసివచ్చును. కొన్ని సంస్థలయందు సాధన క్రమమును తరచు రహస్యముగ నుంతురు. లాంఛనముగ వారితో చేర పూనుకొనినవారికి మాత్రమే బయట పెట్టుదురు, బోధింతురు. అంతరికముగ వారి ఉద్దేశ్యమేమియో మనకేమాత్రము అర్థముకానిది. ప్రకృతికి రహస్యము లెవ్వియు లేవు. అట్లే దైవీమార్గము ననుసరించువారికి రహస్యమనునది ఉండరాదని నేననుకొందును.

హృదయముపై ధ్యానముచేయుట మన సంస్థలో అనుసరించు పద్ధతి. పతంజలి మహర్షియు ఈ విధానమునే ప్రబోధించెను. దానియందు గొప్ప తత్త్వము ఇమిడియున్నది. మన మెల్ల వేళలయందును ప్రాపంచిక విషయములయందు నిమగ్నులమై యుందుము, మనమేమి చేయుచున్నను విరామసమయమునందు మన ఆలోచనలకు రెక్కలు

వచ్చినట్లుండును. మన మెల్లపుడును కలకలములందును, అవ్యవస్థయందును ఉందుము. మన వ్యక్తిగత మానసము అటువంటి ప్రత్యేక కార్యకలాపమున కలవాటుపడియున్నది. అందుచే ప్రతివిషయమును మనము తలక్రిందులుచేసితిమి. మన కార్యములు, ఆలోచనలు మన తప్పుడుపనులయందు ఎక్కువ ప్రాధాన్యత వహించును. వివిధమైన భావములు, ఆలోచనలతో మనము సంబంధము కలిగియున్నపుడు అవి మనభావములపైనను, ఇంద్రియముల పైనను సంస్కారములను కలిగించును. అన్ని ఇంద్రియములు పొడై వక్రమార్గము నవలంభించును. ఇంద్రియములపైబడిన గర్తులు వానిని రాయివలె స్థౌల్యమును కలిగించిజ్ఞానము లేకుండునట్లు చేయును.ఆత్మమీద వీని ప్రభావము నిస్పందేహముగ ఏమియు లేదు. కాని ఆత్మచుట్టును కవచముపై ఆవరించియుండు పొరలతో పట్టుపురుగు తన చుట్టును అల్లుకొన్నగూడువలె ఆటంకములను మనమే సృష్టించుకొందుము. ఆత్మను సాక్షాత్కరింపజేసికొను సంగతి అట్లుండగా దానిలోనికి తొంగిచూచుటకైనను సాధ్యముకాదు. మన చెడ్డయోచనలు, దుష్కర్మల ఫలితముగ మన విచక్షణాజ్ఞానము, గ్రహణశక్తి నశించును. ఇట్టి స్థూల స్థితిని పొందినవాడు రాజయోగపద్ధతి శిక్షణకు సమ్మతింపడు. కావుననే మనము చెప్పెడుదానిని ప్రజలు పెడచెవిని పెట్టెదరు. హఠయోగసాధన ఏదైనప్పటికి అజ్ఞాచక్రము తరువాత నిరుపయోగముగాన, దాని తదనంతరము యింకను దాటవలసిన దశలు ఎన్నో ఉన్నవి. కనుక అది నిజమగు సాక్షాత్కారము కలుగజేయదు. అందువలన రాజయోగ మొకటియే మనలను చివరవరకు కొనిపోగలదు. కేంద్రమును సమీపించుటకు వేరొక ఉపాయములేదు.మనతప్పుపనుల వలన చెడగాగొట్టబడినదైనను ఆ కేంద్రశక్తి మనయందే కలదు. ధ్యానమున మనమాశక్తి నుండియే పనిని స్వీకరింతుము. చెప్పవలెనన్న ఈ విధముగ మనము ప్రకృతి శక్తితో సహజముగ పురోగమింతుము. ధాన్యము చేయునపుడు మనయందున్న కేంద్రశక్తి కార్యనిరతియందుండును. దానిబలముచే మనలను గాఢముగా చుట్టుకొనుచున్న మేఘములు నిర్వీర్యముచేయబడి చెదరగొట్టబడుచున్నవి. దానిని మాటలలో చెప్పలేము. అది అభ్యాసి మాత్రమే అనుభవమున గ్రహింపగలడు. ఇది ఆచరణవలన మాత్రమే తెలియబడగలదు. నీవు అనతికాలమందే నిరంతర ప్రశాంతత, ఆనందముల యందు ఈదులాడుచున్నట్లు తెలిసికొనగలవు. సర్వమును ఇచట అంతమొందును. ప్రపంచముతో సంబంధమేదియు ఇక మిగులదు. మనస్సు సుశిక్షితముగ తనంతట తానే క్రమశిక్షణ యందుండును. ఇంద్రియములు నీ యధీనమునకు రానారంబించును. నీకు వానిపై అధిపత్యము లభించును, నీపై నీవు ఆధిపత్యము పొందుట అనగా నీవు ప్రకృతిపై

అధిపత్యము పొందినట్లే అగును. మార్గము స్పష్టమయినపుడు ప్రకృతి కార్యము నీ పరిధి పరిమితులలో యుండుట గమనింతువు, అపుడు నీకు నీవే పనిచేయుట ప్రారంభింతువు.

మన పద్ధతియందు అభ్యాసిని తన హృదయమునందు దివ్యజ్యోతి యున్నట్లు భావించి ధ్యానము చేయవలెనని ఉపదేశింతుము. కాని అట్టిజ్యోతిని విద్యుద్దీపము వంటిదిగానో, క్రొవ్వువత్తిదీపము వంటిదిగానో ఏదియో ఒక రూపము లేక ఆకారము గలదిగా చూడరాదని ఆదేశింతుము. అట్లు భావించుచో అచట కన్పడు జ్యోతియదార్థమైనదిగాక అది ఊహాకల్పితమైనదియే యగును. అంతర్గత దైవభావముతో అభ్యాసి ప్రకాశము ఉన్నది అని కేవలము అనుకొని సాధన చేయవలెనని ఉపదేశింపబడును. అపుడు జరుగున దేమనగా మనము పొందవలసిన అతి సూక్ష్మమైనదానిపై ధ్యానింతుము.

హృదయమునందు దివ్యప్రకాశమున్నదని తలంచుటయేహృదయముపై ధాన్యముచేయు పద్ధతి. ఈ విధముగ ధ్యానము చేయ నారంభించినపుడునీలోగల దివ్య ప్రకాశమే నిన్నాకర్షించుచున్నదని అనుకొనుము. ధ్యానమున అన్యాలోచనలు నిన్ను వెంటాడినచో వాటిని లక్ష్యముచేయకుము. వాటిని రానిమ్ము, కాని నీవు మాత్రము నీ పనియందే నిమగ్నుడవుకమ్ము. నీ ఆలోచనలు లేక భావములను ఆహ్వానింపబడని అతిథులుగా భావింపుము. అప్పటికిని అవి నిన్ను బాధించుచో అవి గురువుగారివే కాని నీవి కావని భావింపుము. ఈ విధమగు ధ్యానము చాల ప్రయోజనకరమైనది. ఆశించిన ఫలితము నిచ్చుటలో యిది ఎన్నటికిని విఫలముకాదు. ఉదయము ఒకగంట సులభరీతిన సహజముగ కూర్చుండవలెను. ధ్యానము మాత్రమే చేయవలెను. ధ్యానసమయమున వచ్చెడు ఆలోచనలతో పెనుగులాడకుము. ఏకాగ్రత అనునది ధ్యానమువలన సహజముగను స్వయముగను కలుగు ఫలితము . ధ్యానమునకు బదులు ఏకాగ్రత కొరకు పట్టుబట్టి తమ మనస్సును దానివైపు బలాత్కరింతురేని అట్టివారు సామాన్యముగా వైఫల్యమునే పొందుదురు.

సాయంకాలము మరల నదేరీతిన కనీసము ఒక అరగంట కూర్చుని నీలోని పలు విధములైనపూర్వపుటాలోచనా ఫలితములు, సంస్కారములు, స్థూల్యత, ఘనత్వము కరిగిపోవుచున్నవి- లేదా పొగ రూపమున నీ శరీరపు వెనుకభాగమునుండి హరించిపోవుచున్నవని భావింపుము. ఇది నీ మనస్సును నిర్మలము చేయుటకు తోడ్పడును. మరయు మన సమర్థ గురుదేవుల పరిణామ ప్రబావమును గ్రహించుకొను శక్తిని

కలుగజేయును. నీయందలి కాలుష్యములన్నియు తొలగింపబడినవని నాకు తెలియగనే దానిని మరి యొక విధముగా మార్చుటగాని లేదా దానిని నిలుపు మనుటగాని చేయుదును. ఈ విధముగా మనము చక్రములను ఉపబిందువులను మేల్కొలిపి శుద్ధిచేయుట వలన అతివేగముగ ఉన్నతస్థాయిని అందుకొందుము. అంతమున కుండలినీ శక్తిని చేపట్టుదుము. అభ్యాసికి దీనితో ఎట్టి స్వంత ప్రమేయములేదు. అది ప్రత్యేకముగ గురువుగారి బాధ్యతయే. ఈ పద్ధతి నవలంబించునపుడు సాధకుడుతన మనస్సును అతిగ బలవంతము చేయక సహజముగా కూర్చొనుట మాత్రమే అని జ్ఞప్తి యందుంచుకొనవలెను. ఈ నిర్మలీకరణ కార్యక్రమము ఉదయమున గూడ ధ్యానమునకు పూర్వము ఐదు నిముషములపాటు మరల చేయవలయును. సాధకుని అవసరములనుబట్టి ఇతరవిధములైన శుద్ధిచేసికొను మార్గములను కూడా ఉపదేశింపవచ్చును. దాని నిచ్చట వివరింపబనిలేదు. సారూప్యతయొక్క అతి సూక్ష్మసారమైనటువంటియు నిట్రమై, జారుడు కలది యునగు సాక్షాత్కారమార్గమును అధిరోహించుటకు తగిన సామర్థ్యమును చేకూర్చుటకు, అది సంకల్పనశక్తిని మానవ ఇచ్ఛారూపమున జీవాత్మను సంస్కరించుటకు ఈ నిర్మలీకరణ విధానము వినియోగించునని చెప్పిన చాలును.

యోగులందరును "జ్యోతి" అను పదమును ఉపయోగించిరి, సత్యమును తెలుపుటకది అత్యుత్తమమైన పదము గనకనేనును దానిని వాడకయుండలేను. కాని అది కొన్ని చిక్కులను సృష్టించును. ఏలయన మనము "జ్యోతి" అనగానే "కాంతి" అను భావమే ప్రధానముగా కలిగి మెరయునదిగా తీసికొన నారంభించెదము. యధార్థమైన ప్రకాశమునందట్టి భావమేమియులేదు. మన విధానమందు అభ్యాసి ఒక్కొక్కప్పుడు ప్రకాశమును చూడ వచ్చును. కాని తొలిదశయందు మాత్రమే జడపదార్థమునకు శక్తితో సంబంధము కలిగినపుడు మెరయుచున్న కాంతి కన్పట్టును. మరియొక మాటలో శక్తి తన పనిని ప్రారంభించినదనుటకు ఇది ఒక చిహ్నము మాత్రమే. నిజమైన ప్రకాశము అరుణోదయ వర్ణము కలది. లేదా వర్ణ రాహిత్యముయొక్క తెలిసీ తెలియని ప్రతిబింబము. జ్యోతి యనునది దానికి సరియైన అనువాదము కానప్పటికిని (ఏలయన జ్యోతి, అది యదార్థముగా ఏదిగానున్నదో దాని కంటె నిజముగా అతిభారమైనది) కేవలము అర్థము చేసికొనుటకు అవిధముగా చెప్పబడినది. సాధకుడు అంతకంతకును తాను తేలిక యగుచున్నట్లు అనుభవింప మొదలిడినచో అతడు పురోగమించు చున్నాడని అర్థము. ఏలయన అతడు అపుడు భగవంతుడు ఉన్నస్థితిలోనికి పోవుచున్నాడు. తేలిక అనగా వ్యక్తి

యొక్క ఆలోచన భారము తగ్గిపోవుట, అట్లు యథార్థ ప్రకాశము నిజమైనవస్తువునకే అన్వయించును. ఇంకను సరిగ చెప్పవలెనన్న అది వస్తురహిత వస్తువు.

అభ్యాసియొక్క వాంఛలు, తొలుతనే ఏర్పరుచుకొన్న అభిప్రాయములచే ప్రేరేపింపబడే కృత్రిమత్వము మరియు పెడత్రోవను పట్టించు ప్రాధాన్యత అనునవి అతడు తనను మార్చుకొనుటకు సైతము వీలులేనంతహానికరములగును. కావున కాంతి దృశ్యములు మున్నగు వాటిని కృత్రిమముగా సృష్టించుకొనుట లేదా అట్టివానికొరకై పట్టు బట్టుటయు కూడదు. ఇట్టివి సంభవించినపుడు కేవలము అవి గమనింపదగినవే కాని వాటియందేవిధమగు వ్యక్తిగత వ్యామోహ భావము కలిగియుండరాదు. మనము వ్యక్తిగతముగా కాంక్షింపదగినది అంతిమలక్ష్యము మాత్రమే, అనగా సాక్షాత్కారము. దానినే సర్వదా గాఢముగా మనదృష్టియందుంచుకొనవలెను. ఏ ఒక లేక ప్రతిఒక అప్రధానమైన వేరు మార్గమునకు వ్యతిరేకముగావిశ్వసనీయమైన హామీగా యిది రూపొందును. రాజయోగాభ్యాసము చేయు అనేకులు ప్రతియొక ధ్యానసాదన కాలమునందు అతురతతో ఎదురుచూచు చిత్తఏకాగ్రతకు పట్టుబట్టుట అనునది పైన చెప్పబడినట్లు హానికరమగు అపమార్గ ప్రాధాన్యతకు ఒక ఉదాహరణము. హిందూదేశమందును ఇతర దేశములందును యోగసాధన చరిత్ర యందిదియొక విధ్వంసకపాత్ర వహించినది. మనోనిగ్రహమునకై సామాన్యముగ అవలంబించబడు తీవ్రనిష్ఠలు, తపస్సులు, శరీరమును శోషింపచేయు పద్ధతులు మనస్సును పెడత్రోవపట్టించు పోకడలను అరికట్టజాలవు. పైగా ఇట్టివి చెడుగులను లోపలనే అణచియుంచుటకు మాత్రమే ఉపకరించును. ఏకారణము వలననైనను వానిపై యించుక అదురిపు సడలినచో ఎపుడైనను ఉధృతముగ పైకుబుకును. ఈ సమస్యకు నిజమైనపరిష్కారము మనస్సును వశమందుంచుకొనుటకై అసహజముగ అణచుట, అదుపులోబెట్టుట, శోషింపజేయుటకాదు. కాని దానిని పెడత్రోవను పెట్టెడు పోకడలనుండి విడుదలగావించి క్రమముగ రూపొందించుటయందే కలదు. మనఃపూర్వకముగ నడచుకొను సాధకుడు ప్రతి విషయమును గ్రహించుకొనుచు ప్రతిదానిని పనిచేయుటకు సహజముగ అభివృద్ధిపొందుటకు వీలు కల్పించును. అతని వైఖరి దీనియందును తదితర విషయములందును శీఘ్రప్రగతిని సాధించుట తప్పక జరుగునట్లు చేయును.

సామాన్యముగ గుండె కొట్టుకొనుటను నీవెక్కడ గుర్తించెదవో ఆ హృదయస్థానమున ధ్యానము చేయుమని నేను సలహా నిత్తును. నాసికాగ్రము, భ్రూమధ్యము

మున్నగుచోటులందును దృష్టిని నిలిపి ధ్యానము చేయవచ్చును. కాని నా అభిప్రాయమున హృదయముపై ధ్యానము సులభమేగాక మిక్కిలి ప్రయోజకరమైనది హృదయముపై ధాన్యము చేయటయందు గొప్పతత్త్వ మిమిడియున్నది. హృదయము రక్తప్రసార కేంద్రము. ఇది శుభ్రపడిన రక్తమును,. దేహమందన్ని భాగములకును అతి చిన్న కణములకును పంపును. మనమిప్పుడు ధ్యానము కొరకు హృదయమును కేంద్రముగ తీసికొంటిమి. శరీరమున ప్రవహించు రక్తము ప్రభావితమైనది. మన యోచనలు, కర్మల మూలమున ఏర్పడిన స్థౌల్యము కరగిపోవుట ప్రారంభమగును. మన హృదయముపై ధ్యానముచేయు పద్ధతివలన తొలిదినముననే మనకు లభింప మొదలిడిన ప్రప్రథమ లాభము ఇదియే. ఇది బీజస్థానము. అది ఎటువైపు మరల్పబడినను అచట స్పందన క్రియను సృష్టించును. మనస్సు పనిచేయుటకును, వివేచనాశక్తిని పెంపొందించుటకును ఇదియే రంగస్థలము. దివ్యశక్తి అవతరించుటకు ఇచటనే సూక్ష్మ శక్తి పనిచేయును. మన ఆలోచన దానితో ఏ విధముగా కలసినను లేదా సరియగుదానిని ప్రవేశింపచేయు శిక్షణ నిచ్చి సత్యమువైపు మరల్చినను సమస్య పరిష్కారమగును. ధ్యానముచేయుట అవసరమేమని అడుగుదురు. సమాధానము స్పష్టము, సులభము. ధ్యానమువలన మన వ్యక్తిగత మనస్సు తాను అలవరచుకొన్న చంచల స్వభావమును వీడి, మనము ఒక స్థానమున నిలకడ చెందుదుము. ఈ అభ్యాసముచేత వ్యక్తిగత మనస్సును సరియైన మార్గమున పెట్టుదుము. ఏలయన అది ఇప్పుడు తన అలవాట్లను మార్చుకొనుచున్నది. ఇది జరిగినపుడు మన ఆలోచనలు సహజముగా అపమార్గమునపోవు. సజీవ నిర్జీవ పదార్థముల కలయిక సంబంధము అతి స్పష్టముగ అనుభవమునకు వచ్చుస్థానము హృదయమే. ఆకారణముననే హృదయముపై ధ్యాన మత్యంత ప్రయోజనకరమైనది. హృదయము మనస్సునకు కార్యస్థానము. మనస్సు ఎల్లప్పుడూ ఉన్నరీతిగనే యుండును. మనస్సునకు కార్యస్థానమైన హృదయమును సరిచేయవలయును. ఊర్ధ్వముగగాని అథోముఖముగగాని ప్రవాహ మెచటనుండి ప్రవహించునో అట్టిస్థానమే ధ్యానమునకు సరియైనది అది హృదయమేగాని అవ్యము కాదు. ధ్యానమునకు త్రికుటిని (భ్రూమధ్యమును) గూడ గ్రహింపవచ్చును. కాని సాధకుడు అధికముగా శ్రమింపవలసియున్నది. కాన అది సామాన్యులకు సులభమైనదికాదు. ధ్యానము సక్రమముగా చేయకున్నచో ఇది కాలక్రమమున కొన్ని చిక్కులను కలిగించవచ్చును. నాభిస్థానమున ధ్యానము మనస్సును ఇంద్రియావాంఛలను బలవత్తరము గావించి ఉద్రేకములు కలుగచేయుటదప్ప దానికి ఆధ్యాత్మికముగా విలువలేదు.

సాధకునియందు విశ్వాసము పెంపొందినతర్వాత ఒకదశలో మనము సామాన్యముగా బాహ్యదృష్టికి మానవాకారముపై ధ్యానము చేయుటను నొక్కి చెప్పుదుము. ఆధ్యాత్మికోన్నతికిది ఆత్మహత్యా సదృశ్యమని విమర్శకులు అనుకోవచ్చును. ధ్యానము చేయబడువ్యక్తి ఆధ్యాత్మిక శిక్షణ నొసగుటకై కేవలము మూలతత్త్వము నుండి అవతరించినవాడై యున్నప్పుడు లేక దేనికొరకు మహత్తరమైన స్వయంకృషిచే ఆధ్యాత్మిక వికాసమున అత్యున్నత ప్రమాణము నందుకొన్నవాడై యున్నప్పుడు ఆయన రూప ధ్యానము వారనుకొన్నట్టిదిగాదు.

ధ్యానమునకు తొలిచర్యలు:

మానవునియందు మూలమునకు పోవలెనన్న సంకల్పము రేకెత్తినప్పుడు అతని యందుద్భవించిన క్రియనతడు సాధ్యమగు నంతవరకు నిద్రాణస్థితికి కొనిరావలసిన అవశ్యకత కలిగెను. ఇందుల కతడు ఉపాయముల నన్వేషింపసాగెను. నిద్రాణ చలన శక్తి తను సంబంధము కలిగియున్న పరతత్త్వము కంటెను స్థూలముగనున్న కారణమున తాను ఆశించిన ఆదర్శసత్యమును పొందుటకు అంతకంటె స్థూలమైనదానిని ఆధారముగ గ్రహింపవలసియున్నదని తుదకతనికి తోచినది. ఇది అతనికి ప్రళయకాలమునందేర్పడు సంకోచస్థితివంటి దానిని తనలో సృష్టించుకొనవలెనను నిశ్చయమునకు దారితీసినది. సామూహికముగ సృష్టిని వీక్షించినపుడు ఆత్మసృష్టియందు అంతటను వ్యాపించియున్నట్లే అది మానవుని యందును సర్వవ్యాపిగా నున్నది. సంకోచము ప్రారంభమైనపుడు ప్రళయస్థితి ఆసన్నమగును. మనుజునియందును అట్టి సంకోచము వ్యక్తి ప్రళయమునకు దారితీయును. అనగా నతడు తన స్థూలస్థితి నుండి తన నిజస్థితికి పోవుటకు ప్రారంభించినాడని అర్థము. దాని ఊర్ధ్వప్రవృత్తి కారణముగ సంకోచము ఎల్లప్పుడును క్రిందిభాగము నుండి బయలుదేరి క్రమముగ ఊర్ధ్వముగ కొనసాగును. కావున అతడు ఊర్ధ్వముగ పోవుటకు క్రిందినుండియే సంకోచించుట ప్రారంభింపవలెను. కాళ్ళను, వాటి సంబంధ భాగములను ఒకతీరున తెచ్చి వాటిని నిశ్చలముగ నుంచుటయే అట్టి సంకోచరూపమగును. మన అంతిమ లక్ష్యమును చేరుటకు మార్గము నిది సులభము గావించునదిగాన ఇది ఆవశ్యకము. ఈ ఆసన మెల్లప్పుడును ఒకేవిధముగ నుండవలెను. కారణ మేమన అతడు తాను పొందదలచిన ప్రత్యేక లక్ష్యసాధనకు తొలుతనే చేపట్టిన ఆ మహాశక్తితో ఈ విధముగ సంబంధము కలిగియుండును. సత్యముతో సంబంధము కల్గియున్న ఈ రూపము ప్రాథమిక దీక్షయందతనికెంతయో తోడ్పడును.

పూర్వకాలము నుండియు ధ్యానమున వెన్నెముక, కంఠము, శిరస్సు ఒకే వరుసను వంకరలేనట్లు నిలువుగ కూర్చుండుట చాల ఉపయోగకరముగ నుండునని తలచుచుండిరి. ఏలయన ఆ భంగిమలో నున్న అభ్యాసిమీదికి భగవత్కృప నేరుగా ప్రవహించునని విశ్వసింపబడుచున్నది. మన సాధన విధానమునందీ విషయమునను అంతగాపట్టుబట్టము. సహజమైన సులభరీతిని గూర్చుండుడని నేను సాధకులకు సలహా నొసగుదును. అంతియేగాకుండ బిగువుగ వంకరలేని రీతిన ఉండువారైనను ధ్యానమందు ఆనంద నిమగ్నస్థితి మొదలైనపుడు తమంతతామే విధేయతాభావము కన్పట్టు తీరున ముందునకు కొంచెము వంగుటను కనుగొనెదము. ఉన్నత ప్రజ్ఞాస్థితుల లోనికి ఆరోహించుటకు కూడా యిది ఎక్కువ సహజము అయినదని భావింపవచ్చును. యధార్థమునకు అముఖ్యమైన యీ విషయమున వివాదము అసంగతము.

ధ్యానమునకు అరుణోదయ కాలముననే కూర్చుండుట మంచిది. అది సాధ్యముకానప్పుడు అభ్యాసికి అనువైన ఏ నిర్ణీత సమయమున నైనను కూర్చుండవచ్చును. బాహ్య విషయముల వలన కలతనొందక అవి ఒక విధముగ యీ సాధనయందు ఎక్కువగా లీనమవవలసిన ఆవశ్యకతను తెలిసికొనుటకు నీకు తోడ్పడు చున్నవని అనుకొనుచు నీ పనిలో నీవు నిమగ్నుడవై యుండుము.

ప్రార్థన :

ప్రతిదినము నిదురించుటకు ముందు అతివినమ్రుడవై దివ్య ప్రేమపూరిత హృదయమునుండి భక్తిభావము పొంగి పొరలునట్లు మన సంస్థయందలి సంక్షిప్త ప్రార్థనను చేయవలయును. ("ఓ ప్రభూ....") ఈ ప్రార్థనను మనసునందే ఒకటి రెండు పర్యాయములు అనుకొనుచు దానిపై కొలది నిముషములపాటు ధ్యానము చేయుము. మిక్కిలి దైన్యావస్థయందున్న ఒకడు అశ్రుపూరిత నయనములతో ఆ పరమ ప్రభువు నెదుట బాధాతప్తహృదయుడై అయన దయ, కృపను అర్థించుచు తన దుఃఖములను విన్నవించుకొను రీతిని ప్రార్థన పలుపవలెను. అపుడే అతడు యోగ్యత గల భక్తుడు కాగలడు. భగవంతుని ప్రేమించుటకు అనేక పద్ధతులు గలవు. అనేక భావములును అవలంబింపబడుచున్నవి. ఉదాహరణకు పితృభావము, సఖ్య భావము మొదలగునవి. నా యభిప్రాయమున భగవంతునికి భక్తునికి మధ్య నుండతగినది ప్రియుడు ప్రేయసి భావమే. ఒక అభ్యాసి తాను ప్రియుడుగను భగవంతుని ప్రేయసిగను భావించుచు ఆ భావముతో అతడు

పురోగమించినచో తత్ఫలితముగ కాల క్రమమున భగవంతుడే ప్రియుడుగను. సాధకుడు ప్రేయసిగను. అగును కాని యీ స్థితియందు అభ్యాసి గమ్యమును పొందితినని భావించునేని అది తీవ్రమైన పొరబాటు కాగలదు. అటు పిమ్మట జరుగుదానిని గూర్చి చెప్ప వీలుకాదు. అది సాధనకు సంబంధించిన విషయము మాత్రమే.

విజయ సాధనకు ప్రార్థన అతి ముఖ్యమును అమోఘమును అగు ఉపాయముగ నున్నది. దాని వలననే మనము పవిత్రమగు దివ్యత్వముతో సంబంధమేర్పరుచుకొంటిమి. దైవానుగ్రహము తనయందు ప్రసరించుటకు తనలో తానొక శూన్య స్థితిని సృష్టించుకొనుటకు ఒకే భక్తి ప్రేమలు నిండిన హృదయముతో ప్రార్థన చేయుట కారణమైనది. ప్రపంచము నేటి రూపమున ఆవిర్భవించినపుడు అన్ని ప్రాణులయందును కేంద్రశక్తి లోతుగ నాటుకొని యుండెను. మనయందు పాతుకొనియున్న ఈ కేంద్ర శక్తి పరమాత్మలోని ఒక భాగమే, కావున అది మనదృష్టిని మూలము వైపునకు మరల్చును. ప్రార్థనయందు మనము అదే కేంద్ర బిందువు వరకు చేరుటకు ప్రయత్నింతుము. అట్టి స్థితి మనలో సృష్టించుకొనినపుడే అది సాధ్యమగును. దీనికి సాధన కావలెను. మనము భగవదిచ్ఛకు మనలను అర్పించుకొనినచో దానిని పొందగలము. అది అత్యంత సరళము, శాంతము. బాహ్యదృష్టికి అది మిక్కిలి కష్టసాధ్యముగ కన్పట్టును. అయినప్పటికి దానిని కాంక్షించెడువారికి మాత్రము నిజముగ అది అట్లు కాదు. మూలతత్వముకొరకు తీవ్ర తపనను సృష్టించుకొన్నప్పుడు అతడు నిజముగ ప్రార్థన స్థితియందున్నాడు. ప్రతిఒక్కరును దానికొరకు తీవ్రయత్నము చేయవలెను. ఒక్కక్షణమైన ఆ స్థితిలో ఎప్పుడైననను ప్రవేశించిన అతని ప్రార్థన సఫలమగును. కాన దీనిని సాధించుటకు నిరంతర సాధన ఆవశ్యకము. అట్టి ప్రార్థనలను చేయవలెనని ...జలన్ను ప్రోత్సహింపవలెను. దానిని సాధించి అందు స్థిరపడిన పిమ్మట అతనికి నిరంతర స్మరణము తప్ప యింక చేయవలసినది ఏమున్నది. అదియుకూడ ఒక విధముగ ప్రజ్ఞలోనికి ఎప్పుడును రాదు.

## నిరంతరస్మరణ :

భగవంతుని నిరంతర స్మరణ అధ్యాత్మిక విద్యయందు నిజముగ ఒక విశేషలక్షణము. నీ విశ్రాంతి సమయమున ఇంటియందున్నను, ఆఫీసు యందున్నను, వీధిలో లేక బజారులో ఎచ్చటనున్నను భగవంతుడు సర్వాంతర్యామియని అయననే భావించు చున్నానను దృఢ విశ్వాసముతో ఆలోచించుచుండుటయే నిరంతరస్మరణమును

అలవరుచుకొను విధానము. ఈ ఆలోచనలోనే సాధ్యమైనంత దీర్ఘకాలము ఉండుటకు ప్రయత్నింపుము.

ప్రజల మనస్సులు ప్రతిక్షణము అసంఖ్యాక ప్రాపంచిక జీవిత సమస్యలగూర్చి ఆలోచించుటయందే లగ్నమై యుండును. ప్రగాఢ సంతాపమునందో, దుఃఖమునందో మునిగియున్నప్పుడు తప్ప తక్కిన ఎడల వాటిని దైవము వైపు మరలించుటలేదు. కారణమేమన నిరంతరము వారి దృష్టిలో నిలిచి యుండు ప్రాపంచిక లాభమునకే వారు ప్రాథమిక ప్రాముఖ్యమిత్తురు. ఇట్లు వారు మాయలో చిక్కువడి ఎప్పుడును అందుండి బయటపడ నాలోచింపరు.

తరచు భగవంతుని స్మరించుట చాల సహాయకరము. అయినప్పటికిని సాక్షాత్కార విషయమున మనకు కావలసిన దంతియే కాదు. సాధారణముగ మనము ఏ ముఖ్య కార్యమైనను దేవుని పేరున మొదలిడుదుము. అట్లు చేయుట అన్ని మతముల వారికిని ఆచారమే. అదియొక పద్ధతి అంతేగాని దానిలో ఏ అంతరార్థము లేదు. మనము దేనినిగాని నిజముగా భగవంతునకు అంకితము చేయుటలేదు. హృదయాంతరములో వాస్తవమునకు భగవంతుడనెడి భావమునకే కడు దూరమందున్నాము. ఇట్లు దేవుని స్మరించుట యన్నది నిరర్థకము. ఈ ఆచారములోని అంతరార్థమేమనగా దైహిక మానసిక కార్యకలాపముల నన్నింటిలోను భగవద్భావముతో సాన్నిహిత్యము కలిగి యుండవలెనుననుట. ప్రతిక్షణమును ఆ అనంత శక్తి స్వరూపునితో సంబంధము కలిగియున్నట్లు అనుభూతిచెందుచు అన్ని పనులందును ఎడతెగని ఆలోచనా ప్రవంతిని కలిగియుండవలెను. మన చేతలు కార్యములు దైవకైంకర్యమున భాగమేయనియు ఆ మహా ప్రభుని మనకు వీలైనంత చక్కగా సేవించుటకై మన కొసంగబడిన సాధనములే యివి అనియు భావించినచో దానిని తేలికగా సాధించ వీలగును.

ప్రాపంచిక బంధనములు బాధ్యతల కారణమున అసంఖ్యాకములగు కలతలు, కలవరములచేత చుట్టుముట్టబడిన మానవుడు భగవంతుని సర్వదా స్మరించుటట్లుండగా తఱచు స్మరించుటకూడ సాధ్యపడదని కొందరు భావింతురు. కాని యదార్థముగా దృష్టిని దేవునిపై నెలకొల్పినట్లు అయిన అది కడుతేలికైన విషయమనియు ప్రతియొక్కరును అనుసరింప వీలగుననియు సాధనా స్వానుభవములు వారికి నిరూపించి చూపును.

గురువు సాక్షాత్కారముయొక్క అంతిమ స్థితియందు లీనమైన వాడగుచో, ఆధ్యాత్మికాన్వేషణమున అతనిని సర్వోత్కృష్ట దైవ శక్తిగా భావించుట కడు సహాయకారి. అతనినొక మానవాతీత శక్తిగా భావించి అతని మార్గదర్శకత్వము మీద ఆధారపడుదువు. సర్వము గురువునకు అంకితమొనర్చి ఎడతెఱపిలేని నీ జీవన వ్యవహారక్రమముతో సాగిపోవుచున్నచో తుదకు నీకది ఎట్టి మేలు చేకూర్చి పెట్టునో ఊహించుము. ఒకపని చేయునపుడు నీవు నీకొరకాపని చేయుచున్నట్లు అనుకొనకుము. నీ గురువునకై చేయుచున్నట్లుగా భావించుము. లేక నీ గురువే తనకొఱకు చేయుచున్నాడని తలంపుము. భోజన సమయమున నీగురువు భోజనము చేయుచున్నాడనుకొనవలెను. నీవు కార్యాలయమునకు పోతివేని నీ గురువే యిది అంతయు చేయుచున్నాడని భావింపుము. నీవు కార్యాలయమునుండి తిరిగి వచ్చునపుడు దారిలో ఒక ఆకర్షణీయమైన నాట్య ప్రదర్శన చూచితివనుకొనుము. నీకనులా నర్తకి ముగ్ధమోహన రూపముచే ఆకర్షితమగును. నీ ఆలోచనలు కొంతసేపు తప్పుదారి పట్టినట్లుండును. అప్పుడు కూడ నీవు గురువే కాని నీవు నాట్య ప్రదర్శన చూచుటలేదని తలంపుము. తక్షణమే నీకు దానిపై మోజు పోవును. ఏలయన నీగురుశక్తి ప్రవహింపమొదలిడి నిన్నాకర్షణ నుండి తొలగించును. నీవు కార్యాలయమునుండి తిరిగి వచ్చినపుడు చాల గంటల తరువాత నీ పిల్లలు నిన్నుచూచి ఆనందముతో త్రుళ్ళింతలాడుదురు. నీవు కూడ వారి వినోదములకు సంతోషింతువు. అది కేవలము సహజమే. త్రుటికాలము నీధ్యాస వారివైపుమొగ్గుటతో నీవు పవిత్ర చింతనకు దూరమైనట్లు అనుభూతి చెందుదువు. నీవప్పుడు చేయవలసినదేమనగా నీలోని గురువే వారితో వినోదించుచున్నాడని భావించుట. అట్లయిన నీవు మరల అదే పవిత్ర చింతనతో సంపర్కము కలిగియుందువు. నీవు నీ మిత్రునితో మాట్లాడుచుండినచో వానితో నీ గురువుగాని, నీవుకాదు మాట్లాడుచున్నది అని తలపోయుము. నడచుచున్నప్పుడు నీ గురువే నడచుచున్నాడని భావింపుము. ధ్యానకాలమున నీవుకాదు నీ గురువే తనరూపముపై ధ్యానించుచున్నాడని భావించినట్లయిన దాని వలన అద్భుత ఫలితములుండును. ఇదే విధముగ అన్నిపనులందును నిన్ను నీవు సరిజేసుకొనవచ్చును. ఈ భావమును పెంపొందించుకొని, నీ స్థానములో నీ గురువే సమస్థము చేయుచున్నాడను దృష్టి నెలకొల్పుకొన్నచో నీవు సదా ఎడతెగని భగవత్స్మరణ కలిగియుండుటయే గాక నీ కర్మలవలన యెట్టి సంస్కారములును పుట్టవు. ఇంకను సంస్కారముల పెంపొందించుకొనుటయన్నది త్వరలో నశించును.

భక్తి :

యథార్థమునకు ధ్యానసాధన యొక్క సహజ పరిణామమే నిరంతరస్మరణ. అభ్యాసి ధ్యానముయొక్క లేదా నిరంతర స్మరణ యొక్క లక్ష్యమునకు తనను సమర్పించుకొనునపుడు అది గొప్ప ఫలోత్పాదక శక్తిని పొందును. అపుడది నిస్సారమైన సాధనగాక పూర్తిగ మధురమైన సర్వాకర్షణీయమైన క్రియాకలాపమగును. భక్తి, ప్రేమయొక్క అగ్నిమాత్రమే నిరుపయోగమైన చెదారమును దగ్ధముచేసి మష్టునుండి బంగారమును పొందును. ఈ ప్రేమాగ్నికి మూడు దశలు కలవు. మొదటిది అణచిపెట్టబడిన మంటతో రగులుచు దట్టమైన పొగను వెలిగ్రక్కును. రెండవది అప్పుడప్పుడు నిప్పుకణములు కలిగియుండును. కడపటిది ప్రకాశవంతముగ మండుచున్న జ్వాలఅయి క్షణకాలముననే ప్రతిదానిని భస్మముగావింప శక్తిగలది. మొదటి రెండుదశలును గాలిలో నున్న దహించు స్వభావము గల పదార్థముతో సంపర్కము వలన గలుగును. దహన క్రియను అడ్డగించు స్థూల్యత అంతరిక వేడిమి వలన తొలగింపబడగా కడపటి క్రియ సంపూర్ణ శక్తితో ప్రారంభమగును. కాని మొదటి రెండుదశలను అధిగమించి చివరిదశయందే పొగ ఆవిరిలేని విద్యుద్వహ్ని ఒకటి కలదు. నీలో అట్టి అగ్నిని రగుల్కొల్పగలిగినచో నీ పురోగమనము మిక్కిలి శీఘ్రతరము కాగలదు.

నిజమునకు భక్తి ప్రేమలు మిక్కిలి సులభములైనను వాటిని తక్షణమే సాధించుట ఎంతయో కష్టము. నిజమగు భక్తియందు నటన లేశమాత్రమైనను ఉండదు. ఇదియు జ్ఞానము రెండును పరస్పరము సన్నిహితముగ నుండును. ప్రారంభదశలయందు భక్తునికి తాను ప్రేమించుదానియందు తనకు ప్రేమయున్నదను భావము స్ఫురణ యుండును. కాని ఉన్నతదశల యందుగల ఉదృతము దానిస్ఫురణ అంతిమదశయందు రమారమి పూర్తిగ పోవునంత వరకు మాయును. భక్తియొక్క అతి సూక్ష్మస్థాయి సంపూర్ణ ఆత్మార్పణమని చెప్పవచ్చును. దాని నుండి గురుదేవుని అనుగ్రహము వలన అర్పించుకున్నానను ఎరుక పూర్తిగ ఉపసంహరింపబడెను.

భక్తి ప్రపత్తి మొదలగువానిని సహజ పద్ధతియందు ఆచరించు సమన్వకలదు. ఇందులకు తన జాతికి చెందిన మరియొక వ్యక్తిని గాఢముగ ప్రేమించవచ్చునని చెప్పబడినది. అందుచే గురువు మానవాకృతియందున్న భగవంతుడేయని తీసికొనవలెను. నా విషయము

నా ఏకైక ప్రేమ వస్తువు నా గురువే. నేను ప్రేమించినది ఒక్కగురుదేవుని మాత్రమే. స్వేచ్ఛ, శాంతి, పరిపూర్ణత్వములేక మరి దేనిని నేను ప్రేమించలేదు. ధ్యానింపబడుటకు అర్పించుకొనుటకు మహాఉత్తమ పురుషుడగుటచే మా గురువే నిస్సందేహముగ దాని కర్హుడు. ఆయనకు అహంకార భావములు, కోరికలు, లౌకిక బంధములు ఏవియును లేవు. ఆయన సంపూర్ణముగ ఆత్మనిష్ఠుడు. మానవునకు సామాన్యముగ ప్రసాదింపబడని స్థితిని తెలుపు యీ మాట ఉన్నత ఆధ్యాత్మిక స్థితిని సూచించును. ఆకారణముననే నేను అత్యంతముగ ఆయనను ప్రేమించితిని, నేను ఆయనయందు సంపూర్ణముగ లీనమగుటకు హృదయపూర్వకముగ ప్రయత్నించితిని. ఇదియే నా జీవిత ధ్యేయముగా నుండెను. ఏలయన నాకు అసామాన్యుడు, అసదృశుడు అయిన గురువు దొరకుట వలన దానినుండి నాకు లభించిన ఫలితములను విశదీకరించుటకు నాకు మాటలు లేవు. ఒక్కమాటలో చెప్పవలెనన్న ఆయన అనంత కృపా సముద్రుడు. దానియందు మనమందరమును లీనము కావలసినదే. శ్రద్ధతో కూడిన సత్యాన్వేషకుల కెల్లరకును అది సాధ్యమగు గావుత.

సమర్పణము:

లక్ష్యమును సాధించుటకు అత్యంత ఖండితమైనట్టిదియు, సులభమైనదియునగు ఉపాయము నీకు నీవే సమర్థగురువునకు సమర్పించుకుని జీవన్మృతుడవు అగుట. ఈ సమర్పణభావము బలవంతముగ లేక యాంత్రిక ఉపాయములతో కల్గించుకొన్నచో అది యథార్థమగుట అరుదు.మనస్సు యే విధమైన శ్రమగాని, ఒత్తిడిగాని లేకుండ తనంతట అది నీయందు పెంపొందవలెను. 'నేను' అను ఎరుక ఉండినప్పటికిని అది నిజమగు సమర్పణము కాజాలదు. నీకు నీవే నిజార్థమున సమర్పించుకొన్నచో ఇక చేయునది యేమి మిగిలియుండును? ఏమియులేదు. ఈ స్థితిలో అభ్యాసి నిరంతరమును సత్యముతో మిక్కిలి సన్నిహితుడై యుండిన అతనిలో దివ్యతేజస్సుయొక్క ప్రవాహము నిరాటంకముగ ప్రవహింపసాగునని నా నమ్మకము. ఈ విధముగ జీవిత సమస్యను మిక్కిలి స్వల్పకాలమందు సులభముగను సమర్థవంతముగను పరిష్కరించుకొనగలము. దివ్యపురుషుడగు గురుదేవునకు తన హృదయము నొక కానుకగా సమర్పించుకొనగలిగిన సాధకుడు తరువాత చేయవలసిన దేమియునుండదు. ఇది అభ్యాసిని సహజముగ ఆపరతత్త్వము నందు లీనమగు స్థితికి గొని రాగలదు. సరళము, సులభమునగు యీ పద్ధతి మొట్టమొదటిదానినే అంతముగ జేయుచున్నది. జీవితమునకు అత్యంత ప్రియమగు

వస్తువును ప్రాప్తించుకొనుటకు అత్యంత యోగ్య సమర్పణము ఈచిన్నిహృదయము తప్ప మరియొకటేమికలదు?

మరియొక విషయము అతి సులభమార్గమున హృదయమును సమర్పించుకొనుటకు కావలసినది సంకల్ప క్రియ మాత్రమే. ఇదియే గాక ఈ సంకల్పము సూక్ష్మము, సున్నితము, అయినకొలదిని దానిపనిగూడ అంతఫలప్రదమైనదిగ వుండును. ఈ పద్ధతియొక్క అవలంబన మొట్టమొదటినుండియు వైరాగ్యమనోభావమును నమ్మకముగ కలిగించును. ఇందుకు కావలసినది ఎల్లయు ధైర్యముతో కూడిన ప్రయత్నము మాత్రమే.

శరణాగతియన స్వార్థచింతన ఆవంతయులేక ఆ మహా ప్రభుని యిచ్ఛకు సంపూర్ణముగా తన్నుతాను సమర్పించుకొనుటయే గాని వేరుగాదు. ఈ స్థితియందు స్థిరముగా నుండినచో అది లయావస్థకు దారితీయును. మనమా మహామహుని శరణు జొచ్చిన అతనినుండి ఒక మహోన్నత నిరర్గళ దివ్యశక్తిధారను ఆకర్షింపనారంభింతుము. ఈ స్థితియందు మానవుడు తన ప్రభుని యిచ్ఛానుసారమే ఆలోచించును లేక నడచుకొనును. ప్రపంచమందేదియు తనది కాదనియు, ప్రతిదియు ప్రభునియొక్క పవిత్రనిధియనియు భావించి ప్రతి పనిని ప్రభుని ఆజ్ఞానువర్తియై ఒనర్చుచున్నట్లు తలచి చేయును. అతని యిచ్ఛ సంపూర్ణముగ ప్రభుని యిచ్ఛకు విధేయమైపోవును.

సమర్పించుకొనుట తేలికగా సంపాదింప వీలగు సామాన్య విషయము కాదు. అది యింద్రియ మానసిక శక్తులను సంపూర్ణముగ లయపరిచిన తర్వాతనే ప్రారంభమగును. ఇందుకు మనము ప్రాథమిక భక్తిసూత్రములను అనుసరించి సాగిపోవుదుము. మనము మన గురువుని మానవాతీత వ్యక్తిగా తలంచి అతనికి విదేయులమగుదుము. మనము భక్తి విశ్వాసములతో ప్రేమించి సర్వవిదముల అతని కృపను పొందగోరెదము.

మహర్షులు శిష్యులను "మన్మతులు", "గురుమతులు" అని రెండు ముఖ్య వర్గములుగా విభజించిరి. తొలివర్గమునకు చెందిన వారు ప్రాపంచిక దుఃఖములనుండి విడుదల, సంపదలవంటి యేదో ఒక ప్రాపంచిక లాభము దృష్టిలోనుంచుకొని గురునియొద్దకు వచ్చువారు. వారి కోరికలు నెరవేరుఆశ ఉన్నంతవరకే వారాతనికి విధేయులై ఉందురు. ఈ విషయమున నిరాశాహతులైనచో వారిక ఉండరు. అట్టి శిష్యుల విషయమున నమ్రతా విధేయత లన్న ప్రశ్నయే ఉదయించదు. శరణాగతి మాట చెప్పనేల? గురువుములనబడు

శిష్యులు గురుని అజ్ఞలను అన్ని విషయములందును తలదాల్చి, అన్ని విధముల నాతని యిచ్ఛకు విదేయులై ఉండజాతురు. విదేయత నమ్రతతో మొదలగును. ఆధ్యాత్మికముగ మహోన్నత స్థితులను సాధించిన గురుని మహోత్కృష్ట శక్తులచే గాఢముగా ముగ్ధులమైతిమేని మన అంతరంగమున ఆతని ఆజ్ఞలు శిరసావహించుటకు సమ్మతింతుము.

దశరథుని కుమారుడగు భరతుడు అయోధ్యాపురజనులతో గూడి అడవికి వెళ్ళి తన సోదరుడగు రాముని నగరమునకు తిరిగి రమ్మని ప్రార్థించుట శరణాగతిని గూర్చిన చక్కని దృష్టాంతము. రాముడు ప్రజల ప్రార్థనలు విని భరతుడు తనను రమ్మన్నచో తాను రాజధానికి వచ్చుటకు నిరభ్యంతరముగా అంగీకరింతునని గంభీరముగ జెప్పెను. కనులన్నియు భరతునివైపు తిరిగెను. అతడు స్వయముగా రాముని తిరిగి రమ్మనికోరుటకే అచ్చుటకు వచ్చియుండెను. అయినను అతడు నెమ్మదిగ యిట్లు బదులు బలికెను. "ఆజ్ఞాపించుట గాదు అనుసరించుట మాత్రమే నే చేయగలిగినది". కావున అభ్యాసికి తన సాదన యందు ఆత్మార్పణ అత్యంత ప్రాముఖ్యము గలిగియున్నది.

# ఆరవ అధ్యాయము

## సాక్షాత్కార మార్గము - మార్గదర్శకుని పాత్ర

గురువు, ఆయన కార్యము:

అభ్యాసము వలన మాత్రమే సాక్షాత్కారమును సాధించుట పడదు. కారణము ఉన్నతదశలయందు పరిస్థితులట్లుండును. సాధకుడు స్వశక్తిచే కొంచెము పైకిపోయినను పైనుండి శక్తివంతమైన ఒత్తిడి యుండుటవలన అతడు వెంటనే క్రిందికి జారిపోవును. కావున ఉన్నత భూమికలయందు మన ప్రవేశము సంబంధించినంత వరకు గురువు యొక్క సహాయము తప్పనిసరి. సాధన యొక్క ఆచరణ విషయమందు కూడ ప్రతియొక్కరును ఆధ్యాత్మిక శిక్షణ యొక్క ఆచరణ పద్ధతి అవలంబిం మట ఆవశ్యకము. దాని కొరకు మనము సరియగు మార్గదర్శకత్వమును అన్వేషింపవలెను. అయినను మహనీయులు కొందరు నేరుగా దేవుని శరణార్థులై స్వప్రయత్నముతో పరిపూర్ణతను సాధించిన సందర్భములు కొన్నిఉన్నవి. కాని అట్టి దృష్టాంతములు అరుదు. అది చాల కష్టమైన మార్గము. అసాదారణ మేధా సంపన్నులు మాత్రమే దాని ననుసరింపగలరు. దేవునకు మానవునకు అనుసంధాన కర్త గురువే. అతని ద్వారముననే మనము భగవంతుని చేరగలము. మన మార్గమున చిక్కులను తొలగించగల ఏకైక శక్తి అతడే.

అత్యంతోన్నత శక్తి సంపన్నుడును, తన అసాదారణ బలసహాయముచేత చూపు మాత్రమున చిక్కులను వక్రలింపగల మార్గదర్శకుని మనమెన్నుకొనుట కూడ అవసరము.అట్టివాడు కేవలము పరిపూర్ణత్వమును పొందినవాడు గాని, అహంబావము పూర్తిగ తొలగ ద్రోలినవాడు గాని కావలయును. అందుచే మనము ప్రేమాకర్షణ భావము కలిగి అట్టి మహాశక్తి సంపన్నునితో సంబంధమేర్పరుచుకొనవలెను. మన మదిలో అట్టియాతని గూర్చి ఏతీరున భావింతుమన్నది అంత ప్రధానము కాదు. అతనిని మిత్రుడని, గురుడని సేవకుడని, మనకిచ్చవచ్చినట్లు పిలువవచ్చును. కాని అతడు మాత్రము సామాన్యముగా పిలుచునట్లు మార్గదర్శకుడుగా, గురువుగానే ఉండును. గురుని తల్లిగా భావించుట నా దృష్టిలో అత్యంత సముచితమును శిష్యునకు లాభదాయకమును అగును. మూర్తీభవించిన ప్రేమ వాత్సల్య భావములే తల్లి. మాతృహృదయము మాత్రమే తన కొడుకునకు

సుఖసంతోషములను కూర్చవలెనని సర్వదా యత్నించుచు, పుత్రుని వలన కలిగిన సకల బాధలను క్లేశములను ఓరిమితో భరించగలదు. శిష్యునకు అధ్యాత్మిక మాతృత్వమును వహించు నిజమైన గురువు యొక్క స్థానము గూడ నట్టిదే. అందుమూలమున గురువు తన పుత్రసమానుడగు శిష్యుని అధ్యాత్మిక సంక్షేమమును సర్వదా కనిపెట్టుకొని యుండును. శిష్యుని యెడల గురువునకు గల మాతృవాత్సల్యపూరిత సాన్నిహిత్యము వలననే ఆతని అధ్యాత్మిక జననియగు గురువునకు అత్యంత సన్నిహితుడై యున్న పరమ పిత యొక్క కృప ఆ శిష్యుని వంక ప్రసారితమగును. తల్లి బాధ్యతలు, నిజమైన గురుని బాధ్యతలు సన్నిహితముగా సమానములే. తల్లి బిడ్డను తన గర్భమునందు కొంత కాలముంచుకొనును. గురువు కూడ అధ్యాత్మిక శిశువును తన మానసిక పరిధిలో కొంతకాలముంచుకొనును. ఈ కాల వ్యవధిలో శిష్యుడు గర్భములోని శిశువు వలెనే గురువు నుండి శక్తిని గ్రోలి గురుని అధ్యాత్మిక యోచనా తరంగములనుండి పోషణను గ్రహించును. కాలము పరిణతి చెందినపుడాతడు దివ్యలోకమున ప్రభవించును. అటుపై ఆతని స్వీయ అధ్యాత్మిక జీవనము ఆరంభమగును. శిష్యుడు గురుని మానసికావరణములో ఉన్నపుడు తన స్వీయాలోచనలను, అనుభూతులను వదలక అట్లే ఉంచుకొనును. ఇట్లు గురుని స్థానము తల్లి స్థానము వంటిదేనని మనము గమనింతుము. గురువును అధ్యాత్మిక జననిగా భావించుట మనయందు అధ్యాత్మిక జీవనమునకు ముఖ్యాంశములగు భక్తి ప్రేమ ప్రపత్తులను పెంపొందించును.

---

సమర్థుడైన గురువు నెన్నుకొనుట నిస్సందేహముగ చాల కష్టమైన పని. స్వానుభవమే ఆధారముగ దీనిని నిర్ణయించుటకు ఒక సులభ పద్ధతిని చెప్పెదెను. నీవొక వ్యక్తి సమీపమున నుండుట తటస్థించిన ఆతని సంపర్కమువలన నీలో శాంతి నిశ్చలతాభావములు కలుగుచున్నవా? మనస్సుమీద భారముకాని, మరి ఏగుణము కాని కలుగకుండ దాని చంచల ప్రవృత్తులు తాత్కాలికముగానైనను శాంతించినవా అర్థము చేసికొన ప్రయత్నింపుము. అట్లయిన ఆ వ్యక్తి నిన్ను అధ్యాత్మిక పథమందు ముందునకు కొనిపోవుటకు తగిన వ్యక్తియని నిర్ణయించుకొనుము. అయితే యింకొక చిక్కు కూడ కలదు. అట్టి గురువు లభించినను, అందుబాటులో ఉన్నను ఆయన ఏదో ఒక అద్భుత మహిమను ప్రదర్శించిన గాని అతడు నమ్మబడడు. ప్రాణాహుతి శక్తిగల రాజయోగి మహిమలను నిస్సంశయముగ ప్రదర్శింపగలవాడు. కాని అవి తన నిజస్థితులను కించ పరచునవగుట వలన అతడట్లు చేయుటకు అంగీకరింపడు. తన జీవితమంతయు మహిమలను ప్రదర్శించిన క్రీస్తు

ఉదాహరణము మనకున్నది. అట్లుండి కూడా ఆయనకు పండ్రెండు గురే శిష్యులుండిరి. వారిలో ఒకడు తరువాత అతనిని శిలువ నెక్కించుటకు కారణభూతుడాయెను. ప్రజలయందు విశ్వాసము కలిగించుటకు ఆయన మహిమలు నిరుపయోగములని ఇది చూపించుచున్నది. యదార్థమునకు ఆయన యొక్క మంచి బోధనలే ఆయన తరువాత అంత పెద్దఅనుచరవర్గమును చేకూర్చినవి. కావున మహిమలపై గాక సత్యముపైననే దృష్టిని నిలుపుట మనకు చాల శ్రేయస్కరము. అవి మిక్కిలి స్వల్పవిషయములు! ఇతరులకంటె అల్ప సిద్ధులు, శక్తులు కలవారిచే కూడ ప్రదర్శింపబడును. మహిమలు మహాత్మ్యలు లేక యోగులను గుర్తించుటకు ప్రమాణములు కావు. పైగా ఇది బలహీనులైన సులభముగ నమ్మెడు ప్రజలను తమ గురుత్వపు వలలో వేసికొనుటకై చమత్కారులైన గురువులచే ఉద్దేశపూర్వకముగా చేయబడు మోసము. చివరి నిర్ణయమునకు ముందు ఆధ్యాత్మిక మార్గమున ఒకని అనుభవసిద్ధులు శక్తిసామర్థ్యములయందు పూర్తి విశ్వాసము మనకు కలిగితీరవలెను. ప్రయోగమార్గమున గ్రాహ్య, అనుభవములద్వారా విషయములను నిర్ణయించుటకు అతనితో ఎడతెగని సాంగత్యము కలిగియుండవలెను. అట్లు నమ్మకము కలిగిన పిమ్మటనే ఆయనను విశ్వాసపూర్వకముగ నమ్మి ఆయనపై స్థిరముగ ఆధారపడవలెను. అన్వేషణ విజయవంతమగుటకు ఇది అత్యావశ్యకము.

అవసరమున్న వారికి సహాయముచేయుటకు నాహృదయము ఎల్లప్పుడు సిద్ధముగానున్నది. మానవజాతికి విధేయతగల సేవకునివలె మాత్రమే నేనాకార్యమును స్వీకరింతును. వారి కాలమున సమర్థులుగ పనిచేసిన ఇంకను చేయుచున్న గురువులు నాడును నేడును కలరు. నేను మాత్రము సామాన్య ప్రజల శ్రేయస్సునకై సేవకుడుగ నుండి సేవ చేయుటయే నాకు అభిమతము. నీకు చెప్పబడినట్లు దయచేసి నీ దైనందినాభివృద్ధిని గురించి నీకు కలుగు ఏవైన ఛిక్కులను గురించి నాకు తెలుపుము. నిరంతర స్మరణతో పట్టుదలగల్గి సాదన చేయుచున్నచో నీ గమ్యమును సాధింపగలవని నేను నిశ్చయముగ చెప్పగలను.

పాండిత్యముగల మత గురువులు సాదారణముగ దేవుళ్లను దేవతలను పూజింపుడని ప్రజలను పురికొల్పుదురు. మార్గమున చివర వరకును ప్రయాణించిన వ్యక్తి మాత్రమే విజయవంతముగ నడిపించును. పండితులైన గురువులు యించుమించు ఏదారి ఎచటకు పోవునో తెలిపెడు త్రోవలు చూపు గుర్తు స్తంభముల వంటి వారు. వారు చేయగలిగిన పని

యిదియే. భౌతికత్వము నుండి విముక్తి పొందవలెనని వాంఛించువారు భౌతిక రూపములపై స్థూల భావములపై ఆధారపడుట నిస్సందేహముగా మిక్కిలి వింతగనున్నది.

"మహాత్ముడు" అను పదము పలు విధములుగ నిర్వచించబడియున్నది. బహుశసకారణ ఆధారము లేకుండ కాదు. దానికి నా నిర్వచనము 'స్తితిరహిత స్థితి' ఈ నిర్వచనము కొంత వింతగ యున్నను సార్థకమే అగును. ఇది అధ్యాత్మికతకు దూరముగ నున్నవానికి సంబంధించుననికూడ అర్థము తీయవచ్చును. కాని ఆధ్యాత్మికతను కాంక్షించువారికి అది అంగీకరము గాక పోవచ్చును. కాని దీని నిజమగు భావ విశేషము ను వివరించుటకు మరికొంతలోతునకు వెళ్ళినచో అది అర్థము కాదని నా భయము. కావున ఈ విషయమింతటితో ఆపివేయుట మంచిది. రాజదుస్తులు మాత్రమే ఎవనిని నిజమగు రాజుగా చేయవని మనకు తెలియును. అట్లే రూపముగాని దుస్తులుగాని నిజమగు మహాత్ముని లేక యోగిని చేయజాలవు. బాహ్య శారీరక చిహ్మానములుతో నున్న హృదయమునకు నిజమైన చిహ్నాములు కావు.

నేటి గురువులను అనుకూలముగ ఈ క్రింది తరగతులుగ విభజింపవచ్చును.

1.) క్షుద్రగురువులు : వృక్షములు, జంతువులు, దయ్యములు, కీటకములు, వ్యాధులు, దుష్టశక్తుల పూజలను బోధించి చేయించువారు.

2) గ్రంథ కీటకములు : తాము పుస్తకములనుండి సేకరించుకొన్న పద్ధతులను, విధానములను విధించువారు.

3) ఆచరణ గురువులు: వీరు మంచిచెడ్డల వివక్షణ లేకయే తాము చేయునది చేసినది మాత్రమే ఇతరులను చేయుమని విధింతురు.

4) అంతః స్ఫురితులైన గురువులు: వీరు తమ అంతఃస్ఫురణల ఆధారముగ యితరులకు మార్గము చూపుదురు.

5) అంతః స్ఫురితులైన అనుభవ గురువులు: ఉన్నతమైన అంతః స్ఫురణ సహాయముతో ప్రత్యక్షానుభవ ఆధారమున ఇతరులకు మార్గమును చూపు వారు.

ఇదే విధముగా శిష్యులను కూడ క్రింది విధముగ విభజింపవచ్చును.:

1) స్వలాభాపేక్షాపరులు: తమ ఇంద్రియముల (అవసరములు) కోరికలను తీర్చుకొనుటకై సాధనము చేపట్టువారు.

2) కాలక్షేపకులు: దీనిని వినోద క్రీడగ చేపట్టువారు (కాలక్షేపక)

3) అనుచరులు: గురువుల ఆజ్ఞలను అనుసరింప ప్రయత్నించువారు

4) శ్రద్ధావంతులైన శిష్యులు: గురువు అడుగుజాడలలో నడచుచు వాని ననుకరింప ప్రయత్నించు వారు.

5) భక్తి శ్రద్ధలు కల శిష్యులు గురువుగారి గమనమునకు కేంద్ర మగువారు.

అధ్యాత్మిక తృష్ణను తృప్తి పరుచుకొనుటకు గురువొకరు ఉండుట తప్పదని దైవ భక్తి పరుడగు ప్రతి హిందువును నమ్మినప్పటికిని దురదృష్ట వశమున ఈనాడు సరియైన మార్గదర్శకుని యెంచు కొనుటలో ఎక్కువ అశ్రద్ధ కనపడుచున్నది. ఇందుకొరకు సామాన్యముగ అర్హత సమర్థతలను లక్ష్యపెట్టక ప్రజలెవరో యొకరిని ఎంచుకొనుచున్నారు. అజ్ఞాన ప్రజానీకమును ఆకర్షించుటకై గురువులుగా చెల్లుబడియగుచున్న కొందరు ప్రదర్శించు అద్భుత శక్తి ప్రదర్శనలచేతనో చమత్కార వాక్నైపుణ్యము చేతనో ప్రేరేపితులగుచున్నారు. శిష్యులకై వేటాడు వారికి కొరత లేదు. చెట్టుననున్న ఆకులవలె వారసంఖ్యాకులు. వారిలో పెక్కుమందికి గురుత్వమనునది కడు లాభదాయక వృత్తి. అది వారికి వేరు విధముగా గడింపలేని అపార ఆదాయమును కూర్చి పెట్టును. పైగా శిష్యులనుండి అత్యంత గౌరవమును, వ్యక్తిగత సేవయును పొందుదురు. అజ్ఞాన ప్రజానీకము ఈ తీరున సులభముగ యీ కుక్షింభరుల వాత పడుచున్నది. ఏ క్షుద్రమగు అద్భుత శక్తి ప్రదర్శనమో మనోహరము గాని, ఆకర్షణీయముగాని అగు నేదో యొక సామాన్య ప్రదర్శనమో గొర్రెలవంటి అవివేకులను వందలాది మందిని వారి గురుత్వమనెడు బందనశాలలోనికి ఆకర్షింపజాలును. తమకు కోపము కలిగించిన వారిని శాపదగ్ధుల నొనరింతుము అను ఒక చిన్న బెదిరింపు వేల మందిని వారి అడుగులకు మడుగులొత్తునట్లు చేయును. ఇంతియే కాదు ఈ వృత్తి యందు ఏకాధికారము సాధింపగోరి సన్యాసిగాని, సంసారిగాని, విశిష్ట వర్గమునకు చెందిన వాడు తప్ప యితరుడు గురువు అగుటకు అనర్హుడని వారు ప్రకటింతురు. యోగ్యతా సామర్థ్యములతో నిమిత్తము లేకుండ వారు తాము మత పరముగ అజన్మ జగద్గురువులమని వాదింతురు. ఈ రోజులలో అసంఖ్యాకులుగ సన్యాసులు

గూడ మహాత్ములవలె నభినయించి జగద్గురువులమని ప్రకటించుకొనుచున్నారు. జాతికిని, మతమునకు తలవంపులు తెచ్చునట్టి వృత్తి వంచకులు తమ స్వార్థ లాభములకై అజ్ఞాన ప్రజలను వంచించుచూ పూర్తిగ దండనరహితులై తిరుగాడుచుండుట విచారముకాదా?

అట్టి వ్యక్తులు యెట్టి అవాంతరము కల్పించియుండిరో ప్రజానీకము కనుదెరచి చూడవలసిన కాలము ఆసన్నమైనది. గురుత్వమును అధికార వర్గీయుల గుత్తాధికారముగ చిత్రించుట అసంగతము. ఇది వృత్తి గురువులచే ప్రవేశపెట్టబడినది. ఏ పిరిస్థితులలోగాని గురువుతోడి పవిత్ర బంధనమును శిష్యుడు త్రెంచుకోరాదనుట ప్రజాబాహుళ్యము నమ్ముచున్న సూత్రము. ఇది కూడ యీ మిథ్యాగురువులు తమ స్థానమును సురక్షితము గావించుకొనుటకు అనుసరించు కుయుక్తియే. ఇది పచ్చి మోసమే గాని వేరుకాదు. శిష్యులకు దీక్షనిచ్చు ఆచారమును, దాని అంతరార్థమును యెరుగని నేటి గురువులలో అధిక సంఖ్యాకులు తప్పుదారి పట్టించినారు. దీక్షా కాలమున కొన్ని రహస్య శబ్దములను శిష్యుని చెవిలో ఊది పూజలపేరిట కొన్ని మతాచారముల ననుసరించుమని చెప్పుటయే గురువులుగా వారి ఏకైకకృత్యము. శిష్యుని యెడ వారి కర్తవ్యము అంతటితో తీరిపోవును. ప్రతి సంవత్సరము శిష్యునకు దర్శనమిచ్చి వాని నుండి వారికి ముట్టవలసిన వార్షిక బహుమతులను అందుకొనుట తప్ప వాని అభివృద్ధికి చేయునది యేమియు నుండదు. యథార్థమునకు శిష్యునిలో నిజమైన విశ్వాసము నెలకొని యుండి దైవప్రేమ ఆతని హృదయములో వేరుదన్ని నాటుకొనినపుడు మాత్రమే యథావిధి అతనికి దీక్షనీయవలెను. శిష్యునకు దీక్షనొసంగుట సర్వ శక్తి మంతుడగు భగవంతునితో లంకె కుదుర్చుటను సూచించును. అట్టి యెడ అతడు తనయందు పెంపొందించుకొన్న గ్రాహ్యశక్తి కి అనుగుణముగా ఆధ్యాత్మిక శక్తి తనంతతానుగా ప్రవహింప నారంభించును. సుస్థిర సంబంధము కుదుర్చుట అన్నది గురుని శక్తి సామర్థ్యములపై ఆధారపడియున్నది. దీనికి మహోన్నత శక్తిసంపన్నత కావలెను. ఒకమారు దృఢమైన సంబంధము కుదిర్చినచో అది శిష్యుడు ముక్తిపొందునంతవరకు నిలిచి యుండును. అట్టి సందర్భములందు ముక్తి పెక్కు జన్మల తర్వాత పొందవలసిన బహుదూర విషయము. కూడ కాదు. వాస్తవమునకు మహోన్నత శక్తి సంపన్నుడగు గురువుపైన నుడివినట్లు సరియైన రీతిని శిష్యునకు దీక్ష నొసంగి నట్లయిన వానితో తెగ తెంపులు చేసికొనుట అను ప్రశ్నయే ఉదయింపదు. కాని స్వార్థ లాభాపేక్షతో దొంగదీక్షలనొసగు వృత్తి గురువులకు మాత్రమిది నిరంతర ఆందోళనకారియే. అందువలన శిష్యుని శాశ్వతముగా తమ గుప్పిటలో నుంచుకొనుటకై

వారు అతడెప్పుడైనను తమనుండి విడిపోదలచినచో అతనికి నరకయాతను తథ్యమగుట దైవ శాసనముగా చాటెదరు. అజ్ఞాన ప్రజలు గురుపునకు అప్రియమును తలచుటకు వెరచుచు దీనిని వేద వాక్కుగా గ్రహించిరి. వారు గురువుల దురాగతములన్నింటిని సదా నోరెత్తక తలయొగ్గి భరించుచు వచ్చుచున్నారు.మనశాస్త్రములందీ విషయమై అణుమాత్రపు సూచనకూడ లేదని నా నమ్మకము. ఇది మత బోధకుల తెలివితేటల ఫలమే. తాను గురుపునెంచుకొనుటలో పొరపడినాడని గాని, గురువు యొక్క శక్తి సామర్థ్యములను పరిగా గమనించలేదని గాని కనుగొన్నచో అట్టి గురుపునుండి ఎప్పుడైనను తెగ దెంపులు జేసికొనుట ప్రతి మానవుని జన్మాధికారమని నేను గట్టిగా నమ్మెదను. ఏ దశయందైనను అతడు తానింత వరకు సాధించిన దానికంటే పై దశకు కొనిపోవు శక్తి తన గురుపునకు లేదని కనుగొన్నచో స్వేచ్ఛగా మరొక గురువు నన్వేషించుకొన వచ్చును. అట్టి పరిస్థితులలో మనస్సాక్షిగల గురువు తానే శిష్యుని పురోభివృద్ధి కుంటుపడకుండ తనకంటె ఉన్నతుడును యోగ్యుడును అగు యింకొకనిని వెదకికొననిర్దేశింపవలెను. ఇదియే నిజమైనట్టియు. స్వార్థరహితుడైనట్టియు గురువు యొక్కపవిత్ర ధర్మము. శిష్యుడు విడిపోవుటకు అనుమతివేడి గురువు స్వార్థ బుద్ధితో తిరస్కరించిన పక్షమున శిష్యుడాతనినుండి తక్షణమే తెగదెంపులు చేసికొని స్వేచ్ఛగా మరియొకనిని చేరవచ్చును. ఏ నైతిక ధర్మముగాని, మత ధర్మముగాని అతని నెప్పుడును నిరోధింపవు.

శాస్త్రములు, తదితర పవిత్ర గ్రంథముల నుండి ఆర్జించిన జ్ఞానము నాధారము చేసికొని బోధించువారు గురువుతెగలో కొంత అభివృద్ధి సాధించినవారుగ పరిగణింపబడుచున్నారు. వారు మత సంస్థలను, ఆశ్రమములను స్థాపించిరి. అందు వారు తమ అనుచరుల నడుమ రాజ వైభవము ననుభవింతురు. వారు బయల్వెడలి గొప్ప సమావేశములందు ఉపన్యసింతురు. ఏమి చేయవలెనో, ఏమి చేయరాదో చెప్పుచు మాయాజీవ బ్రహ్మలకు సంబందించిన సమస్యలగూర్చి విశదీకరింతురు. వారి మత ధర్మోపన్యాసముల నాలకించుటకు వేనవేలుగా ప్రజలు వచ్చి గుమిగూడి వారి యున్నత భావములను అపార విజ్ఞానమును వినుతించి వారు గొప్ప మహాత్ములని మహర్షులని భావింతురు. ప్రజలు వారిని పెక్కు చిక్కు ప్రశ్నలడిగెదరు వారు తాముగడించిన శాస్త్ర పరిజ్ఞానమునుండి ప్రత్యుత్తరముల నీయగల్గినచో ప్రజల మనస్సులలో వారు మహాత్ములుగతమ గొప్పతనమును ప్రతిపాదించుకొనట్లే. అటుపై వారే వారికి గురువులు. కాని వాస్తవముగా వారి పాండిత్యము పరీక్షింపబడినది గాని వారి యోగ్యతకాదు.

పాండిత్యముగాని పరిజ్ఞానముగాని మానవుని పరిపూర్ణునిగా చేయనేరవనియు, సరియైన అనుభవ జ్ఞానమే నిజమైన యోగినిగాని మహర్షినిగాని కావించుననియు మనస్సునందు చక్కగా నాటుకొనియుండవలెను. ఇట్లు తన బహిఃస్వరూప. పాండిత్య వక్తృత్వములచే ప్రభావితులనొనరించిన వ్యక్తి యొక్క ప్రత్యక్షానుభవములను పరిశీలించినచో అధమాధమ దశయందుండుటయు సంభవింపవచ్చును. కాని మహాత్ముడనుటకుగాని యోగి అనుటకుకాని శాస్త్రపరిజ్ఞానము ప్రమాణముగాదు. అట్లే మహాత్ముడుగాని, గురువుగాని అగుటకు నిదర్శనము కేవలము సాక్షాత్కార మార్గమున అతని ప్రాయోగిక సిద్ధిలేకాని, వాని అద్భుతశక్తి ప్రదర్శనలో అసాదారణ ప్రవర్తనలో కావు. మహాత్ముడనగా గొప్పవ్యక్తి అనెడి సామాన్యార్థము నాకు నచ్చదు. నేను మహాత్ముడనువానిని శాశ్వతముగా ఆత్మ భావరాహిత్యము కలిగి జీవించుచు గర్వము, అహంకారము, అధిక్యము లనెడి భావముల కతీతుడైయుండు ప్రాముఖ్యరహితునిగానో, నిరాదృతునిగానో నిర్వచింతును.

అనుభూతికి జ్ఞానము ప్రాథమికదశ అగుటచే అది అవసరమని అనివార్యమని అనువారు కొందరున్నారు. జ్ఞానము మేధాశక్తి సాధితము. అనుభూతి మేధాశక్తి కతీతమగు ఆత్మవికాసము. అందుచే మత సిద్ధాంతములలోని నిర్దుష్టతను వివరించగలవాడుకాని, చేయతగినవి నిర్ణయించగలవాడు కాని నిజమైన గురువుకాడు. గురువునుండి మనకు కావలసినయేమనగా ఆత్మవికాసము కలుగజేయు ప్రేరణమును సాక్షాత్కార మార్గమున పురోగమించు సమయమున ఆతని ప్రత్యక్ష ఆధారమును విజయమునుకోరినచో అట్టి గురువునే అన్వేషింపవలయును. కావున మనము ఆధ్యాత్మిక మార్గదర్శకుని నిర్ణయించుకొనునపుడు పరిగణింపవలసినది అనుభూతిరంగమున అతడు సాధించిన విజయములుకాని అతని పాండిత్యమో, అద్భుతశక్తియో కాదనుట తేటతెల్లము. తాను స్వతంత్రుడైననే నిన్ను శాశ్వత బంధవిముక్తుని చేయగలడు, నీగురువు సంస్కార, మాయాహంకార సబంధములనుండి విడివడనివాడై యున్నచో నిన్నా బంధనములనుండి విడిపించుట అతని కసాధ్యము.

ప్రాణహుతి:

నా గురుదేవుల అనుగ్రహమువలన సామాన్యముగ ప్రజలకు తెలియని ఒక గొప్ప రహస్యమును వెల్లడించుటకు ప్రయత్నించెదను. శ్రీకృష్ణుడు, స్వామి వివేకానందుడు, నా

గురుదేవుల వంటి మహావ్యక్తులు ఒక మనుష్యుని జీవితమును క్షణములో సంపూర్ణముగా మార్చివేయగలరనుట అత్యాశ్చర్యకరము. తనశక్తి వలన మనలను ఉన్నతోన్నత భూమికలకు కొనిపోగల గురువును అన్వేషించుట మనకు అత్యంత ఆవశ్యకము. ఈ రహస్యమే ప్రాణాహుతి. స్వచ్ఛమగు మనోమార్గము ద్వారా ఈశక్తి పనిచేయుచున్నది. ఎల్లప్పుడును ఫలప్రదమగు సంకల్పశక్తి వలన ప్రాణాహుతి ప్రయోగింపబడుచున్నది. ఆధ్యాత్మిక శిక్షణనిచ్చు అధ్యాపకుడు అభ్యాసి మనస్సును రూపొందించుటకు తన యిచ్ఛాశక్తిని ప్రయోగించినచో అది ఫలవంతమగుచుండును మరియు అద్భుత ఫలితముల నిచ్చుచుండును. కాషాయవస్త్రములు ధరించి వెంటనే గురువృత్తిని ప్రారంభించు స్వాములవార్లు చాలమంది తమశిష్యులు తాము చెప్పినది ఆసక్తితో వినినప్పటికిని ఆపిమ్మట కుక్కతోకవలె తమ వక్ర ప్రవర్తనమును మానరు అని వాపోవుచుందురు. కారణము స్పష్టము. స్వాములవార్లు ఇచ్ఛాశక్తిని వినియోగింపక అయినను ఉండవలెను లేదా ఆయన శక్తిలేనివాడైనను కావలయును. వారు తమ శిష్యులకు మిక్కిలి శ్రమతోకూడి నట్టివియగు సాదనలను నిర్దేశించి వారిని వారి తలవ్రాతకు వదలివేయుదురు. అసాధన ఫలితములు గురువునకు తెలియవు! శిష్యులు తమ విచక్షణను ఉపయోగించుటను గమనింపరు. శిష్యునకు స్థౌల్యము, బుద్ధిమాంద్యము బోధించు హక్కు ఉన్నదని ఎఱుకమాత్రమే గలిగి, తమ విధులను బాధ్యతలను పూర్తిగ విస్మరించు గురువులకు భ్రష్టత్వము, పతనము, నైతిక దురాచారములు తప్పవు.

సంశయాత్ములగు కొందు తనలో మార్పురావలెననెడి వానికే మార్పువచ్చునని అట్టిమార్పునకు గురువు కేవలము నామ మాత్రమే కారణుడు అని చెప్పచుందురు. శ్రీకృష్ణ భగవానునికి అట్టిశక్తియే ఉండియున్నచో కురుక్షేత్రయుద్ధము తెచ్చుటకుమారుగ దుర్యోధనుని హృదయమునే ఏల మార్చలేదు? మరియు అర్హతలేని వ్యకిన్తిగాని నిర్జీవమగు నొక వస్తువునుగాని మార్గదర్శిగ స్వీకరించి గొప్ప యోగియైనవారి అనేక కథలను వారు ఉదహరింతురు. కాని భగవద్విలాసములు అనూహ్యములగుటచే ఇది సత్యమును కనుగొను ప్రయత్నమునకు ఆటంకముకాదు. కొందరు దివ్యకృపవలన ప్రకాశవంతులగుదురు.

యోగ్యుడైన శిక్షకుడు ప్రాణాహుతి ద్వారా అభ్యాసి బుద్ధి యందలి అధమ ప్రవృత్తులను బలహీనపరచి అతని హృదయాంతరాళమందు దివ్యకాంతి బీజమును

నాటును. ఈ విధానమున శిక్షకుడు తనకాధారమగు దివ్యానంతమును. కలిగిన ఇచ్ఛాశక్తిని ఉపయోగించును. ఒక విధముగ అతడు దాని ఎరుక కలిగియుండును. అతడు సరిగా దానిని తన సత్సంకల్పమనెడు కటకము ద్వారా అభ్యాసి హృదయముపై కేంద్రీకరించును. ప్రారంభమున అభ్యాసి ఏమియు అనుభవింపకపోవచ్చును. అతడు ఇంద్రియములద్వారా మాత్రమే అనుభవించుటకు అలవాటుపడియుండుట దీనికి కారణము అయినప్పటికి కొంతకాలము పిమ్మట ప్రాణసంబంధ భాగములయొక్క కార్యములందును, చిత్తవృత్తుల యందును సూక్ష్మమార్పుల రూపమున ఉన్న ఈ ప్రాణాహుతి ఫలితములను అతడనుభవింపవచ్చును.

ప్రాణాహుతియను ఈ పురాతన విధానము యా దేశమున ప్రారంభింపబడి మన పూర్వమహర్షులచే విస్తారముగా ఉపయోగింపబడి, పుట్టిన ఈదేశమందె పూర్తిగా నశించిపోయి నేడు ఏ కొలది మందియో తప్ప నమ్మువారుకూడ లేని దశకు వచ్చుట అత్యంత దుఃఖకరము. అది ఇంద్రజాలమనియు సమ్మోహనవిద్య అనియు కొందరు దుర్వ్యాఖ్యకావించి హేళనచేయజూతురు. ఇంద్రజాలములు లేక సమ్మోహనవిద్య యొక్క ఫలితములు ప్రాణాహుతి యొక్క ఫలితములకు పరస్పర విరుద్ధములు. ఈ క్షుద్రకళల యందు, సమ్మోహనశక్తిని ప్రయోగించువాడు భౌతికశక్తి సాయమున తనయిచ్ఛాశక్తిని ఉపయోగించును. సమ్మోహనశక్తికిగురైన వ్యక్తి సంకల్పము బలహీనమై, సమ్మోహన పారవశ్యమునుండి మేల్కొనగనే తనకు మాంద్యమును,హృదయభారమును యుండుట గమనించును. సమ్మోహనశక్తినిబట్టియ, దానికి గురైన వ్యక్తి యొక్క దుర్బలత్వమును బట్టియు ఏదేని యొక వ్యాధిని పోగొట్ట వచ్చును లేదా అల్పమైన ఒక ప్రత్యేక చిత్తవృత్తిని కొంతవరకు అణచిపెట్టవచ్చును. , కాని ఈ ఫలితము ఎంతోకాలము నిలువదు. భౌతికవస్తువులను లేక మానసిక రూపములను ఏకాగ్రతావస్తువులుగ నుపయోగించి తీవ్ర శారీరక, మానసిక సాధనలచే సమ్మోహనశక్తి పెంపొందించబడును. ఈ సాదనలు తరచు మనోవికారము లేక ఉన్మాదమునకు దారితీయును. మరియు కొన్ని సమయములలో శారీరక వైకల్యములను కూడ కలిగించును. అయితే ఈ సాధన విజయవంతమయిననాడు ఏదేని ఒక భౌతికశక్తిని ఫలింపచేయవచ్చును. అది పరిమితమై యుండి ఉన్నంతవరకు కొన్నిరకముల కోరికలను సంతృప్తి పరచుకొనుటకు మాత్రమే ఉపయోగకరము.

ఉన్నతస్థితులను పొందుటకు అధ్యాత్మిక శిక్షణ కేవలము ప్రాణాహుతి విధానముననే సాధ్యమనియు, వేరు విధానమున కాదనియు నేనిట నొక్కి

వక్కాణించుచున్నాను. నేటి సమాజములోని విద్యావంతుల ముందీవిధానమును గూర్చి తరచు ప్రస్తావించినపుడు కొందరు మతబోధకులు ప్రాణాహుతియందే విశేషము లేదని ప్రజలకుచెప్పి ఈ విషయమున తమ శక్తిహీనతను సమర్థించుకొనుచున్నారు. సాధారణముగా ఒక మహాత్ముని సన్నిధిని గాని, మహర్షి సన్నిధినిగాని యున్నప్పుడు మనసును కలవర పరచు ఆలోచనలు కొంతవరకు తొలగిపోయి కొలదిసేపు ప్రశాంతత కలుగును. ఇది ఆ మహాత్ముని ప్రాణాహుతి ప్రభావమని వారు చెప్పుదురు. తమ అశక్తతను కప్పిపుచ్చుకొని ప్రజలను మోసపుచ్చు ఉద్దేశ్యముతో వారీ వివరణము నొసంగుచున్నారు. ఏది ప్రాణాహుతి అని వారు వివరింతురో అది ఆ మహాత్ముని నుండి తమంతతాముగా ప్రసారమగు పరమాణువులు. అవి అచట సమావేశమైన అందరిని ప్రభావితులను చేయును. తత్ఫలితముగా వారచట ఉండువరకు వారిలో కొంత ప్రశాంతత నెలకొనును. అది సహజానుభవమేకాని ప్రాణాహుతి కానేరదు. అట్టి పరమాణువులు కేవలము మహాత్ముని నుండి మహర్షినుండి మాత్రమే ప్రసరించుటలేదు. అవి ప్రతియొక్క నుండియు అతడు పవిత్రుడుకాని దుర్మార్గుడుకాని సాదువుకాని క్రూరుడుకాని ప్రసరించును. కొంత కాలము భక్తిరహితుడో, నైతిక పతితుడో అగువాని చెంతనున్నచో వానినుండి అటువంటి భక్తిరహిత పరమాణువులే ప్రసరించి మనలను ప్రభావితుల కావించును. తత్ఫలితముగా అప్పటికి మనస్సులోని ఆలోచనలును అదేధోరణిలో సాగును. అట్టి ప్రసార ప్రభావము స్వల్పకాలము మాత్రమే యుండి, ఆ వాతావరణము నుండి దూరమైన వెంటనే మాయమగును. ఇందుమూలముననే మతబోధకులు తరచు ప్రజలు బోధనల ననుసరించుటలో నిర్లక్ష్యభావము చూపుచున్నారని నిందింతురు. ప్రజలు వారి యుపదేశములను ఆలకించి వెళ్ళి దానిలో యిసుమంతయు మనస్సునందుంచుకొనకతాము విన్నదంతయు అప్పటికప్పుడే వదలివేయుదురని చెప్పుదురు. ఇందుకు నిందింపవలసినది ఉపదేశకునిగాని ప్రజలనుకాదు అని నేననుకొనుచుంటిని. ఏలయిన, తాను వేదికపైనుండి బోధించతలచినది వారి హృదయములలో ప్రతిపాదించుటకు వలయుశక్తి సామర్థ్యము లాతనిలోలేవు. కాని ప్రాణాహుతిశక్తి అత్యున్నత స్థితికి చెందిన యోగసిద్ధి. దీనిచే యోగి తన అత్మబలముతో ఎవనియందైనను యోగశక్తిని ప్రసరింపజేయవచ్చును. అది ఆతని యందు అధ్యాత్మిక పురోగతికి అవరోదముగ లేక హానికరముగ నున్న దేనినైనను తొలగింపగలదు. అతడీశక్తిని తనచుట్టు సమావేశమైయున్న వారిమీద కూడ ప్రయోగింపగలడు. ఈశక్తిని స్వాధీనపరచుకొన్నవాడు చూపు మాత్రమున అభ్యాసి తాను జీవితకాలమంతయు వెచ్చించికాని పొందలేనట్టి మానసిక స్థితిని ప్రస్తుత స్థితికంటె మిక్కిలి ఉన్నతమైనదానిని తాత్కాలికముగగాని,

శాశ్వతముగగాని కల్గింపజాలును. ఇది వట్టిమాటకాదు. సత్యవచనము; ఎవరేని కోరినచో ఎప్పుడైనను ప్రత్యేకముగా పరీక్షించి చూడ వచ్చును. ప్రాణాహుతిశక్తివలన మహర్షులు పలుమారు కేవలము చూపుమాత్రమున మానవుని ప్రకృతినే మూర్చివేసినారు. మా గురుదేవులను, స్వామి వివేకానందుడును మరికొందరట్టిమహాత్ముల దృష్టాంతములును దీనికి నిదర్శనములు.

నేను అనేక సంస్థల అధిపతులను కలసికొంటిని. నా అశ్చర్యమును పెంపొందించునట్లు ప్రతిచోటను ప్రాణాహుతిశక్తి విచారకరముగా లోపించి వారిలో ఎందరికో అది పూర్తిగా దూరమైనది. స్వామి వివేకానందులకు నిస్సంశయముగ అసక్తికలదు. కాని అట్టి మహాపురుషులు ఎప్పుడును అరుదు. పరమ పూజ్యులైన మా గురుదేవులవంటి మహాపురుషులు లోకమున కారణము లేకుండ జన్మింపరు.

యదార్థమునకు మనమందరమును చేత భిక్షాపాత్రనుదరించి భిక్షకులవలె గురుమందిర ద్వారమున వేచియున్నట్టివారము. ఆ పాత్రను గురువు వెంటనే నింపుదురు. కాని ఆపాత్ర ఆధ్యాత్మికతగాక యితర విషయములతో అప్పటికే నిండియున్నచో వారినుండి ఏదైనను లభించు అవకాశము ఏమియులేదు. అట్లు ఏదైన నింపినతక్షణము అది బయటకు ప్రవహించును. అందువలన ఆ పాత్రను గురు కృపతో నింపవలెన్న మనము మనలను ఖాళీగాచేసి ఉంచుకొనుటయే ప్రాథమిక విషయము.

# సప్తమ అధ్యాయము

సాక్షాత్కార మార్గమందలి దశలు :

చేరుకోవలసిన అత్యున్నత బిందువు లేక జీవితపు అంతిమ గమ్యము సంపూర్ణఅభావస్థితి, శూన్యస్థితి, దీనిని నేను పటమునందు సూచించుటకు ప్రయత్నించితిని.

కేంద్రము చుట్టును రచింపబడిన ఏకకేంద్ర ఋత్తములు రమారమి మన పురోగమనమునందు దాటునట్టి వివిధ ఆధ్యాత్మిక స్థితులను తెలుపుము. అత్యంత బాహ్యవృత్తము నుండి మనపయన మారంభించి తదనంతరదశ ప్రాప్తించుటకు ప్రతి వృత్తమును దాటుచు కేంద్రమువైపు పోవుదుము. ఇది అత్యంత విస్తారమైనది.

జీవకేంద్రమైన హృదయముమీద ధ్యానము చేయుచుగమ్యము పొందువరకును దానితో పురోగమింతుము. మనమార్గమున ఈ హృదయమండలమునందు ఐదు బిందువులు లేక ఉపకేంద్రములు కలవు. ప్రతి బిందువుయొద్దను ఈ క్రింది నాలుగు స్థితులను అనుభవింతుము : యీ వరుసక్రమమున :-

1. దివ్యశక్తి అంతటను వ్యాపించియున్నదను ఎరుక మనస్సు నందు నిరంతరము జాగరూకమైయుండుట. ఇదియొక విచిత్రస్థితి.
2. ఎల్లఎడల వ్యాపించియున్న ఒక దివ్యస్థితి, దాని స్మృతిలో లగ్నమైయుండుట.
3. దివ్యశక్తి యొక్క అనుబూతిగాని, స్మృతిగాని ఏదియు లేకుండుట, కాని అభావస్థితి మాత్రమే.
4. అన్నియు పోయెను. హృదయముపై ఏ గుర్తును లేదు. ఉనికియు గూడ.

ఈ నాలుగు స్థితులను ప్రతిమండలమందును ప్రతిబిందువు నొద్దను అనుభవింపబడును. సహజమార్గ ఆధ్యాత్మిక శిక్షణ పద్ధతియందు ప్రతియొక్కరును వాటి ననుభవింతురు. బహుశ సూక్ష్మతత్త్వమును ఎక్కువగ గ్రహింపగలవారు మాత్రమే ఆ

స్థితులన్నిటిని వాటి అతిసూక్ష్మ వివరణములతో అనుభూతిగాంచగలరు. మిక్కిలి క్రిందుగానున్న బిందువులనుండి పైనగల ఉపకేంద్రములద్వారా అత్యున్నత బిందువు నొద్దకు పోవుకొలదిని క్రమముగ అవి సూక్ష్మతరము లగుచుండును.

మనము ఐదవ బిందువును దాటిన వెంటనే అజ్ఞాచక్రము వైపునకు మనప్రయాణము సూటిగ అగును. ఈ బిందువునొద్ద స్థితి విచిత్రముగ నుండును. ఈ బిందువునుండి మనము వినియోగించు శక్తి క్రింది ప్రదేశములకు మరలింపబడును. ఈ బిందువు కడకు మనము పయనించునపుడు అనుభవమునకు వచ్చు ప్రధానస్థితి నీడవెనున్న చీకటిలాంటిది. ఇది మనము వెలుగునకు అతీతముగ తుదకు పురోగమింపవలెననుటకు సూచన మాత్రమే. దాని నిజప్రకృతి వెలుగును చీకటియుగాక అరుణోదయ వర్ణము వంటిదై యుండును.

హృదయమండలము యొక్క అయిదవవృత్తము దాటి మనోమండలమున ప్రవేశింతుము. ఈ మండలమునన్నున్న పదునొకండు వృత్తములు అహంకారపు వివిధ దశలను తెలియజేయును. వాటిగుండా పురోగమించుకొలది స్థితి సూక్ష్మతరము నిర్మలము నగును. ఇచ్చట ప్రతి వృత్తమునందును అసంఖ్యాకబిందువులును మరియు గ్రంథులును కలవు. ఈ ఆశ్చర్యకరమగు ప్రాణాహుతి యోగపద్ధతి వలన తప్ప సామాన్యముగ ఒక బిందువునుండి ఆతరువాత బిందువునకు పయనించుటకు ఒక సంపూర్ణ జీవితకాలము కావలసియుండును.

పదునారవ వృత్తమును చేరుకొను సమయమునకు మనము అహంకారమునుండి రమారమి విముక్తులగుదుము. మహర్షులలో మహోన్నతులగు వారియందు కూడ ఈస్థితి నందుకున్నవారరుదు. నేను చూడగలగునంతవరకు నా సమర్థ గురుదేవులుకాక పూర్వకాల మహర్షులలో కబీరుతప్ప ఈదశ (పదునారవవృత్తము) వరకు పురోగమించియుండగలవారు కానరారు. నా సమర్థ గురుదేవులు మానవసాధ్య పరిమితులకు మిక్కిలి అతీతస్థితులను పొందిరి. ఈ వృత్తము తరువాత మిగిలియున్నది సారూప్యత మాత్రమే. అది యింకను స్థూలరూపమున యున్నది.


ఈ బిందువును చేరుటకుముందు మనము సహస్రదళ కమలమందలి విరాట్ మండలము ద్వారా పయనింతుము. మహాభారతయుద్ధ సమయమున అర్జునుని దృష్టికి

గోచరించిన విరాట్ రూపము ఈ మండలము నుండియే తీసుకొనిరాబడినది. ఇదియే సకల విశ్వము. మనము దేనిని బ్రహ్మగతి లేక దివ్యస్థితియని అనవచ్చునో అట్టి మార్పులేని స్థితిని యిచటనే కొంతవరకు అనుభవింతుము. ఈ ప్రయాణ గమనమున వాటి స్వంత ప్రత్యేకలక్షణములు కలిగియున్న అనేక కేంద్రముల ద్వారా మనము దాటుదుము. కేంద్రమండలము నందలి ఏడు కాంతివృత్తములను దాటిన పిమ్మట విశాలము, అపరిమితము అయిన విస్తరణ, అనంతమున ప్రవేశించి అందులో యీదులాడుట ప్రారంభింతుము. ఇచట గురువు సహాయము యింకను అవశ్యకము. ఏలయిన యీదులాడువాని కష్టతరయాదులాటయందు అతని అతిసూక్ష్మశక్తి కూడపురోగమనమునకు ఆటంకమును సృష్టించు శక్తితరంగములను కలిగించును.ఏరకమైన యీదులాట ప్రతిఘటనా తరంగములను సృష్టింపదో, ఏది ఇంచుమించు తేలియాడుటకు సబంధము కలిగి తేలియాడుట కూడా కాదో అట్టి తేలిక యీదులాట కళను యీతగానికి నేర్పి, అనుభవజ్ఞుడు, సమర్థుడు, జాగరూకుడు అయిన గురువు మాత్రమే ఆ తరంగములను శాంతపరచుటకు సహాయపడును. తేలికగా యీదులాడు స్థితియొక్క అనందము ముందుప్రగతికి ఆటంకమగును. ఈతగాడు అట్టి స్థితిలోనికి జారిపోకుండ గురువు సహాయముకూడ చేసి ప్రయాణమున మున్ముందునకు తీసుకొనిపోవును.

ఇపుడు మనము నిద్రాణమైయున్న కేంద్రమండలము జేరుదుము. అదియును ఒక వలయముచే అవృత్తమైయున్నది అన్నట్లనిపించును. ఇదియే చిట్టచివరది. అది ఎట్టిదో అనుభవపూర్వకముగ తెలిసికొని వివరింపదలచి యందు నేనొక పర్యాయము ప్రవేశింప యత్నించితిని. క్షణమాత్రముగాని లోనికి తొంగిచూడగలిగినప్పటికి ఆకస్మికమైనదియు, బలమైనదియు, శక్తివంతమైనదియుగను త్రోపుడు నన్ను వెనుకకు నెట్టివైచినది. మానవుడు చేరగల అత్యున్నతమైన ఆధ్యాత్మికస్థితి యిదియేనని నన్ను యిది తీర్మానింపచేసినది. ప్రతియొక్కరును ఈ స్థానము వరకును, వీలగుచో దాని నధిగమించుటకు ప్రయత్నింపవలెనని నా కోరిక. స్థూల్యమైన సారూప్యస్థితి - నేను అన్నట్లుగ - చివరివరకు సున్నితము, సూక్ష్మమునగుచు వచ్చినది. మనమిపుడు కేంద్రమునకు అత్యంత సమీపముననున్న స్థితిని సాధించుకొంటిమి./ అదియే మానవసాధ్యమగు మహోన్నతస్థితి. ఇచ్చట మనము సత్యస్థితితో సన్నిహిత సమ్మేళనము కలిగియున్నాము. మానవుడు అంతిమస్థితి లేక కైవల్యస్థితియందున్న భగవంతునితో సన్నిహితమైనప్పుడు తానేమి, ఎక్కడున్నది, అతని అవగాహనకు అతీతము, ఆత్మకును భగవంతునకును మధ్య నామమాత్ర

భేదముండవలసియున్నది. కాన కేంద్రము లేదా సర్వశక్తియందు సంపూర్ణముగ లీనమగుట సంభవముగాదు.

మానవ సాధ్యమగు ఆధ్యాత్మికోన్నతియొక్క పరిమితియిది. కనుక ఆత్మసాక్షాత్కార మార్గమున అత్యంతోన్నత ప్రగతి సాధించగోరునతడు ప్రారంభము నుండియు ఈ గమ్యముపై దృష్టి నిలువవలెను. మహర్షులు యోగులందు చాల కొలదిమంది మాత్రమే దానిని గూర్చిన భావన నేమైనను కల్గియుండిరి. అనేక సందర్భములలో వారి పురోగతి ఎంతైనప్పటికిని రెండవ మూడవవృత్తముల వరకే. ఇంత ప్రాథమిక దశయందుండి కూడ వారు కొన్ని ఎడలతాము సాధించినది చాల గొప్పదని భావించుట దురదృష్టకరము. దివ్య విద్యా ప్రవీణులని పిలువబడుచు, బహిః స్వరూప సౌందర్యములచూచి మోసపోవు అమాయక ప్రజలచే పరిపూర్ణత్వమును పొందినవారుగ గౌరవింపబడుచున్న కొందరి స్థితిని చక్కగా నిర్ణయించుటకు వీలగుటకే నేనిది యంతయు చెప్పితిని.



శ్రీ రాంచంద్రజీ మహరాజ్ సేవాట్రస్టు (రి), 12-1289, కో ఆపరేటివ్ కాలనీ, కడప, ఆశ్రమ భవనం (ఏ.సి)